# తెలుగుదేశంలో పోలీస్ రాజ్యం



ఆంధ్ర ప్రదేశ్ పౌరహక్కుల సంఘం

APCLC

నవంబర్ 1986

ప్రచురణ : ఎ. పి. సి. ఎల్. సి.

ప్రతులు : వెయ్యి

మొదటి ముద్రణ : సెప్టెంబర్ '86

రెండవ ముద్రణ : నవంబర్ '86

కవరు పేజీ : నవంబర్ 7 ఉదయం అల్గునూరులో పోలీసుల చేత కాల్చి చంపబడ్డ ఎ.పి.సి ఎల్.సి. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జాప లక్ష్మారెడ్డి.

వెల రూ. 2/-

ముద్రణ : నాట్యకళ ప్రెస్, ఖైరతాబాద్, హైదరాబాద్-4



అంకితం:- ౩-౯-౮౫ న వరంగల్‌లో పోలీసులు హత్య చేసిన
**APCLC ఉపాధ్యక్షులు డా॥ రామనాథం గారికి**

మొదటి ముద్రణకు

# ముందుమాట

డాక్టర్ రామనాథంగారు మరణించి ఒక్క సంవత్సరం అయింది. 1985 సెప్టెంబర్ 3వ తేదీన వరంగల్ పట్టణంలోని ఆయన క్లినిక్‌లో ఆయనను పోలీసులు కాల్చిచంపారు. వరంగల్ రేంజి డి. ఐ. జి, జిల్లా ఎస్. పి. ల నాయకత్వంలో సాగుతున్న సాయుధ పోలీసుల ఊరేగింపు నుండి కొందరు వ్యక్తులు డాక్టర్‌గారి క్లినిక్ తలుపులు విరగ్గొట్టి, లోపల క్లినిక్‌ను ధ్వంసంచేసి, ఆయనను కాల్చి చంపారు. దుండగులను తాము బయటకు లాగినట్టు పైన పేర్కొన్న అధికారులు విలేఖరులతో అన్నారుగాని ఇప్పటివరకు డాక్టర్‌గారి హత్యకేసులో ఒక్కరిని అరెస్టుచేయడంగాని, విచారించడంగాని, ఆవగింజంత 'నేరపరిశోధన' గాని జరగలేదు. రాష్ట్రప్రభుత్వం సి. బి. సి. ఐ. డి. విచారణ జరిపింది. విచారణ చేసిన డి. ఎస్. పి. ఎట్లాగయినా ఆ హత్యచేసింది పోలీసులు కాదు, డాక్టర్‌గారి 'రాజకీయ శత్రువులు' అన్న సిద్ధాంతాన్ని ప్రతిపాదించడానికి శతవిధాలా ప్రయత్నిస్తున్నాడని ఆయన సాక్ష్యులను అడిగిన ప్రశ్నలనుబట్టే తెలుస్తోంది.

డాక్టర్‌గారిని ఏ 'రాజకీయ శత్రువులూ' చంపలేదు. ఆయన అభ్యుదయ భావాలు గల వ్యక్తి. తన సమకాలికులయిన ఎంతోమంది డాక్టర్లలాగ ఆయన హోటళ్ళు నడిపినట్టు నర్సింగ్‌హోంలు నడిపిఉండవచ్చును. ప్రభుత్వ ఆస్పత్రిలోని మందులను నల్లబజారులో అమ్మి లక్షలు సంపాదించి ఉండవచ్చు. ఆయన అవేవీ చేయలేదు. 'పిల్లలడాక్టర్'గా వరంగల్‌లో పేద ప్రజల ఆదరణపొందాడు. మిగిలిన సమయమంతా ఒక ప్రజాస్వామికవాదిగా పౌరహక్కుల ఉద్యమం కోసం వెచ్చించాడు. ఎమర్జెన్సీ ఎత్తివేసిననాటినుండి ఆయన ఎ.పి.సి.ఎల్.సిలో చురుగ్గా పనిచేస్తూఉన్నాడు. 1983 ఖమ్మం సభలనుండి రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షుడుగా, వరంగల్ జిల్లా కమిటీ అధ్యక్షుడిగా ఉన్నాడు. తన ఆరోగ్యం బాగా లేనప్పటికీ పౌరహక్కుల ఉద్యమంపట్ల ఆయన ఆసక్తిగానీ కమిట్‌మెంట్‌గాని రవ్వంతగూడ తగ్గలేదు.

డాక్టర్‌గారితో రాజకీయంగా విభేదించినవాళ్ళు చాలామంది వుండే వుంటారు. అయితే వాళ్ళెవ్వరికీ ఆయనను హత్యచేయవలసిన అవసరం లేదు. ఆ అవసరం కేవలం ప్రభుత్వానికీ, దాని సాయుధ బలగమైన పోలీసులకూ మాత్రమే వుంది. పోలీసు రాజ్యానికి ప్రత్యామ్నాయపదం అయిన వరంగల్‌లో పౌరహక్కుల కోసం పనిచేసిన క్రమంలో ఆయన పోలీసులకు వారిని నడిపించే ప్రభుత్వానికి శత్రువు కాక తప్పలేదు. ఎమర్జెన్సీలో అరెస్టుచేసి ఆయనను మీసా ఖైదీగా వుంచారు. 1985 జనవరిలో మళ్ళి అరెస్టుచేసి పేలుడు పదార్థాల చట్టం కింద కేసు పెట్టారు. ఆయన జైలులో వున్నప్పుడు గూడ డాక్టర్‌గా తన సామ

ర్థ్యాన్ని నలుగురికోసం వినియోగిస్తూనే వున్నాడు. వరంగల్ సెంట్రల్ జైలులోని జీవిత ఖైదీలనుండి జైలు సిబ్బందిదాకా ఎవ్వరూ 'డాక్టర్‌సాబ్'ను ఇప్పటికీ మరచిపోలేదు. ఒక్క ప్రభుత్వ యంత్రాంగం మాత్రమే ఆ మంచిమనిషిని శత్రువుగా భావించింది.

ఇది వ్యక్తిగతమయిన ద్వేషంకాదు తన అక్రమాలను నిరసించే గొంతుల పట్ల ద్వేషం. పౌరహక్కుల ఉద్యమాన్ని నాశనం చేయాలనే సంకల్పంతో డాక్టర్‌గారిని హత్య చేసారు. ఆయన హత్యకుముందూ వెనకాగూడ వరంగల్, కరీంనగర్ జిల్లాలలోనూ రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలలోనూ పౌరహక్కుల కోసం పనిచేసే వ్యక్తులపైన, ప్రత్యేకించి ఎ. పి. సి. ఎల్. సి. బాధ్యులపైన, దాడులు జరుగుతూనే ఉన్నాయి. ఎ.పి.సి.ఎల్.సి. బాధ్యులందరూగూడ డాక్టర్లు, లాయర్లు, అధ్యాపకులు, తదితర ఉద్యోగులయినప్పటికీ వాళ్ళను అరెస్టుచేసి, చిత్రహింసలకు గురిచేసి, కొట్టి, దూషించి తప్పుడు కేసులలో ఇరికించారు. తాము చేయడమేకాక ఇతర స్వప్రయోజనశక్తులకు మద్దతు ఇచ్చి వాళ్ళచేత చేయిస్తున్నారు. జగిత్యాలలో ఆర్.ఎస్.ఎస్. కార్యకర్తలు 1985 జనవరి 12 న తాలూకా ఎ.పి.సి.ఎల్.సి. ఉపాధ్యక్షుడు గోపి రాజన్నను హత్య చేశారు. వాళ్ళే మే నెలలో ఎ. పి. సి. ఎల్. సి. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలగోపాల్‌ను బస్‌స్టాండ్‌లో జనం అంతా చూస్తుండగా కర్రలతో, ఇనపకుర్చీలతో కొట్టారు, అదే రోజున లక్సెట్టిపేటకు చెందిన శంకర్ అనే లాయర్‌ను గూడా విపరీతంగా కొట్టారు. ఇప్పటివరకు ఈ కేసులో ఒక్కరినిగూడ పోలీసులు అరెస్టు చేయలేదు. చేయబోరుగూడ. కాకతీయ విశ్వవిద్యాలయంలో అధ్యాపకుడు, వరంగల్ జిల్లా ఎ.పి.సి.ఎల్.సి. కార్యవర్గ సభ్యుడు అయిన సీతారామారావు ఇంటిమీద గత అక్టోబర్‌లో దాడిచేసి అతన్ని కర్రలతో, గొడ్డళ్ళతోకొట్టి కాళ్ళూ చేతులూ విరగగొట్టారు. ఆ దుండగులు పోలీసులేనని అందరూ అనుకుంటున్నారు. అయినా కాకున్నా ఇంతవరకు ఒక్కరిని గూడ పోలీసులు అరెస్టు చేయలేదు.

మేధావులు పౌరహక్కులకోసం పనిచేయడానికి వీలులేదని, వకీళ్లు కేసులు చేయడానికి వీలులేదని, ఈ పద్ధతిలో లొంగదీసుకునే ప్రయత్నం చేస్తోంది ప్రభుత్వం. ఈ రాక్షసత్వానికి తట్టుకోలేక వరంగల్, కరీంనగర్ జిల్లాల ఎ.పి.సి. ఎల్.సి. బాధ్యులు చాలామంది సంస్థకు రాజీనామా చేసారు. ఇది తన విజయంగా

ప్రభుత్వం భావిస్తోందేమోగాని, ఈ బలవంతపు రాజీనామాలవల్ల వాళ్ళ విశ్వాసాలేమీ మారలేదని, వాళ్ళెప్పుడూ ప్రజాస్వామిక ఉద్యమానికి మద్దతుగాఉంటారని, ప్రజలకు తెలుసు.

ఇన్ని దాడులుచేసినా, ఎంతమందిని కొట్టినా, చంపినా తప్పుడు కేసులతో ఇరికించినా, పౌరహక్కుల ఉద్యమం నాశనం కాదు. ఎ.పి.సి.ఎల్.సి. పనిచేయడం మానేయదు, మానేయలేదు. మామీదపడే ఒక్కొక్క దెబ్బ మా సంకల్పాన్ని మరింత దృఢతరం చేస్తోంది తప్ప నాశనం చేయదు. అన్ని రంగాలలోనూ ప్రజలమీద రాక్షసంగా దాడులుచేస్తున్న రాజ్యాంగ యంత్రాన్ని ఎదుర్కొనడంలో ఎ.పి.సి.ఎల్.సి. తన కర్తవ్యాన్ని కొనసాగిస్తూనే ఉంటుంది.

అందులో భాగంగానే, జాతీయ స్థాయిలో అన్ని పౌరహక్కుల సంస్థల చేత 'పౌరహక్కుల దినంగా' గుర్తించబడిన డాక్టర్‌గారి వర్థంతి సందర్భంగా ఈ పుస్తకం ప్రచురిస్తున్నాం. గత సంవత్సర కాలంలో మన రాష్ట్రంలో ప్రజల హక్కులపైన రాజ్యాంగ యంత్రం చేసిన దాడులను పూర్వాపరాలతో ఈ పుస్తకం వివరిస్తుంది.

సెప్టెంబర్ 3. 1986

ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం.
(ఎ.పి.సి.ఎల్.సి.)

రెండవ ముద్రణకు

# ముందుమాట

గత రెండు నెలల కాలంలో మన రాష్ట్రంలో కొన్ని ముఖ్యమైన సంఘటనలు జరిగాయి. ఆంధ్రరాష్ట్రం అవతరించిన తరువాత మొట్టమొదటసారిగా పౌర హక్కుల గురించి, పోలీసు అత్యాచారాల గురించి, లాకప్పులో మరణాలగురించి, కేవలం పౌరహక్కుల సంస్థలేకాక ప్రతిపక్ష నాయకులు, పత్రికా సంపాదకులు, తదితర పెద్దలంతా మాట్లాడారు. బంద్‌లూ, ధర్నాలు, ప్రదర్శనలు, బహిరంగ సభలు నిర్వహించారు.

ఈ సంచలనానికి నేపథ్యం సెప్టెంబర్ నెలలో ఒక వరుసగా జరిగిన లాకప్పు హత్యలు. సెప్టెంబర్ 6, 9, 15, 17, 23 తేదీలలో రాష్ట్రంలోని విభిన్న ప్రాంతాలలో పోలీసు కస్టడీలో నిందితులు మరణించడం జరిగింది. ఈ అయిదుకాక, ఆగస్టు నెలలో బెల్లంపల్లి (అదిలాబాద్ జిల్లా) లో జరిగిన ఒక కస్టడీ మరణం సెప్టెంబర్ 19వ తేదీన వెలుగులోకి వచ్చింది. అక్కడితో ఆగక, ఈ అలజడి చల్లారకముందే అక్టోబర్ 7వ తేదీన హైదరాబాద్‌లోని సనత్ నగర్ పోలీస్‌స్టేషన్‌లో మరొక కస్టడీ మరణం జరిగింది.

ఈ కస్టడీ మరణాల కథలు ఇక్కడ వివరించి చెప్పనవసరం లేదు. ఎక్కడ జరిగినా ఎప్పుడు జరిగినా వాటి సారాంశం ఒక్కటే. ప్రతిపక్ష నాయకులు అకస్మాత్తుగా కస్టడీ మరణాలమీద అలజడి ఎందుకు చేసారనేదిగూడ పెద్దగా చర్చించాల్సిన విషయం కాదు. రెండేళ్ళక్రితం పౌరహక్కుల సంస్థలకు తప్ప వేరే ఎవ్వరికీపట్టని విషయాలగా వుండేవి కస్టడీ మరణాలు. పౌరహక్కుల సంస్థలు అలజడి చేయగా చేయగా ఇప్పుడు పత్రికలు, ప్రతిపక్ష పార్టీలు ఆ మరణాలను వ్యతిరేకించవలసిన అవసరం వుందని గుర్తించాయి.

మరి ఈ సంచలనం సందర్భంలో చర్చించవలసిన విషయం ఏదీ లేదా అంటే వుంది. అది ప్రభుత్వం వైఖరి, అసలు కస్టడీ మరణాలకు నిజమయిన బాధ్యత ప్రభుత్వానిది. ప్రజల సమస్యలు పరిష్కరించలేక, ఉద్యోగం, కూడు గుడ్డ ఇవ్వలేక, తత్ఫలితంగా ఒకవైపున నేరాలు మరోవైపున రాజకీయ ఉద్యమాలు చెలరేగగా, పోలీసులకు విచ్చలవిడి అధికారం యిచ్చి జనంమీద వదిలింది ప్రభుత్వం. దాని పర్యవసానంగానే 'ఎన్‌కౌంటర్' హత్యలూ, కస్టడీ హత్యలూ జరుగుతున్నాయి. అందుకే ఈ అత్యాచారాలుచేసే పోలీసు అధికార్లను ప్రభుత్వం ఏమి చేయదు, చేయలేదు. అయితే ఈ వాస్తవాలను బహిరంగంగా ఒప్పుకోవడం సాధ్యంకాదు కాబట్టి పాము చావకుండ కర్ర విరగకుండ ప్రకటనలు ఇస్తుంది. ఒకవైపు కస్టడీ హత్యలను సహించబోమంటూ ఇంకొకవైపు పోలీసులు ప్రభు

త్వానికి 'కుడిభుజం' అని, పోలీసులు దేవుళ్ల అని ఎన్టీఆర్ అంటాడు. ఒకవైపు సెప్టెంబర్ నెలలో జరిగిన అన్ని కస్టడీ మరణాలమీద న్యాయ విచారణ ప్రకటించి, మరోవైపు ఆ ఆరింటిలోనికీ అత్యంత ప్రాచుర్యం పొందిన మురళీధరన్ హత్య (విజయవాడ 6వ టవున్) 'దేవర నాగులు' హత్యగా ప్రగారంఅయిన దాసరి వెంకటేశ్వర్లు హత్య, (గుంటూరు జిల్లా మాచర్ల) కేసులలో ప్రధాన నిందితులయిన ఎస్. ఐ. లను ప్రభుత్వం సస్పెండ్ చేయడానికి అరెస్టుచేయడానికి నిరాకరిస్తుంది. మాచర్లలో చేసినట్టు శవాన్ని మాయించేసినా, బెల్లంపల్లిలో చేసినట్టు మెజిస్ట్రీరియల్ విచారణదగ్గరే పోలీసులు గాలిలోకి కాల్పులు జరిపినా ఉపేక్షిస్తుంది.

ప్రభుత్వం వ్యవహారం ఇట్లాగుండగా ఉన్నత పోలీసు అధికార్లుగూడ లాకప్పుల్లో జరిగే చిత్రహింసలతో తమకేమీ నిమిత్తంలేనట్టు, అదేదో క్రింది స్థాయి పోలీసు ఉద్యోగులు తమంతట తాము తెలివితక్కువతనంవల్ల చేస్తున్నట్టు ప్రవర్తిస్తున్నారు. అక్రమ నిర్బంధంలో ఉన్నవారినందరినీ బయటపారేయవలసిందనీ, డి. జి. పి. రాష్ట్రంలోని అన్ని పోలీస్టేషన్లకూ ఆదేశం ఇచ్చినట్టు పత్రికలలో వార్తలు వచ్చాయి. అంటే ఈ రెండు నేరాలూ జరుగుతున్నట్టు డి. జి. పి. ఒప్పుకుంటున్నాడన్నమాట. ఒప్పుకున్నవాడు వెంటనే చేయవలసింది మొత్తం పోలీసు యంత్రాంగాన్ని (తనతోసహా!) అరెస్టుచేసి భారత శిక్షాస్మృతి సెక్షన్లు 331, 348 ల క్రింద విచారణ జరపడం. అంతేగాని 'చిత్రహింసల సాధనాలన్నీ బయట పారేయండి' అని ఉపదేశం ఇవ్వడం కాదు.

ఇక్కడ మరొక బూటకంకూడ వుంది. మన దేశంలో పోలీసులు చిత్రహింసలు ప్రయోగించడానికి ప్రత్యేకమయిన సాధనాలేమీ ఉపయోగించరు. లాఠీలతో, చేతులతో, బూట్లతో, కర్రలతో కొట్టడం, రోకలిబండలు ఎక్కించడం రబ్బరు పరికరాలతో గాయం కనబడకుండా కొట్టడం - 90 శాతం చిత్రహింసలు ఈ విధంగా సాగుతాయి. అంతేకాదు, లాకప్పులో మరణానికి భౌతిక హింస ఒక్కటే కారణం కాదు. అశుభ్రమయిన లాకప్పులలో దీర్ఘకాలం తిండి లేకుండ, శుభ్రంగా వుండడానికి నీళ్లు లేకుండ వుంచడం ఒక ముఖ్యమైనకారణం. ఉదాహరణకు అక్టోబర్ 7వ తేదీన హైదరాబాద్‌లోని సనత్‌నగర్ పోలీస్టేషన్ నుండి జైలుకు పంపిన తరువాత చనిపోయిన మహమ్మద్‌సలీంను పోలీసులు

కొట్టింది తక్కువే. 25 రోజుల అక్రమ నిర్బంధంలో ముఖంమీద కుట్టిన దోమల కాట్లు చీముపట్టి, మందివ్వించమని పోలీసులను అడుక్కున్నా వినిపించుకోక పోగా, ముఖమంతా చీముఅయి చివరకు మెదడకూ ఊపిరితిత్తులకూ గూడ చీము పట్టగా సలీం చనిపోయాడు. 'చిత్రహింసలకు ఉపయోగించే పరికరాలు బయట పారేయండి' అని ఆదేశించడం ఈ వాస్తవాలను కప్పిపుచ్చడానికే.

కస్టడీలో మరణం జరిగినప్పుడల్లా భారత శిక్షాస్మృతి సెక్షన్ 302 (హత్య) క్రింద కేసు నమోదు చేస్తున్నట్టు ప్రభుత్వం ఇచ్చిన ప్రకటన మరొక బూటకం. నిజానికి ఇప్పటిదాకా చేస్తున్నది నేరవిచారణ స్మృతి సెక్షన్ 174 (అనుమానస్పదస్థితిలో మరణం) క్రింద ప్రాథమిక సమాచార నివేదిక (FIR) నమోదుచేసుకోవడం మాత్రమే. ఒకవేళ అట్లాకాకుండా సెక్షన్ 302 కిందే ఎఫ్. ఐ. ఆర్. రాసుకున్నా వచ్చే తేడా ఏమీ లేదు. నాలుగురోజులు 'పరిశోధన' జరిపి, 302 కింద కేసులేదనితేల్చి 174 కింద మూసేయవచ్చు. సెక్షన్ 302 కింద ఎఫ్. ఐ. ఆర్. రాసుకోడానికీ ఎస్. ఐ. మీద హత్యకేసు పెట్టి అరెస్టుచేయడానికీ హస్తి మశకాంతరం వుందని గుర్తించని పత్రికలు దురదృష్టవశాత్తు ఈ ప్రకటనకు పతాకశీర్షిక ఇచ్చాయి.

ఎట్లాగయితేనేం, ఏడు ప్రాణాలు నిష్కారణంగా పోయినా, కస్టడీ హత్యల గురించి ప్రజలలో నిరసన ఇతోధికంగా ప్రజ్వరిల్లడం సంతోషించదగ్గ విషయమే.

**నవంబర్ 1986** **ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం.**

**(ఎ.పి.సి.ఎల్.సి.)**

# నేపథ్యం

మన రాష్ట్రాన్ని పోలీసు రాజ్యంగా మార్చే క్రమం గత సంవత్సర కాలంలో బాగా బలంపుంజుకుంది. ఈ విషయం ప్రజలకూ పోలీసు అధికార్లకూ గూడ స్పష్టంగా అర్థంఅయింది. ఇదివరకటిలాగ అత్యాచారాలు చేసే పోలీసు అధికార్లు సిగ్గుపడటంలేదు, భయపడటంలేదు. 'నీ దిక్కున్నచోట చెప్పుకో' అని అత్యాచారాలు చేస్తున్నారు. పోలీసు అత్యాచారాలకు సంబంధించినంతవరకు 'దిక్కున్నచోటు' అనేదిలేదని వాళ్ళ ధీమా. పత్రికా విలేకరులమీద పోలీసులు ఉధృతంగా చేస్తున్నదాడులు ఈ ధీమాకు చక్కటి నిదర్శనం. అత్యాచారాలు చేస్తే ప్రజాభిప్రాయం తమకు వ్యతిరేకమవుతుందని గానీ, ప్రభుత్వం శిక్షిస్తుందని గానీ ఏ మాత్రం భయండున్నా కనీసం పత్రికావిలేకరుల జోలికిపోయేవారుకాదు.

ఈ పరిస్థితికి కారకులు పోలీసులు కారని, మన దేశాన్నీ, రాష్ట్రాన్నీ పరిపాలిస్తున్నవాళ్ళేననీ వేరే చెప్పనవసరంలేదు. పోలీసు యంత్రాంగం తనంతట తాను ఇంత విస్తృతపరిధిలో అత్యాచారాలు చేయదు. పైనుండి 'గ్రీన్‌సిగ్నల్' ఉంటేనే చేయగలుగుంది. ఈ గ్రీన్‌సిగ్నల్ అన్ని కాలాలలో, అన్ని ప్రాంతాలలో ఉంటూనే ఉంటుంది. అయితే అప్పుడప్పుడు మధ్యలో ఎర్రలైటు వెలుగుతూంటుంది. గతంలో ఒకసారి బీహారులోనె ఒక పోలీస్‌స్టేషన్‌లో ఒక స్త్రీపైన పోలీసులు అత్యాచారం చేశారని ఆ రాష్ట్ర అసెంబ్లీలో గొడవకాగా, 'కనీసం అసెంబ్లీ సమావేశమయి ఉండగా ఇటువంటివి జరగకుండా చూసుకోండి' అని ఆ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ అన్ని జిల్లా పోలీస్ కేంద్రాలకూ సర్క్యులర్ పంపాడట. ఇప్పుడు అటువంటి 'జాగ్రత్తల'కు గూడ స్థానం లేకుండాపోయింది. గ్రీన్‌సిగ్నల్ నిరవధికం అయిపోయింది. దానికి అసెంబ్లీలో ప్రశ్నలతో, పత్రికలలో వార్తలతో, కోర్టులలో పిటిషన్లతో నిమిత్తంలేకుండా పోయింది.

ఈ పరిస్థితిని వివరంగా సమీక్షించేముందు అందుకుగల కారణాలేమిటో కాస్త ఆగి ఆలోచించాలి. మన రాష్ట్రాన్నిగాని, మొత్తం దేశాన్నిగాని పోలీసు రాజ్యంగా మార్చాల్సిన అవసరం మన పాలకులకు ఏం వచ్చింది? దేశంలో అల్లర్లు జరగకుండ చూడడానికి ఎన్నో మార్గాలుంటాయి. వాటిలో బలప్రయోగం ఒకటిమాత్రమే. అది అన్నిటికంటే అవాంఛనీయమయినదని అందరూ (కనీసం మాటమాత్రంగా) ఒప్పుకుంటారు. అన్నిటికంటే ఉత్తమమయిన పద్ధతి సంక్షేమ కార్యక్రమాలను సక్రమంగా అమలుచేయడం అని అందరూ అంటారు. ప్రజల కనీస అవసరాలు సవ్యంగా తీరితే అల్లర్లూ, నేరాలూ చాలావరకు ఉండవని సామాజిక శాస్త్రవేత్తల అభిప్రాయం. 1947 తరువాత మన ప్రభుత్వాలు

కొంతకాలం ఈ సిద్ధాంతాన్ని అనుసరిస్తున్నట్టు భ్రమకలిగించాయి. కౌలుదారీ చట్టాలు, భూమి గరిష్ఠపరిమితి చట్టాలు, కనీస వేతనచట్టాలు తయారుచేసారు. వాటిని అడపా దడపా సవరిస్తూ కొత్త షెడ్యూల్సు, కొత్త నియమాలు కల్పించి 'పటిష్టం' చేసారు. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడ్డవాళ్ళకు రిజర్వేషన్లూ, రాయితీలూ ప్రత్యేకా సౌకర్యాలూ కల్పిస్తూ చట్టాలు చేశారు. విద్యావ్యాప్తికోసం స్కూళ్లు తెరిచారు, స్కాలర్‌షిప్‌లు ఇచ్చారు. సన్నకారు చిన్నకారు రైతుల కోసం అని చెప్పి ఐ.ఆర్.డి.పి.లు, ఎస్.ఎఫ్.డి.ఎ.లు, ఎస్.సి-బి.సి. కార్పొరేషన్లు, వరపతి సంఘాలు ఆవిష్కరించారు. వృత్తిపనివాళ్ళకోసం, గిరిజనుల కోసం, కొనుగోలు కార్పొరేషన్‌లు, వినిమయ సహకార సంఘాలు కల్పించారు. ఈ జాబితా చదివితే చాలా బావుంటుంది గాని ఇదంతా అమలులో ఏమయిందో చూస్తేమాత్రం నిరుత్సాహం అనిపించక తప్పదు. మన రాష్ట్రానికి సంబంధించి తలసరిఆధాయం, నిరక్షరాస్యత, భూమి పంపకం, విద్యావైద్యసౌకర్యాలు మొదలయిన కొన్నిటి పరిస్థితి చూడండి.

| | |
|---|---|
| తలసరి సంవత్సర ఆదాయం. | రూ॥ 756 (1970 ధరలలో) |
| అక్షరాస్యత (1981) | 29.9 శాతం |
| షెడ్యూల్డు కులాలలో | 11.7 శాతం |
| షెడ్యూల్డు తెగలలో | 7.82 శాతం |
| విద్యమీద ప్రభుత్వం చేసే తలసరి సంవత్సర వ్యయం | రూ॥ 74 |
| నమోదయిన నిరుద్యోగుల సంఖ్య (1983) | 20.35 లక్షలు |
| ప్రభుత్వ ఆస్పత్రులలో పడకల సంఖ్య | 27,300 |
| అంటే జనాభాలో 2200 మందికి 1 ఆస్పత్రి పడక | |
| ప్రభుత్వ ఆస్పత్రులలో వైద్యుల సంఖ్య | 5,445 |
| అంటే జనాభాలో 11000 మందికి 1 ప్రభుత్వ వైద్యుడు | |
| వైద్యం మీద ప్రభుత్వంచేసే తలసరి సంవత్సర వ్యయం | రూ॥ 15 |
| భూసంస్కరణలలో గుర్తించిన మిగులు భూమి | 10.5 లక్షల ఎకరాలు |
| మొత్తం వ్యవసాయ యోగ్యమయిన భూమిలో యిది | 1.7 శాతం |

| | |
|---|---|
| విద్యుత్ సౌకర్యాలులేని గ్రామాల సంఖ్య | 6,560 |
| సామాజిక సంక్షేమ చర్యలమీద ప్రభుత్వం చేసే తలసరి సంవత్సర వ్యయం | రూ॥ 54 |
| గృహనిర్మాణం మీద ప్రభుత్వం చేసే తలసరి సంవత్సర వ్యయం | రూ॥ 6 |

ఒకవైపు కొత్తగా కల్పిస్తామన్న సౌకర్యాలూ హక్కులూ ఇట్లాపోగా సంప్రదాయికంగా పేదవాళ్లు అనుభవిస్తూవున్న ప్రకృతి సంపదను గూడ వాళ్ళకు కాకుండా చేస్తున్నారు. అంటే ప్రభుత్వం చలవ వల్ల, పేదలు ధనవంతులు కావడమటుంచి మరింత పేదవుతున్నారు. పేదల చేతినుండి ప్రకృతి సంపదను లాక్కోవడంలో గల ఉద్దేశాలు రెండు. ఒకటి, దానిని ధనవంతుల చేతిలో పెట్టడం. రెండు, తద్వారా ప్రభుత్వం తన రెవెన్యూ ఆదాయం పెంచుకోవడం. అడవిలో ప్రకృతి సంపదను అనుభవిస్తోన్న గిరిజనులను అడవినుండి తరిమేసి, కాగితపు పరిశ్రమకూ, కలప పరిశ్రమకూ అవసరమయిన ప్లాంటేషన్లు చేపట్టారు. ప్రస్తుతం అటవీ ఉత్పత్తుల సంవత్సర విలువ కోట్లు దాటింది. అంటే వ్యాపారస్తుల లాభాలు ప్రభుత్వ రెవెన్యూగూడ కోట్లలోనే వున్నాయి. తరతరాలగా కల్లు, సారా మొదలయిన మాదక ద్రవ్యాలను తక్కువ పరిమాణంలో సేకరించి లేక ఉత్పత్తిచేసి తమ జీవనం సంపాదించుకుంటున్న ప్రజలను పక్కకు నెట్టి మాదక ద్రవ్యాల తయారీని అమ్మకాన్నీ భారీ వ్యాపారంగా మార్చారు. దీనివల్ల ప్రభుత్వం ఎక్సైజ్ రెవెన్యూ 400 కోట్లు దాటిపోగా కాంట్రాక్టర్లు మళ్ళీ అంతమొత్తం లాభాలరూపంలో గడిస్తున్నారు. చెరువుల్లో చేపలుపట్టుకునే హక్కు, పోరంబోకుల లోని చింతకాయలు సేకరించే హక్కు చెరువు కట్టలమీది తుమ్మలను వంటచెరుకుగా అమ్ముకునే హక్కు - ఒకటేమిటి, తరతరాలగా పేద ప్రజల జీవనానికి తోడ్పడిన సంపదంతా కాంట్రాక్టర్ల గుత్త అయింది. దానివల్ల పేదప్రజల కడుపు కొట్టి కాంట్రాక్టర్లు లాభాలు పొందితే ప్రభుత్వం రెవెన్యూ పొందుతోంది. ఆ రెవెన్యూ వివిధ రూపాలలో మళ్ళీ ధనికవర్గాల అవసరాలు తీర్చడానికే వెచ్చించబడుతోంది.

ఇవన్నీ దృష్టిలో ఉంచుకుంటేగాని భారతదేశం అందులో భాగంగా మన రాష్ట్రం - పోలీసు రాజ్యం కావలసిన అవసరం ఏమిటో అర్థం కాదు. ప్రజలకు జీవనం గడవడం కష్టం అయ్యేకొద్దీ 'అల్లర్లు' రకరకాలుగా పెరిగిపోతాయి. మామూలు నేరాలు పెరిగిపోతాయి. పేదరికం నేరానికి గల ముఖ్య కారణాలలో ఒకటని అందరూ గుర్తిస్తారు. అంతేకాక పేద ప్రజల నిరసగూడ రకరకాల

స్థాయిలలో వ్యక్తం అవుతుంది. ఒక్కొక్కసారి సంఘటితమయిన ఉద్యమాల రూపంలో, ఒక్కొక్కసారి అల్లర్ల రూపంలో వ్యక్తమవుతుంది.

వీటిని ఎదుర్కోవడానికి తుపాకులూ నల్లచట్టాలూ-పోలీసులూ, సైన్యం, పేరామిలిటరీ-తప్ప మనపాలకుల దగ్గర వేరే సాధనాలు లేవు. తమ పరిపాలనా విధానాల ప్రత్యక్ష ఫలితం అయిన సామాజిక అశాంతిని వాళ్ళు 'శాంతిభద్రతల' సమస్యగా తప్ప వేరేరకంగా చూడలేరు. దేశంలో పోలీసు యంత్రాంగం ప్రాముఖ్యత పెరిగిపోవడానికి గల ముఖ్యకారణం యిదే. మీ యిష్టంవచ్చినట్టు 'శాంతి భద్రతలు' నెలకొల్పండి, మీ వెనక మేమున్నాం అని మన పాలకులు పోలీసు యంత్రాంగానికి హామీయిచ్చారు. అందుకే ఆ యంత్రాంగం అంత విచ్చలవిడిగా ప్రవర్తించగలుగుతోంది.

దేశపరిపాలనలో పోలీసు యంత్రాంగం పాత్ర ఎంతగా పెరిగిపోయిందో గత సంవత్సర కాలంలో జరిగిన కొన్ని సంఘటనలను గుర్తుతెచ్చుకుంటే అర్థమవుతుంది. విజయవాడ అర్బన్‌జిల్లా ఎస్.పి.గా వుండిన వ్యాస్ అనే పోలీసు అధికారి కలప అక్రమ కొనుగోలుకేసులో పట్టుబడ్డాడు. కలపను తీసుకుపోతున్న లారీతోబాటు విజయవాడ అర్బన్‌పోలీస్‌జిల్లాకు చెందిన ఒక జీపుకూడ దొరికింది. అయితే ప్రభుత్వం, కలపను వ్యాస్‌కు అక్రమంగా అమ్మిన అటవీశాఖ అధికారి మీద చర్యతీసుకుందిగాని, వాస్‌మీద తీసికోలేదు. కలప దొంగ రవాణా జరిగిందని ఒప్పుకోకపోగా, స్వంతపనిమీద పోలీసుజీపును, ప్రభుత్వ గెస్ట్‌హౌస్‌ను ఉపయోగించుకోవడం తప్పుకాదా అని అసెంబ్లీలో ప్రతిపక్షాల వాళ్ళు ప్రశ్నించగా, జీపులను, గెస్ట్‌హౌస్‌లను దుర్వినియోగంచేయడం కొత్తవిషయం కాదు. అందరూ చేస్తున్నదే అని ముఖ్యమంత్రి స్వయంగా సమాధానమిచ్చాడు. పైగా, మీరు మాత్రం చేయలేదా అని కాంగ్రేస్ సభ్యులను ఎదురు ప్రశ్న వేసాడు. కడుపు చించుకుంటే కాళ్ళమీద పడుతుందని వాళ్ళుగూడ మౌనం వహించారు.

తూర్పుగోదావరి జిల్లా ఎస్.పి. బదిలీగురించిగూడ చాలా గొడవజరిగింది. ఒక ఎస్.ఐ. బదిలీ విషయంలో స్థానిక ఎం.ఎల్.ఏ. ఆదేశాన్ని పాటించలేదని ఎస్.పి.ని బదిలీ చేసినట్టు పత్రికల కథనం. వెంటనే ప్రతిపక్షపార్టీలు ఆ బదిలీని ఆపడానికి జిల్లాలో బంద్ నిర్వహించాయి. చెప్పుకోదగ్గ విషయం ఏమిటంటే తూర్పుగోదావరి జిల్లా ఏజెన్సీ ప్రాంతాలలో గత రెండేళ్ళ కాలంలో జరిగిన పోలీసు అత్యాచారాలకు లెక్కలేదు. గిరిజన స్త్రీలపైన పోలీసులు అత్యాచారాలు చేస్తున్నారని, గిరిజన గ్రామాలను తగలబెడుతున్నారని, పత్రికలలో వార్తలు వచ్చాయి. ఈ అత్యాచారాలు జరుగుతున్నందుకు జిల్లా ఎస్. పి. మీద చర్య తీసుకోవాలని ఎవ్వరూ గొడవ చేయలేదు. పాలకపార్టీ ఎం.ఎల్.ఏ పైరవీ చేయ

లేదు, ప్రతిపక్షాలు బంద్ నిర్వహించలేదు. కాని తమ అవసరాలకు భంగంకలిగే సరికి ఇరుపక్షాలూ పెద్దఎత్తున కదిలారు.

మహబూబ్‌నగర్ జిల్లా ఎస్. పి. బదిలీ విషయంలో కూడ ఇటువంటి గొడవే జరిగింది. గత సంవత్సరం జులై 16, 17 తేదీలలో మహబూబ్‌నగర్‌లో చెలరేగిన మతకల్లోలాలలో ముగ్గురు ముస్లింలు చంపబడ్డారు. పోలీసులు బి.జె.పి, తెలుగుదేశం, ఆర్.ఎస్.ఎస్. కార్యకర్తల ఇళ్లమీద దాడులుచేసి వాళ్లను కొట్టడం, నిర్బంధించడం మొదలు పెట్టారు. ఎంతటి నేరస్తులయినా చట్టం ప్రకారమే శిక్షించాలన్న వాస్తవాన్ని తమ జీవితంలో మొట్టమొదటసారి గుర్తించిన ఈ పార్టీలు ఎస్.పి.కి వ్యతిరేకంగా గొడవచేసి, బంద్ నిర్వహించి, రాష్ట్ర ప్రభుత్వంతో తమకున్న సత్సంబంధాన్ని వాడుకొని ఎస్.పి.ని బదిలీచేయించారు. ఇతర ప్రతిపక్షాలు ఈ బదిలీని నిలపడానికి అలజడిచేసి విఫలమయ్యాయి.

ఇక్కడ గమనించవలసిన విషయం ఫలానా ఒకరిద్దరు పోలీస్ అధికారుల ప్రాముఖ్యం కాదు. ఇది వ్యక్తులకు సంబంధించిన విషయం కాదు. మొత్తం పోలీసు యంత్రాంగానికి రోజు రోజుకూ పెరిగిపోతున్న ప్రాముఖ్యాన్ని ఈ ఉదంతాలు సూచిస్తాయి. పోలీసు అధికార్ల బదిలీ గురించి చేసినంత అలజడి వేరే ఏ విషయంలోనూ-కరువునుండి కస్టడీ మరణాలదాకా-అధికార పార్టీగానీ ప్రతిపక్ష పార్టీలుగానీ చేయలేదు. దేశ పరిపాలనలో పోలీసు యంత్రాంగం స్థానం అంతటిదయింది.

పై నేపథ్యంలో ఈ పుస్తకం చదవాలి. రోజు రోజుకూ పెరిగిపోతున్న పోలీసు పాలన వివిధ సామాజిక రంగాలలో ఏ విధంగా ప్రతిఫలిస్తోందో వివరించే ప్రయత్నం చేసాము. వివరాలకు ఎ.పి.సి.ఎల్.సి. పరిశోధనలమీద, కొంతవరకు పత్రికల వార్తలమీద, ఆధారపడ్డాము.

## స్త్రీలు

స్త్రీలపైన పోలీసు అత్యాచారాలు పెరిగిపోతూండడం పోలీసు రాజ్యానికి అత్యంత స్పష్టమయిన చిహ్నం. కొన్ని ఉదాహరణలు :

"ఫిబ్రవరి 20, 1986. గురువారం రాత్రి తనను విస్సన్నపేట (కృష్ణాజిల్లా) పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్ళిన తరువాత ఒక గదిలో వుంచి, తలుపులన్నీ బిగించి చీర ఒలిచి బెల్టుతో కొట్టినట్టు జిల్లా ఆదిలక్ష్మి సోమవారం

(ఫిబ్రవరి 24) ఉదయం తెలిపింది....తనను ఒక కానిస్టేబుల్ కొడుతుండగా గదిబయటవున్న నల్గురు కానిస్టేబుళ్ళను రక్షించమని కోరినా పకపకా నవ్వారని ఆమె తెలిపింది. గదిలో లైట్లువేసి తనను తొడలమీద, పిరుదులమీద, మోచేతుల మీద బెల్టుతో కొట్టినట్టు ఆమె చెప్పింది. ఆ సమయంలో అతను తప్పతాగి వున్నట్టు అతని నోటినుంచివస్తున్న విపరీతమయిన వాసన ద్వారా గ్రహించానని ఆదిలక్ష్మి తెలిపింది. ఆ కానిస్టేబుల్ తనను బలవంతంచేయబోయాడని, పక్కనే తుపాకి బయొనెట్‌తో పొడుచుకొని చచ్చిపోతానని బెదిరించగా అతనా ప్రయత్నం మానుకున్నాడని ఆమె తెలిపింది...."

**('ఉదయం', ఫిబ్రవరి 26 1986)**

"హైదరాబాద్‌లోని అడ్డగుట్ట ప్రాంతంలో ఫిబ్రవరి 23వ తేదే మధ్యాహ్నం సి.పి.ఐ, ఎం.సి.పి.ఐ. కార్యకర్తల మధ్య ఘర్షణ జరిగింది. పోలీసులు వెళ్ళి చెదరగొట్టారు. సాయంత్రం మళ్ళీ రెండు వర్గాలు ఘర్షణపడి కొందరు గాయపడ్డారు. రాత్రి పోలీసులు వెళ్ళి 10 మంది మగవాళ్ళను పోలీస్ స్టేషన్‌కు ఈడ్చుకుపోయారు. వాళ్ళవెనకే అన్నంతీసుకువెళ్ళిన లక్ష్మమ్మను బండబూతులు తిట్టి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ప్రభాకరరావు తీవ్రంగా కొట్టినట్టు తెలిసింది....ఆమె శరీరం వెనుకభాగం అంతా దెబ్బలకు నల్లగా కమిలిపోయింది.

20 ఏళ్ళ పెంటమ్మను (ఆ రాత్రి) ఒక చివరి గదిలోకి తీసుకుపోయి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అరగంటసేపు లాఠీలు విరిగేటట్లు ఒళ్ళంతా తూట్లుపొడిచాడని ఆమె చెప్పింది."

**('ఉదయం', ఫిబ్రవరి 26)**

విజయవాడ 'శిరోముండనం కేసు' లేక 'ముదిగొండ పద్మ కేసు' బహుశా అన్నిటికంటే ప్రఖ్యాతమయినది. విజయవాడ మూడవటౌన్ పోలీసులు 1986 ఫిబ్రవరి 3వ ముదిగొండ పద్మతో సహా నలుగురు అమ్మాయిలను అరెస్టుచేసి, శాస్త్రోక్తంగా (24 గంటలలోపల) 4వ తేదీన అందరినీ కోర్టులో హాజరు పరిచారు. వాళ్ళమీద వ్యభిచార నేరం మోపారు. వాళ్ళు ఒప్పేసుకోగా మేజిస్ట్రేటు ఒక్కొక్కరికీ 30 రూపాయలు జరిమానా విధించారు. వాళ్లు చెల్లించి బయటకు నడిచారు. అయితే పోలీసులు వాళ్ళను వెంటనే మళ్ళీ జీపులో ఎక్కించుకొని మూడవ టౌన్‌కు తీసుకుపోయారు. నగర అదనపు పోలీస్ సూపరింటెండెంట్ ప్రభాకరరావుగారి ఆధ్వర్యంలో ఆ నలుగురు అమ్మాయిలకూ మరొక అయిదుగురు మగవాళ్ళకూ తలలు గొరిగించారు. వెల్కం హెయిర్‌డ్రెస్సింగ్ సెలూన్‌కు చెందిన వెంకటేశ్వరరావును పిలిపించి బలవంతంగా శిరోముండనం చేయించారు.

ఈ కథలు అందరూ చదివేఉంటారు. ఇంకా ఎన్నో (పత్రికల ముఖం చూడనివి) వినే ఉంటారు. అదృష్టం వికటించినవారయితే కనే ఉంటారు. ఛఛ అనుకొని ఉంటారు గూడ అయితే అసహ్యించుకోవడంతో ఆగిపోకుండ కొన్ని ప్రశ్నలు వేసుకోవాలి.

1. అసలు ఈ దారుణాలు పోలీసులు ఎందుకు చేస్తున్నట్టు ?
2. చట్టంలో దీనికి శిక్షగాని దీనినుండి రక్షణగాని లేవా ?
3. ప్రభుత్వం ఏమయినా చర్య తీసుకుందా ?

ఒక్కొక్క ప్రశ్నకూ క్లుప్తంగా సమాధానం చెప్పుకుందాం.

1. పోలీసు అత్యాచారాలగురించి ఎప్పుడు గొడవజరిగినా ప్రభుత్వమూ, పోలీసు యంత్రాంగమూ వారి వకాల్తాదార్లు ఒకేరకం సమాధానం యిస్తారు. దేశంలో నేరాలు పెరిగిపోతున్నాయి. ప్రజలలో నేర ప్రవృత్తి పెరిగిపోతోంది. రాజకీయాలలో తీవ్రవాదం పెరిగిపోతోంది. వీటి ఫలితంగా పోలీసుయంత్రాంగం అత్యంత క్లిష్టమయిన పరిస్థితిలో పనిచేస్తోంది. అటువంటప్పుడు అడపావడపా అక్రమ బలప్రయోగం జరపడం-చట్టవ్యతిరేకమయినప్పటికీ-సహజం అంటారు. ఎంతటి క్లిష్టపరిస్థితులలోనయినా ప్రభుత్వ యంత్రాంగం ప్రజల ప్రాథమిక హక్కులను ఉల్లంఘించడానికి వీలులేదన్న రాజ్యాంగ బద్ధమయిన వాదనను వక్కకుపెట్టి, ఈ వాదనను దాని ప్రమాణాలతోనే పరిశీలిద్దాం. అట్లా పరిశీలిస్తే కనిపించేది ఏమిటంటే పోలీసు అత్యాచారాలకు గురయ్యేవాళ్లలో నూటికి 90 శాతం చిన్న చిన్న కేసులకు సంబంధించిన వాళ్ళేగాని, 'నేరప్రవృత్తి'తో భీబత్సం సృష్టించే దుర్మార్గులుకారు. ఇది ఊకదంపుడు సూత్రీకరణఅనుకుంటే పొరబాటు. గత దశాబ్దకాలంలో గడించిన అనుభవంతో దేశంలోని ఏప్రాంతానికిచెందిన పౌర హక్కులసంస్థ అయినా ఈ విషయాన్ని గణాంకాలతో సహా రుజువుచేయగలదు.

పై మూడు సంఘటనలనే తీసుకోండి. ఆదిలక్ష్మిమీద కేసేమిటి? పత్రికల వార్తల ప్రకారం కేసేమీలేదు. ఆమెకు ఒక వివాహితునితో లైంగిక సంబంధం వుందని ప్రశ్నించడానికి తీసుకుపోయారు. లక్ష్మమ్మ, పెంటమ్మలమీద కేసేమిటి? వీళ్ళమీదగూడ కేసేమీలేదు. వాళ్ళ కుటుంబాలకు చెందిన మగవాళ్ళు ఎన్నికల కలహంలో జరిగిన దొమ్మిలో పాల్గొన్నారన్న కోపంతో పోలీసులు వీళ్ళను కొట్టారు. ముదిగొండ పద్మ తదితరుల మీద వున్నది. వ్యభిచార ఆరోపణ.

అసలు వాస్తవం ఏమిటంటే అత్యాచారాలు అనేవి కేవలం సమాచారం రాబట్టడంకోసం చేసే బలప్రయోగంకాదు. ఆ పని పోలీసు యంత్రాంగం అన్ని కాలాలలో అన్ని దేశాలలో చేస్తూనే వుంది. కాని ఇవ్వాళ దాన్ని దాటిపోయి, అత్యాచారాలు అనేవి రుజువుకాని నేరానికి చట్టసమ్మతంకాని శిక్షలు అయ్యాయి. కోర్టులువేసే శిక్షలమీద మన దేశంలోని పోలీసు యంత్రాంగానికి నమ్మకంలేదు. జైళలో ఖైదీలు మరీ సుఖంగా వున్నారని, 'సుఖం మరిగి' బయటకు వస్తారని వాళ్ళ ఆరోపణ. లాయర్లు నేరస్తుల దగ్గర డబ్బులు తీసుకొని తిమ్మిని బమ్మి చేసి శిక్షపడకుండా చూస్తారని వాళ్ళ ఫిర్యాదు. అందుకే తాము నేరాలను పరిశోధించి చార్జిషీట్లు తయారుచేస్తే ప్రయోజనం లేదు కాబట్టి, లాకప్పులోనే కొట్టి, తన్ని (శిరోముండనం చేసి) శిక్ష వేస్తామని వాళ్ళ అవగాహన. ఇదిగూడ సబబే నని సమర్థించేవాళ్ళు దేశంలో లేకపోలేదు గాని, పోలీసు యంత్రాంగం పూర్తిగా చట్ట వ్యతిరేకమయిన ఈస్థితిని చేరుకుందని మాత్రం అందరూ గుర్తించాలి. విజయవాడ కేసు ఈ విషయాన్ని రుజువు చేస్తుంది. నేరస్తులను శిక్షించడమే ముఖ్యమయితే ఆది జరిగిపోయింది. మేజిస్ట్రేటు విచారించాడు, జరీమానా వేసాడు, వాళ్లు చెల్లించారు. మరి శిరోముండనం చేయాల్సిన అవసరం ఏం వచ్చిందంటే, కోర్టు విధించిన శిక్షపట్ల పోలీసులకు (అదనపు పోలీస్ సూపరింటెండెంట్ స్థాయి లోని అధికారికి సహితం) గౌరవం లేదు. ఆమాత్రం శిక్షకే వ్యభిచారం మానేస్తా రన్న నమ్మకం లేదు. అందుకే తమ స్వంత శిక్ష వేయదల్చుకున్నారు.

2. చట్టం ప్రకారం కస్టడీతో నిందితులను హింసించడం నేరం. సమాచారం రాబట్టేందుకు చిత్రహింసలు ప్రయోగిస్తే భారత శిక్షాస్మృతి సెక్షన్ 331 ప్రకారం 10 సంవత్సరాలు శిక్ష. సమాచారం రాబట్టేందుకు అక్రమ నిర్బంధంలో ఉంచితె సెక్షన్ 348 ప్రకారం 3 సంవత్సరాలు శిక్ష.

అయితే కేసునడిస్తేనేగదా శిక్షపడేది-కేసెట్లా నడవాలి? ఈ ప్రశ్నకు సమాధానం తర్వాత చూద్దాం. (కస్టడీ మరణాల గురించి చర్చించేటప్పుడు) కాని గమనించవలసిన విషయం ఏమిటంటే ఫిర్యాదీ, సాక్షులు, గట్టిగా నిలబడే పరిస్థితి వుంటేనే న్యాయంలాంటిది జరగగలదు. వాళ్లను పోలీసులు గట్టిగా నిలబడనీ యరనేది విజయవాడ 'శిరోముండనం' కేసులో భారత న్యాయవ్యవస్థకే లజ్జాకరమయిన పద్ధతిలో బయటపడింది. విజయవాడ ఏడవ అదనపు మేజిస్ట్రేటు శిరోముండనం కేసు తీసుకొని సాక్ష్యాలు రికార్డు చేయడానికి ఉద్యుక్తుడయ్యాడు. ఆయనముందు సాక్ష్యం ఇవ్వడానికి సిద్ధపడిన పద్మ "నన్ను, నా భర్తను, పోలీసులు వెంటాడుతున్నారు. కోర్టుకు వచ్చేటప్పుడు పోలీసు అధికారులు చాలా మంది కోర్టు ఆవరణలో వుండి నన్ను నా భర్తను తిరిగి ఎత్తుకుపోయి కొట్టాలని,

చంపాలని, ప్రయత్నిస్తున్నందున జైలులోవుంచి అయినా మాకు రక్షణ కల్పించాలి" అని పిటిషన్ పెట్టుకుంది. అంతోటి న్యాయస్థానానికి ఏం చేయాలో పాలుపోలేదు. వకీళ్ళకు అంతుపట్టలేదు. సంరక్షకుల బారినుండి ఆ స్త్రీని ఎట్లా సంరక్షించాలో ఆ న్యాయస్థానానికి అర్థం కాలేదు! అందుమీద చాలా 'ఉత్తేజ కరమైన' చర్చ జరిగిందని పత్రికలు రాశాయి. 'లజ్జాకరమయిన' అంటే ఇంకా సబబుగా వుంటుందేమో. ఇంత జరిగినా ఇంకా పోలీసు యంత్రాంగం సిగ్గుండక పోగా తర్వాతి దినం సాక్ష్యాలు రికార్డుచేసుకునే సమయంలో కోర్టుఆవరణలోని దృశ్యం చూడండి.

"ఉదయం 10 గంటలనుండి కోర్టు ఆవరణ పోలీసు జీపులతో, మఫ్టీ పోలీసులతో నిండిపోయింది. కోర్టుహాలులోని ప్రేక్షకులలో సగంమంది పోలీసులే కావడం విశేషం. కానిస్టేబుల్‌నుండి ఇన్‌స్పెక్టర్ స్థాయివరకు హోదాగల దాదాపు నూరుమంది పోలీసులు, నాల్గు జీపులు, పది స్కూటర్లు కోర్టు ఆవరణలో ఉన్నాయి." (**'ఉదయం', ఫిబ్రవరి 12**)

ఇటువంటి పరిస్థితిలో సెక్షన్ 331, 348ల క్రింద శిక్షపడడం అసంభవం అంటే అందులో ఆశ్చర్యం ఏమయినాఉందా?

స్త్రీల నిర్బంధానికి సంబంధించి మరికొన్ని ప్రత్యేకమయిన నియమాలున్నాయి. ఒక స్త్రీని విచారించడానికి పోలీస్‌స్టేషన్‌కు రప్పించకూడదని, ఆమె నివాసస్థలంలోనే విచారించాలని, నేరవిచారణస్మృతి సెక్షన్ 160 (1) అంటుంది. ఒకవేళ ఆస్త్రీ కేసులో నిందితురాలు అయినప్పటికీ స్త్రీకానిస్టేబుళ్లు లేని పోలీస్ స్టేషన్లో ఉంచకూడదని, స్త్రీలకు ప్రత్యేకమైన లాకప్పులోనే ఉంచాలని, ఆమెను విచారించేటప్పుడు ఆమె బంధుమిత్రుల సమక్షంలోనే విచారించాలని, సుప్రీంకోర్టు షీలాబార్సె వెర్సస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర (1983) లో అనింది. పై కేసులన్నింటిలోనూ ఈ నియమాలను ఉల్లంఘించారని వివరించనక్కరలేదు.

3. ప్రభుత్వం తీసుకోగలచర్యలు లేవా అంటే రెండుముక్కలలో చెప్పవచ్చు. అత్యాచారాలుచేసిన పోలీస్‌- ఆఫీసర్లను పైన పేర్కొన్న చట్టాలకింద విచారించి శిక్షించడం ప్రభుత్వంయొక్క కనీస కర్తవ్యం. ఆ పని ప్రభుత్వం ఎన్నడూ చేయదుగాని, అత్యాచారాన్ని గురించి కొంచెం అలజడి జరిగితే ఒకరిద్దరు పోలీస్ అధికార్లను 'సస్పెండ్' చేసినట్లు ప్రకటిస్తుంది. మామూలుగా ఒక ప్రభుత్వ ఉద్యోగి సస్పెండ్‌కావడం అనేది సీరియస్ విషయమే.. మళ్ళీ తిరిగి ఉద్యోగంలోకి రావడం సులభంకాదు. ఈ అనుభవాన్ని దృష్టిలోఉంచుకొని, అత్యాచారాలు చేసిన పోలీస్ అధికార్లను సస్పెండ్‌చేసినట్టు వార్త పేపరులో చూడగానే ప్రజలు ఏదో న్యాయం జరిగిపోయిందనీ, దోషికి శిక్షపడిందనీ, పౌర

పాటుగా భావిస్తారు. ఈ విధంగా విధించిన సస్పెన్షన్లను ప్రభుత్వం ఎంతత్వరగా ఎంత అనాయాసంగా ఉపసంహరించుకుంటుందో ప్రజలకు తెలీదు. సస్పెండ్ అయిన పోలీస్ అధికారిని, నెలతిరక్కముందే రీయిన్‌స్టేట్‌చేసి వేరేచోట వేయడం పరిపాటి. విజయవాడ 'శిరోముండనం' కేసునే ఉదాహరణగా తీసుకుంటే, అందులో 'సస్పెండ్' అయిన అదనపు ఎస్. పి. ప్రభాకరరావును వెనువెంటనే వెనక్కితీసుకొని తూర్పుగోదావరి జిలా అడ్డతీగలలో ఒ. ఎస్. డి. (నక్సలైట్ల వేటకోసం నియమించే స్పెషల్ ఆఫీసరు) గా పోస్టింగ్ ఇచ్చినట్టు పత్రికలో వార్తలు. ర్యాంక్ ఒకటే అయినా ప్రాముఖ్యత దృష్ట్యా ఈ బదిలీని శిక్ష అనాలో శిరోముండనానికి పారితోషికం అనాలో తెలీదు!

స్త్రీలపైన పోలీసు అత్యాచారాలలో కస్టడీలో మానభంగం అన్నిటికంటే తీవ్రమయినది. గత ఆగస్టునుండి ఇప్పటిదాకా మూడు సంఘటనలు వెలికి వచ్చాయి. మొదటి సంఘటన కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో ఆగస్టు 6న జరి గింది. అత్యాచారానికి గురయిన అమ్మాయి 16 ఏళ్ళ రాయిశెట్టి పద్మ. సంఘ టన వివరాలు-

ఆగస్టు 6, 1985 వ తేదీన పద్మ తన వదినెలతో కలిసి బట్టలు కొను క్కోవడానికి జమ్మికుంట వచ్చింది బట్టలుకొనడం అయిపోగానే ఆమె వదినెలు వెళ్ళిపోయారుగాని పద్మమాత్రం సినిమా చూద్దామని ఆగింది. సినిమా అయి పోయేసరికి రాత్రి 9-30 అయింది. తిరిగిపోదామని బస్‌స్టాండుకు పోబోగా తోవలో ఒక యువకుడు ఆమెను బలాత్కారం చేయబోయాడు. ఆమె కేకలు వేయగా విని ఆ తోవలో పోతున్న ఒక ముసలాయన ఆ యువకుడిని మంద లించి, పద్మకు 'రక్షణ' కల్పించే ఉద్దేశ్యంతో పోలీస్ స్టేషన్‌వైపు తీసుకు పోయాడు. దారిలో పోలీస్‌కు చెందిన ఇద్దరు హోంగార్డులు ఎదురయ్యారు. ఆడబోయిన తీర్థం ఎదురయ్యిందని ఆ ముసలాయన వాళ్ళకు విషయాన్ని వివ రించి, పద్మకు రక్షణ కల్పించమనీ, ఆమెను బలత్కారం చేయబోయినవ్యక్తిని పట్టుకొని తీసుకుపోగా రెండవ హోంగార్డు (ఇతని పేరు ప్రకాశరెడ్డి) పద్మను పక్కకు తీసుకుపోయి మానభంగం చేసాడు.

మిగిలిన రెండు సంఘటనలు పత్రికలలో రిపోర్టయ్యాయి. ఆగస్టు 31 రాత్రి హైదరాబాద్ పాతబస్తీలో సఫియాబాను అనే స్త్రీ ఒంటరిగా ఆటోరిక్షాలో పోతోంది. ఎదురుగా జీపులో వచ్చిన చత్రినాక ఎ. సి. పి. జయరాంరెడ్డిగారికి

అనుమానం వచ్చి, ఆటోను ఆపి, తన జీపులో ఉన్న ఇద్దరు కానిస్టేబుళ్ళకు (నాగేందర్, షేక్‌కాసింవలీ) ఆమెను అప్పజెప్పి పోలీస్‌స్టేషన్‌కు తీసుకుపోయి విచారించమని పురమాయించాడు. వాళ్ళు ఆ అమ్మాయిని బీబీకాచష్మా అనే ప్రాంతానికి అదే ఆటోలో తీసుకుపోయి ఆమెమీద అత్యాచారం చేశారు. స్త్రీని విచారించడానికి పోలీస్‌స్టేషన్‌కు రమ్మనకూడదన్న నియమాన్ని (నేరవిచారణ స్మృతి సెక్షన్ 160 [1]) ఎ.సి.పి. పట్టించుకోలేదు. పోనీ ఆమెను 'అనుమానం' మీద అరెస్టుచేసాడనుకుందాం. 'అనుమానం' మీద వారంట్ లేకుండా అరెస్టు చేసే అధికారం నేరవిచారణస్మృతి సెక్షన్ 41 పోలీసులకు ఇచ్చింది. కాని ఆ 'అనుమానం' సహేతుకమయినదీ సబబయినదీ కావాలిగాని అస్పష్టమయిన ఊహ కావడానికి వీలులేదని కోర్టు తీర్పులున్నాయి. ఎ. సి. పి.కి సఫియాబాను మీద వచ్చిన అనుమానం ఎంతవరకు సబబయినది?

డిసెంబర్ 15, 1985 రాత్రి మహబూబ్‌నగర్ జిల్లా అచ్చంపేటలో మంగమ్మ అనే స్త్రీని సి. ఐ. సత్యనారాయణరెడ్డి మానభంగం చేసాడు. ఆమె మరిది హత్యకు సంబంధించి ఆమెను విచారించేందుకు తన యింటికి (పోలీస్ స్టేషన్‌కుగూడ కాదు) పిలిపించి, చాలా రాక్షసంగా అత్యాచారం చేసాడు.

ఈ మూడు కేసులలోనూ నిందితులను అరెస్టు చేసినట్టు పత్రికలలో వార్తలువచ్చాయి. కేసు సవ్యంగా నడిపితే శిక్ష పడవచ్చు. ఎందుకంటే నేడు స్మృతి సవరణ చట్టం' 1983 (criminal Law Amendment Act, 1983 ప్రకారం కస్టడీలో మానభంగం జరిగినప్పుడు బాధితురాలు తాను లైంగిక చర్యకు ఒప్పుకోలేదని వాంగ్మూలంయిస్తే కోర్టు దానిని ప్రాథమికంగా సత్యమని స్వీకరించాలి. అది వాస్తవంకాదని రుజువుచేసుకునే బాధ్యత నిందితుడుమీదనే ఉంటుంది. అయితే బాధితురాలు కోర్టులో వాంగ్మూలం యిస్తేనే ఇది. ఆమెను ఇవ్వనిస్తారా? ఎన్నిరకాల ఒత్తిడులు, బెదిరింపులు ప్రయోగించరు? కనీసం ఈ ఒత్తిడులకు ఆస్కారం లేకముందే (అంటే నిందితుడికి బెయిల్ రాకముందే) బాధితురాలినుండి నేరవిచారణస్మృతి సెక్షన్ 164 క్రింద మేజిస్ట్రేట్ దగ్గర వాంగ్మూలం రికార్డుచేయిస్తే కొంతవరకయినా న్యాయం జరగవచ్చు. కాని రికార్డు చేయించవలసింది మళ్ళీ పోలీసులే గదా, వాళ్ళెందుకు చేస్తారు?

## పోలీసు కష్టడీలో మరణాలు

పోలీసులచేత అరెస్టుచేయబడి కస్టడీలో మరణించిన సంఘటనలు మన రాష్ట్రంలో చాలా తరుచుగా జరుగుతున్నాయి. ఈ సంవత్సరం సెప్టెంబర్ నెలలో ఇటువంటివి 6 హత్యలు ఒక్క వరసలో జరిగేసరికి బాగా సంచలనం

గూడ చెలరేగింది. కాని ఇవి ఇవ్వాళ మొదలయినవికావు. 1984 లో 24 మంది లాకప్పులో చనిపోయారు. 1985 లో 16 మంది, 1986 లో ఇప్పటిదాకా 17 మంది చనిపోయారు.

ఇవిగాక 1985 లోనే మరొక 3 కేసులు ఈ కోవకు చెందినవిఉన్నాయి. మే12వ తేదీన హైదరాబాద్‌కు చెందిన అచ్చయ్యనగర్ నివాసి నాగేశ్వరరావును సైకిలు దొంగతనం కేసులో చిక్కడిపల్లి పోలీసులు అరెస్టుచేసి మాయంచేసారు. అతన్ని ఏం చేసిందీ ఇప్పటిదాకా తెలీదు. హైకోర్టు విచారణ జరిపించి అతని కుటుంబానికి చిక్కడిపల్లి ఎస్.ఐ. (లేక రాష్ట్ర ప్రభుత్వం) 40 వేల రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలని తీర్పు యిచ్చింది. నవంబర్ నెలలో మళ్ళీ హైదరాబాద్‌లోనే శేఖర్, సంజీవ్ అనే ఇద్దరు రాడికల్ కార్యకర్తలను పోలీసులు అరెస్టుచేసి మాయం చేసారు. వాళ్ళు ఏమయిందీ ఇప్పటిదాకా తెలీదు. ఈ 3 కలిపితే 1985 కస్టడీ మరణాల సంఖ్య 19 అవుతుంది.

అదే విధంగా ఈ సంవత్సరం వరంగల్ జిల్లా పోలీసులు షేక్ ఇమాం (ఉరఫ్ గంగన్న) అనే రాడికల్ కార్యకర్తను అరెస్టుచేసి చంపేసి సికిందరాబాద్-నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ కింద పడేసినట్టు ఆరోపణలు వచ్చాయి. కడప జిల్లాలోగూడ ఒక వ్యక్తిని పోలీసు లాకప్పునుండి (పోలీసుల సహకారంతో) అతని శత్రువులు తీసుకుపోయి చంపినట్టు వార్త వచ్చింది. ఇవి రెండూ కలిపితే ఈ సంవత్సరం ఇప్పటిదాకా జరిగిన కస్టడీ మరణాల సంఖ్య 19 అవుతుంది.

నేరప్రవృత్తి, నేరాల తీవ్రత పెరిగిపోతూండడం వల్లనే పోలీసు అత్యాచారాలు గూడ పెరిగిపోతున్నాయనే వాదనను దృష్టిలో ఉంచుకొని ఈ మృతులంతా ఎంత తీవ్రమయిన నేరాలలో నిందుతులో గమనించాలి. 1984లో చనిపోయిన 24 మందిలో ఒకవ్యక్తి హత్య కేసులో, ఒకవ్యక్తి బందిపోటు కేసులో నిందితులు. తక్కినవాళ్ళంతా చిన్న చిన్న నేరాలలో (వ్యభిచారం, మద్యపానం దొమ్మీ, ఎక్కువగా దొంగతనాలు) నిందితులు. 1985 లో చనిపోయిన 16 (లేక 19) మందిలో ఒకవ్యక్తి హత్యకేసులో (అదిగూడ తన స్వంత చెల్లిలినే కట్నం ఇయ్యవలసిన బెడద తప్పుతుందని చంపాడని) నిందితుడు: ఒక్కతను అపహరణ కేసులో నిందితుడు. తక్కిన వాళ్ళంతా చిన్నచిన్న నేరాలలో అరెస్టయిన వాళ్ళే. నలుగురయితే ఏ ప్రత్యేకమయిన నేరంలోనూ నిందితులు కారు, 'తీవ్రవాదులు' కావడమే వాళ్ళు చేసిన నేరం. 1986 లో ఇప్పటిదాకా జరిగిన 17 (లేక 19) కేసులలో ఒక్క మానభంగం కేసు, రెండు హత్య కేసులూ మినహాయిస్తే వేరే ఏ ఒక్క మృతుడూ తీవ్రమయిన నేరంలో నిందితుడు కాదు. దొంగతనం, కొట్లాట మొదలయిన కేసులలో అరెస్టయిన వాళ్ళే అంతా.

రెండు సంఘటనల వివరాలు మచ్చుకు ఇక్కడ ఇస్తున్నాము. అర్థరహిత మయిన ఈ హింసాకాండను చూస్తే, నేరాల తీవ్రత పెరిగిపోవడానికి కస్టడీలో హింసకూ సంబంధం వుందని పోలీసు యంత్రాగమూ, దాని వకల్తాదారులూ చెప్పే మాటలు ఎంతమాత్రం వాస్తవం కాదని అర్థం అవుతుంది.

1985 మే నెల 25 నాడు అనంతపురం జిల్లా తాడిపత్రి తాలూకా యెల్ల నూర్ గ్రామ ఉపసర్పంచ్ అయిన 65 సంవత్సరాల కమాల్ పీరన్‌నూ అతని కొడుకు నబీరసూల్‌నూ తాము అరెస్టు చేసామని, పోలీస్‌స్టేషన్‌కు తీసుకుపోతుం డగా కమాల్ పీరన్ తోవలో తనంతటతానే స్వచ్ఛందంగా కిందపడి పోయాడని పోలీసులన్నారు. అసలు జరిగిందేమిటంటే మధ్యాహ్నం 2-30 గంటలకు వాళ్లి ద్దరినీ అరెస్టు చేసారు. రోడ్లోనే విపరీతంగా కొట్టి లాకప్పుకు ఈడ్చుకుపోయారు. సాయంకాలం 5 గంటలనుండి విపరీతంగా చిత్రహింసలకు గురిచేసారు. తాడి పత్రి ఎం.ఎల్.ఏ డి.ఎస్.పి. కి ఫిర్యాదు చేయగా 'చూస్తాను.' అన్నాడు. తాడి పత్రి వ్యవసాయ సహకారబ్యాంకు ఉపాధ్యక్షుడు పోలీస్‌స్టేషన్‌కుపోయి అడుగగా ఎస్.ఐ. అతని మీదకు తుపాకీ గురిపెట్టి బెదిరించాడు. చివరికి రాత్రి 2-30 గంటలకు ఎం.ఎల్.ఏ డి.ఎస్.పి. ని నిద్రలేపి అడుగగా ఆయన పోలీస్‌స్టేషన్‌కు ఫోన్ చేసాడు. అక్కడవున్న కానిస్టేబుల్ కమాల్ పీరన్ చనిపోయాడని చెప్పాడు. శవాన్ని చూస్తే అతన్ని బూటుకాళ్ళతో తొక్కినట్టు రక్తం కక్కుకుని చనిపోయినట్లు తెలుస్తోంది.

కడప జిల్లా రాయచోటి పోలీసులు 1986 ఏప్రిల్ 18 న అరెస్టుచేసిన ఉప్పు వెంకటరమణ అనే 30 సంవత్సరాల యువకుడు పోలీస్ కస్టడీలో ఉండ గానే 20వ తేదీన మద్రాసు అపోలో ఆస్పత్రిలో మరణించాడు. లక్కిరెడ్డిపల్లి సమితిలోని గోనులపాలెం గ్రామనివాసి అయిన వెంకటరమణను నాటుబాంబులు తయారుచేస్తున్నాడనే అనుమానంపైన రాయచోటి పోలీసులు ఏప్రిల్ 18న అరెస్టుచేసారు. సహచరుల పేర్లు చెప్పమని అతన్ని తీవ్రంగా చిత్రహింసలకు గురిచేసారు. అతను పెదనేని కాల్వకు చెందిన ఒక వ్యక్తిపేరు చెప్పాడు. పోలీ సులు వెంకటరమణను తీసుకొని ఆ గ్రామానికి వెళ్లారు. అక్కడ కొత్తపల్లికి చెందిన మరొక చిరునామా దొరికింది. అతనినుండి ఇంకా సమాచారం రాబట్టాలని పోలీసులు మళ్ళీ అమానుషమయిన చిత్రహింసలు ప్రయోగించారు. వెంకటరమణ అపస్మారకస్థితి చేరుకున్నాడు. పోలీసులు మొదట అతనికి సుండుపల్లిలోని ఒక ప్రైవేటు డాక్టరువద్ద చికిత్స జరిపించారు. తరువాత రాయచోటి ప్రభుత్వ ఆస్ప త్రికి, తిరుపతి రుయా ఆస్పత్రికి, మద్రాసు అపోలో ఆస్పత్రికి తరలించారు.... నిపుణులయిన అపోలో వైద్యులకుగూడ పోలీసుల హింసలకు విరుగుడు దొరక లేదు.

అనుబంధం-I లో 1985 నుండి ఇప్పటిదాకా జరిగిన కస్టడీ మరణాల జాబితా ఇచ్చాం. ఒక్కొక్క సంఘటనలో మృతుడు ఎటువంటి నేరంలో నింది తుడో చివరికాలంలోఉంది. నేరాలు తీవ్రత పెరిపోవడంవల్ల కస్టడీ చిత్రహింసలు అనివార్యం అవుతున్నాయన్న వాదన ఎంత అబద్ధమో ఆ పట్టికచూస్తే తెలుస్తుంది.

పోలీసు కస్టడీలో చిత్రహింసలు భారతసిక్షాస్మృతి సెక్షన్లు 331, 348ల క్రింద నేరాలని చూసాం. వీటికి వరుసగా 10 సంవత్సరాలు, 3 సంవత్సరాలు, శిక్ష. చిత్రహింసలు మరణానికి దారితీస్తే 302 సెక్షనుక్రింద నేరం. ఈ సెక్షన్ల కింద. కేసు ఎట్లానడవాలన్నది ప్రశ్న. న్యాయంగా అయితే అదే పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదుచేసుకొని (నేరస్తులే!) నడిపించాలి. అది జరిగేదికాదని చెప్పనక్కర లేదు, ప్రభుత్వం నేరవిచారణస్మృతి సెక్షను 176 క్రింద మెజిస్టీరియల్ విచారణ జరిపిస్తుంది. ఆ నివేధికమీద ఆధారపడి ప్రభుత్వం కేసు నమోదుచేసుకోవలసిందిగా పోలీస్‌స్టేషనుకు ఆదేశం ఇయ్యవచ్చును, లేదా మృతుని బంధుమిత్రులు స్థానిక మేజిస్ట్రేటు కోర్టుతో సాక్ష్యాధారాలతో ప్రైవేట్ కంప్లైంట్ వేయవచ్చు. అక్కడిదాకా అక్కరలేదు. వార్త తనకు తెలియగానే స్థానిక మేజిస్ట్రేటు (నేర విచారణస్మృతి సెక్షను 190 [C] ప్రకారం) కేసు నమోదు చేసుకొని సాక్ష్యాలను పిలిపించాలి. లేదా, ప్రభుత్వం న్యాయవిచారణ జరిపించవచ్చు.

అయితే నేరస్తులు పోలీసులే అయినప్పుడు, ఒకవేళ కేసు నమోదయినా నేరపరిశోధన అదే పోలీసులు చేస్తే న్యాయం ఎట్లాజరుగుతుందని అనుమానం వస్తుంది. ప్రభుత్వం నేరపరిశోధన సి.బి.ఐ. లేక సి.ఐ.డి. ల చేత చేయించవచ్చును. చార్జిషీటు తయారుచేసే బాధ్యతగూడ వాళ్ళమీదే ఉంటుంది. ఇంత జరిగినా న్యాయం జరుగుతుందన్న నమ్మకం లేదు. సాక్ష్యులను, మృతుడి బంధువులను, పోలీసులు నానారకాల బాధలకు గురిచేస్తారు. అదట్లాఉంచి కేంద్ర సి.బి.ఐ.తో స్థానిక అధికారులు సహకరించారు కాబట్టి వాళ్ళకు నేరపరిశోధన చాలా కష్టం (నిజాయితీగా చేయదల్చుకున్నా) రాష్ట్ర సి.ఐ.డి. మాటకొస్తే మామూలు పోలీస్‌ఆఫీసర్లే బదిలీమీద సి.ఐ.డి.లోకి పోతూంటారుకాబట్టి పోలీసు అత్యాచారాల మీద సి. ఐ. డి. ఎంక్వైరీ న్యాయం చేస్తుందని నమ్మడం కష్టం. ఉదాహరణకు తూర్పుగోదావరి జిల్లా ఏజెన్సీ ఏరియాలో పొద్దఎత్తున గిరిజనులమీద పోలీసు

అత్యాచారాలు జరిగిప్పుడు జిల్లా ఎస్.పి.గా ఉన్న దినేశ్‌రెడ్డిగారు ప్రస్తుతం సి.ఐ.డి. క్రైంబ్రాంచి ఎస్:పి.గా ఉన్నారు. ఇప్పుడు ఆ జిల్లాలో గిరిజనులపై జరుగుతున్న అత్యాచారాలమీద సి.బి.సి.ఐ.డి. ఎంక్వైరీ జరిపించాలని డిమాండ్ చేస్తే ప్రభుత్వం వారినే విచారణ అధికారిగా నియమించవచ్చును! ఒక్కమాటలో చెప్పాలంటే ప్రస్తుతంఉన్న న్యాయవ్యవస్థలో పోలీసు అత్యాచారాలమీద పరిశోధన సవ్యంగా జరగదు. సాక్షులను బెదిరించడంద్వారా విచారణ సవ్యంగా జరగనివ్వరు.

శిక్షపడడం సంగతి ఎట్లాగున్నా, ఒక్క న్యాయవిచారణలో మాత్రమే కనీసం కొన్ని వాస్తవాలయినా బయటకు వచ్చే అవకాశం ఉంది. గత మూడేళ్ళలో జరిగిన 60 కస్టడీ మరణాలలో ఇప్పటివరకు కేవలం 8 మరణాలు మాత్రమే ప్రభుత్వం న్యాయవిచారణ ప్రకటించింది. అందులో 6 ఈ సంవత్సరం సెప్టెంబర్‌నెలలో జరిగిన మరణాలు. మిగిలిన రెండింటిలో ఒకటి చీరాల పోలీస్‌స్టేషన్‌లో (1985 ఏప్రిల్ 27న) చనిపోయిన అంగడి ప్రభాకరరావు మరణం, రెండవది విజయవాడ రెండవటౌన్ పోలీస్‌స్టేషన్‌లో (1986 ఫిబ్రవరి 3న) చనిపోయిన గొడ్డళ్ళ రామారావు మరణం. రెండు కేసులలోనూ మృతుడు చిత్రహింసలు ఫలితంగానే మరణించినట్టు నివేదికలు తీర్మానించడం గమనించదగ్గ విషయం.

అంగడి ప్రభాకరరావు హత్యపైన న్యాయ విచారణ జరిపిన జస్టిస్ శ్రీరాములు కమిషన్ నివేదిక నుండి కొన్ని వాక్యాలు ఇక్కడ పుటంకిస్తాము.

"మృతుని ప్రవృత్తిగురించి పోలీసులు చెప్పినదంతా వాస్తవమేనని విశ్వసించినా, అతన్ని చంపేసి మానేరం ఏమీలేదని పోలీసులు ప్రకటించడం ఎంతమాత్రం సమర్థనీయం కాదు మృతుడు ఎంతటి దుర్మార్గుడయినా అతని మీద హింస ప్రయోగించే హక్కు పోలీసులకు లేదు."

"ఒక వ్యక్తి పోలీస్ స్టేషన్‌లో మరణిస్తే అది సబబయిన అనుమానానికి దారితీస్తుంది. మృతుడు యువకుడు, ఆరోగ్యవంతుడు అయివుండి, మరణం అతని అరెస్టు తరువాత కొన్ని గంటలలోనే సంభవిస్తే, అతని మరణానికి అతని శరీరం మీదవున్న గాయాలకుగల కారణం ఏమిటో పోలీసు అధికార్లు వివరించలేని పక్షంలో అతని మరణానికి వాళ్ళే బాధ్యులు, లేక వాళ్లకు సంబంధం వుంది అని భావించడం ఎంతయినా సమంజసం. పోలీసులు బలమయిన సాక్ష్యాలను చూపించలేని పక్షంలో ప్రాథమికంగా (Prima facie) వాళ్లమీద కేసు ఉన్నట్టు భావించాలి."

"చాలా సాహసవంతులయితే తప్ప పోలీసు అధికార్లకు వ్యతిరేకంగా సాక్ష్యం ఇవ్వడానికి ముందుకురారు. ఎటువంటి పరిణామాలనయినా ఎదుర్కొనడానికి స్థిరంగావున్న వ్యక్తులే సాక్ష్యం ఇవ్వగలరు,"

"పోలీసులు తాసీల్దారును 'మేనేజ్' చేసుకోవడంలో సఫలం అయ్యారు. శవం మీద గాయాలేవీ లేవనీ మరణానికి కారణం అనూహ్యంగా అతను పంచనామా రిపోర్టు రాసాడు.... తాసీల్దారు ఈ విధంగా పోలీసులకు మద్దతుఇవ్వడం విచారకరం."

"ప్రభాకరరావు మరణం మీద విచారణ జరిపించమని అతని బంధువులు పోలీస్ అధికార్లకూ, జాయింట్ కలెక్టరుకూ చేసుకున్న విన్నపాలు చెవిటి వాని ముందు శంఖం ఊదినట్టయ్యాయి."

## గ్రామీణ పేదలపైన అత్యాచారాలు

దేశంలోని అన్ని వర్గాల కంటే అణచివేతకూ నిర్బంధానికి ఎక్కువగా గురయ్యేది గ్రామీణ పేదలే. అయితే మామూలుగా భూస్వాములు ఇతర పెత్తందార్ల చేతులలో అనుభవించే అణచివేత మన రాష్ట్రంలో ప్రత్యేకంగా పోలీసు హింసాకాండ రూపం తీసుకుంటుంది. మనరాష్ట్రంలోని చాలా ప్రాంతాలలో గ్రామీణ పేదలు, గిరిజనులు వివిధ సి.పి.ఐ (ఎం-ఎల్) గ్రూపుల సానుభూతి పరులు కావడం వల్ల ప్రభుత్వం ఉద్దేశ్యపూర్వకంగా, ఒక పథకం ప్రకారం, పోలీసు యంత్రాంగాన్ని ప్రయోగించి వాళ్ళను అణచివేతకు గురిచేస్తోంది. ఇది ప్రధానంగా జరుగుతున్నది అదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్ ఖమ్మం జిల్లాలలో, తూర్పుగోదావరి-విశాఖపట్నం ఏజెన్సీ ప్రాంతాలలో. ఇవి కాక, ఆ పార్టీల సానుభూతి పరులయిన విద్యార్థులు ఎక్కడుండే అక్కడ తీవ్రంగా అణచివేత ప్రయోగించడం జరుగుతోంది. గత సంవత్సర కాలంలో జరిగిన వివిధ రకాల అత్యాచారాలను ఇక్కడ క్లుప్తంగా చర్చిస్తాము. రెండు సెక్షన్లలో అత్యాచారాలను వివరిస్తూ అదే సమయంలో వాటి గురించి చట్టం ఏమంటుందో చెప్పాము. ఇక్కడ అటువంటి ప్రయత్నం చేయము. అత్యాచారాలు ఒక మోస్తరుగా వున్నప్పుడు చట్టాన్ని గురించి మాట్లాడడంలో అర్థం వుంటుంది గాని, ప్రభుత్వం ప్రజలమీద యుద్ధం ప్రకటించినట్టు ప్రవర్తిస్తున్న ఉత్తర తెలంగాణా జిల్లాలగురించి, తూర్పుగోదావరి-విశాఖ ఏజెన్సీ ప్రాంతాల గురించి, చెప్పేటప్పుడు చట్టం ప్రస్తావన తీసుకురావడం హాస్యాస్పదంగా వుంటుంది.

**1. దాడులు, చిత్రహింసలు :** సి.పి.ఐ (ఎం-ఎల్) పార్టీల లేక వారి ప్రజా సంఘాల సభ్యులు, సానుభూతిపరులు ఉన్న గ్రామాలపైన పోలీసు దాడులు నిత్యం జరుగుతుంటాయి. సాయంత్రం అయితే పోలీసు జీపులు పోలీస్ స్టేషన్ కేంద్రం నుండి బయలుదేరుతాయి. మళ్ళీ తెల్లవారేదాకా పరిసర గ్రామాల మీద దాడులు చేస్తారు. జనాన్ని ఇళ్ళ నుండి బయటికి లాగి స్త్రీలనీ పిల్లలనీ ముసలివాళ్ళనీ విచక్షణ లేకుండ చితకబాదుతారు. తమకు 'కావలసిన' వాళ్లను పట్టియిమ్మని వాళ్ళ తల్లిదండ్రులను భార్యపిల్లలనూ చిత్రహింసలకు గురిచేస్తారు. కుండలూ గాదెలూ పగలగొడతారు. తిండి వస్తువులు ధ్వంసం చేస్తారు. ఇళ్ళు కూల్చేస్తారు, తగలబెడతారు. పెంకులు పీకేస్తారు. వాసాలు విరగగొడతారు.

ఆ 'కావలసిన' వాళ్ళు గనక దొరికితే వాళ్ళను 20 నుండి 50 రోజులు దాకా అక్రమంగా లాకప్పులో వుంచి విపరీతంగా చిత్రహింసలకు గురిచేస్తారు. బట్టలు మొత్తం విప్పి నగ్నంగా వుంచుతారు. నగ్నంగా రోడ్లో నడిపిస్తారు. తన రాజకీయాలను అసభ్యంగా దూషిస్తూ నినాదాలు ఇమ్మని బలవంతపెడతారు. లాకప్పులో రోకలిబండలు ఎక్కించి తొక్కడం, రెండు కుర్చీల మధ్య మూట లాగ వేళాడదీసి కర్రలతో బాదడం, పైనుండి వేళాడదీసి చితకగొట్టడం, అసహజలైంగిక చర్యలు బలవంతంగా చేయించడం, మూత్రం తాగించడం, ఇదీ అదీ అనక అన్నిరకాల హింసలు ప్రయోగిస్తారు.

వివరాలు యిచ్చుకుంటూ పోతే ఇటువంటి పుస్తకాలు పది రాయవలసి వుంటుంది. ఆదిలాబాద్ నుండి తూర్పుగోదావరి దాకా వున్న అడవి ప్రాంతాల ఎక్కువగా గిరిజనులు నివసించే ప్రాంతాల-నుండి క్లుప్తంగా కొంత సమాచారం ఇస్తాము.

కరీంనగర్ జిల్లాలోని అడవి ప్రాంతమయిన మహదేవ్‌పూర్ తాలూకాలో 1985 సెప్టెంబర్ నుండి 1986 మే నెలదాకా ఎడతెరిపి లేకుండ గ్రామాల మీద దాడులు జరిగాయి. మొత్తం 438 మందిని (గిరిజనులు, గిరిజనేతర పేద రైతులు) కొట్టి, తన్ని, చేతులుకాళ్లు విరగ్గొటి, చిత్రహింసలకు గురిచేసారు. ఈ సంవత్సరం మేనెలలోనే గొల్లపల్లిలో 40 మందిని, గండికామారంలో 25 మందిని, చింతపల్లిలో 20 మందిని, సింగారంలో 15 మందిని, రేగుల గూడెంలో 4గురిని, నర్సింగాపురంలో 40 మందిని, ఊట్లపల్లిలో 40 మందిని ములుగుపల్లిలో 10 మందిని, ఆదివారంపేటలో 30 మందిని ఇళ్ళనుండి బయటికి లాగి పోగేసి కొట్టారు. ఈ దాడులు, చిత్రహింసల ఫలితంగా నిమ్మ గూడెంకు చెందిన ఒక 20 సంవత్సరాల స్త్రీ, 30 సంవత్సరాల పురుషుడు (సుంకరి), వేమనపల్లెకు చెందిన 35 సంవత్సరాల పురుషుడు మరణించినట్లు

వార్తలు. కనీసం 21 గ్రామాల నుండి గ్రామానికి 5 నుండి 20 మంది చొప్పున కేసులలో ఇరికించి తిప్పుతున్నారు.

మహదేవపూర్ అడవిని అనుకొని వరంగల్ జిల్లాకు చెందిన చిట్యాల, ఏటూర్‌నాగారం తాలూకాలున్నాయి. ఇదిగూడ అడవి ప్రాంతమే. గడిచిన సంవత్సర కాలంలో ఈ తాలూకాల్లో గూడ ప్రజలను తీవ్రంగా నిర్బంధానికి గురి చేసినట్టు తెలుస్తోంది. ఈ అడవి ప్రాంతమంతా మొదటి నుండి సాయుధ పోలీసు క్యాంపులుంటూనే వున్నాయి. 1985 సెప్టెంబరులో 22 కొత్తక్యాంపులు పెట్టారని, ఈ వేసవి కాలంనాటికి మొత్తం 50కి పైగా క్యాంపులున్నట్లు అంచనా. సింగారం, నాగారం, వెంకటపురం తాడ్వాయి, కొత్తగూడెం, లింగాల, నార్లపురం, ములుగు, జంగాలపల్లి, మొదలయిన ఎన్నో గ్రామాలమీద దాడులు జరిపి చాలా మందిని అరెస్టుచేసి 25-30 దినాల దాకా అక్రమ నిర్బంధంలో వుంచి కేసులు బనాయించి జైలుకు పంపారు. నాగారంలో 40 మందిని ఒక దగ్గర పోగుచేసి అందరికీ బలవంతంగా గుండుచేయించారు. ఆ గ్రామానికి చెందిన బాలయ్య అనే 60 సంవత్సరాలరైతు చిత్రహింసలు భరించలేక బావిలోకి దూకితే బయటకు తీసి మళ్ళీకొట్టి 3 రోజులు నిర్బంధించారు.

ఈ ప్రాంతంలో పోలీసులు చేస్తున్న అర్థరహితమయిన బీభత్సానికి మచ్చుతునకగా ఒక ఉదంతం :

అజంనగర్ గ్రామానికి చెందిన రాజిరెడ్డికోసం పోలీసులు వెతుకుతున్నారు. అతను దొరకలేదు. అతని తండ్రి లింగారెడ్డినీ, తమ్ముడు అనంతరెడ్డిని, అరెస్టు చేసి రోకలి బండలు ఎక్కించారు. 1985 మే 26 నాడు అతని చెల్లెలి పెండ్లి జరగాల్సి వుండగా పెండ్లి జరగకుండ ఆపటానికి పోలీసులు తీవ్రప్రయత్నం చేసారు. పెండ్లి ఖర్చుకోసం ఒక వ్యాపారస్తుడికి ధాన్యం అమ్మితే అతన్ని బెదిరించి ధాన్యం తిరిగి ఇప్పించారు. పెండ్లికి తెచ్చిన సామాన్లను తినుబండారాలను చిందర వందర చేసారు. స్త్రీలను బండబూతులు తిట్టి బెదిరించారు. ముందురోజు యింటిమీద దాడిచేసి బంధువులను గెంటివేసి ఇంటికి తాళం వేసారు. గ్రామ సర్పంచ్ ఎస్.ఐ దగ్గరికిపోయి ఇదేం అన్యాయం అంటే అతన్ని బండబూతులు తిట్టారు. చివరికి పెళ్ళి ముహూర్తం పెట్టిన తరువాతిరోజున, ఇంటిచుట్టూ పోలీసు కాపలా పెట్టి వచ్చేపోయే వాళ్ళందరినీ చెక్ చేసి సాయుధ పహారాతో పెళ్ళి చేయించారు.

మూకుమ్మడిగా జనాన్ని కొట్టిన సంఘటనలు ప్రస్తావించాము. ఇటువంటివి ముఖ్యంగా వరంగల్ పోలీసులకు బాగా అలవాటు. రాడికల్స్ బంద్ పిలుపు ఎప్పుడిచ్చినా వాళ్ళతో సంబంధం ఉన్నవాళ్ళను, లేనివాళ్ళను, ఉండీ వదులు

కున్న వాళ్లను అందరినీ పోగేస్తారు. వాళ్లకు వ్యతిరేకంగా నినాదాలు ఇప్పిస్తూ నగ్నంగా ఊరేగింపు తీయిస్తారు. పోస్టర్లు అంటిస్తున్న వాళ్ళు దొరికితే వాళ్ల బట్టలు విప్పి, వీపుకు బంక పూసి, పోస్టర్లు వీపుకు అంటిస్తారు. నగ్నంగానే పోలీస్‌స్టేషన్ ఆవరణలోనూ తారురోడ్డు మీదా పొర్లిస్తారు. తలయెత్తినా పొర్లడం ఆపినా చితకగొడతారు. ఈ సంవత్సరం మే నెలలో నర్సంపేటలో కొందరు యువకులను చొక్కాలు లేకుండ మండుటెండులో తారురోడ్డు మీద పొర్లించిన ఉదంతం పేపర్లలో వచ్చింది.

ఏటూర్‌నాగారం అడవిని వదిలి గోదావరి ఒడ్డున నదికింది భాగానికి వస్తే ఖమ్మంజిల్లాలోని అటవీప్రాంతం తగులుతుంది. ఇక్కడున్న ఇల్లెందు సుదిమళ్ల తాలూకాలలోనూ ఇదే పరిస్థితి. ఎం. ఎల్. ఏ. శ్రీ గుమ్మడి నర్సయ్య ముఖ్యమంత్రికి రాసిన బహిరంగలేఖలో టేకులపల్లి మండలంలో 15 గ్రామాలు, గుండాల మండలంలో 15 గ్రామాలు, బయ్యారం మండలంలో 6 గ్రామాలు, గార్ల మండలంలో 6 గ్రామాలు, ఇల్లెందు మండలంలో 15 గ్రామాలు ఈ మధ్యకాలంలో పోలీసు అత్యాచారాలకు గురయినట్టు తెలిపారు. ఈ గ్రామాల ప్రజలను వందల సంఖ్యలో కొట్టడం, అరెస్టు చేయడం, చిత్రహింసలకు గురి చేయడం, కేసులు పెట్టి జైలుకు పంపడం మాత్రమేకాక, పోలీసులు జనంచేత వెట్టిచాకిరీ గూడ చేయించుకుంటున్నారని ఆయన ఆరోపించాడు. టేకులపల్లి మండలంలో వున్న సంపత్‌నగర్ పోలీసు క్యాంపు పరిధిలోని గ్రామాల గురించి చెబుతూ ఆయన ఈ విధంగా అన్నారు.

"పై గ్రామాలన్నింటిలోనూ ప్రతీగ్రామంనుండి 50 నుండి 100 మంది దాకా పోలీసులకు వెట్టి చేసారు. ఒక్కొక్క గ్రామం రెండు మూడుసార్లు గూడ వెట్టి చేసారు. క్యాంపుకు గడ్డి తేవడం, వాసాలు తేవడం, టేకుకర్ర తెచ్చి ఇవ్వడం మొదలగు పనులతో ప్రజలచేత వెట్టి చేయించుకుంటున్నారు."

**గుండాల మండలాన్ని గురించి చెబుతూ:**

"చెట్టుపల్లి, అళ్ళపల్లి. గుండాలమర్కోడు పోలీసులు ఈ ప్రాంతంలోని గిరి జనుల చేత ప్రతిరోజు ఏదో ఒక గ్రామం వారిచేత వెట్టి చేయించుకోవడం మామూలయ్యింది. పొయిలోకి కట్టెలు తేవడం, మంచాలు నేయడం, టేకు కలప తెచ్చి ఇవ్వడం, క్యాంపుల చుట్టూ గడ్డి చెక్కటం, తదితర అనేక పనులు ఈ అమాయక గిరిజనుల చేత వెట్టిగా చేయించుకుంటున్నారు. వారానికి ఒక గ్రామం చొప్పున పోలీసులు వెట్టి చేయించుకుంటున్నారు. గ్రామంలోని గిరి

జనులంతా ఆరోజు వెట్టికి వెళ్ళాల్సిందే. లేకుంటే పోలీసుల హింసలు తప్పవు.

2. **ఆస్తి నష్టం:** సి.పి.ఐ (ఎం-ఎల్) గ్రూపుల కార్యకర్తలు లేక సాను భూతి పరుల ఆస్తులు నష్టం చేయడం చాలాకాలంగా సాగుతున్న చర్యే. వాళ్ళ ఇళ్ళమీద దాడులు చేసి కుండలు గాదెలు పగలగొట్టడం, కుర్చీలు విరగొట్టడం, తిండి పదార్థాలు నాశనం చేయడం, బియ్యంలో కారం, పప్పులో కిరోసిన్ కలిపి బావిలో పడేయడం, వాళ్ళ పశువులను తోలుకు పోవడం, వాళ్ళపొలాల్లోకి పశువు లను తోలి మేపించడం, వాళ్ళ వ్యవసాయం గ్రామంలో ఎవరూ చేయకూడదని నిర్బంధించడం, ఇవన్నీ నాలుగయిదేళ్ళగా తెలంగాణ జిల్లాలలో జరుగుతున్నవే.

అయితే గత సంవత్సరం రెండేళ్ళుగా కొత్తగా జరుగుతున్నది.ఏమిటంటే ఒక పద్ధతి ప్రకారం ఇళ్ళుకూల్చేయడం. ఇది ప్రధానంగా కరీంనగర్ జిల్లాలో జరుగుతోంది. కార్యకర్తలు లేక సానుభూతి పరులుగా అనుమానించిన వాళ్ళ యిళ్ళలోని సామానంతా బయట పడేసి, తుపాకులతో కర్రలతో కొట్టి అంతా విరగొట్టి, ఆతరువాత యింటి దూలాలు, కప్పుమీది పెంకులు, గోడలు కూల్చేసి నుగ్గు నుగ్గు చేస్తున్నారు. బహుశా ఇప్పటికి ఆ జిల్లాలో 350 ఇళ్లు ఆవిధంగా కూల్చివుంటారు.

1985 ఆగస్టు చివరి వారం సెప్టెంబర్ మొదటి వారాలలో జగిత్యాల తాలూకాలోని దొంతపూర్, బీర్‌పూర్, నర్సింలపల్లె, తీగెలధర్మారం, కోల్వాయి రేకులపల్లె, జైనా తదితర గ్రామాలలో 33 ఇళ్లు, పెద్దపల్లి, సుల్తానాబాద్ తాలూకాలలోని కొలనూర్, మంగపేట, అడవి శ్రీరాంపూర్, కుక్కల గూడూర్, తక్కెళ్ళపల్లి, పాలకుర్తి, బ్రాహ్మణపల్లి, తదితర గ్రామాలలో 48 ఇళ్ళు, పోలీ సులు ధ్వంసం చేసారు. కొన్ని గ్రామాలలో ప్రత్యక్ష సాక్ష్యులు చూసిన దృశ్యాన్ని ఇక్కడ ఇస్తున్నాం.

దొంతాపూర్‌లో చంద్రయ్య అనే నేతకాని కులానికి చెందిన యువకుని ఇంట్లోకి చొరబడి తలుపులు నరికేసారు. గునపాలతో గడపలను పెకిలించారు. ఆకుటుంబానికి ఏకైక ఆధారమయిన హోటల్‌ను నాశనం చేసారు. పప్పులో ఉప్పు, నూనెలో బియ్యం, కారం, యూరియా కలిపి నేలపాలు చేసారు. బిందెలను గునపాలతో చిల్లులు పొడిచారు. ఇంటి వాసాలు పీకేసారు.... 25 వేలు నష్టం అయింది.

తీగెలధర్మారంలో మేముల శంకరి ఇంట్లో నాలుగు మంచాలనుగొడ్డళ్ళతో నరికారు. ఎనిమిది రోజుల బాలెంత పడుకొనివున మంచాన్ని గూడ వదల్లేదు. మంచం మీదవున్న పసికందును కిందపడేసి బాలెంతరాలిని నేలమీదికి ఈడ్చి మంచాన్ని నరికేసారు. తరువాత ఇల్లు మొత్తం కూల్చేసారు.

కొల్వాయిలో ఏడుగురు రైతులను బజార్లోపడుకోబెట్టి గొడ్డళ్లు తిరిగేసి విపరీతంగా కొట్టారు. పిరుదులమీద, పిక్కలమీద, పాదాలమీద, వీపుమీద, బాదారు....ఏడుగురి ఇళ్లూ కూల్చారు.

ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన గ్రామాలలో ఫిబ్రవరి, 1986 నుండి మొదలు పెట్టి ఇటువంటి బీభత్సకాండే కొనసాగిస్తున్నారు. తరతరాలుగా గిరిజనులు పోడు వ్యవసాయ పద్ధతిలో వ్యవసాయం చేస్తున్న భూమిని 1965 లో 'అటవీ భూమి' గా ప్రకటించి, కొన్నాళ్లు గిరిజనుల దగ్గర లంచాలు పుచ్చుకొని వాళ్ల 'అక్రమణ' ను ఉపేక్షించి, ఇప్పుడు పెద్ద ఎత్తున బేదఖల్ చేస్తున్నారు. జనాన్ని మాత్రమే తరిమేస్తే తిరిగి వస్తున్నారని వాళ్ల గ్రామాలను తగల బెడుతున్నారు. జిల్లా కలెక్టరు, ఫారెస్ట్ కన్సర్వేటర్ల ఆధ్వర్యాన ఈ దౌర్జన్యం జరుగుతోంది. బోత్, ఉట్నూర్, ఖానాపూర్ తాలూకాలలో కనీసం 20 గిరిజన గ్రామాలను ఈ విధంగా దహనం చేసి, గిరిజనులను ట్రక్కులలో తీసుకుపోయి అడవులలోనో మహారాష్ట్ర సరిహద్దు అవతలనో వదిలి వస్తున్నారు. బోత్ తాలూకా మాణిక్యాపూర్‌కు చెందిన ప్రత్యక్ష సాక్షి కథనం :

"ఒకనాడు ఉదయం ఫారెస్ట్ చౌకీదార్ వచ్చి, కలెక్టరు వస్తున్నాడు. మీ భూములకు పట్టాలు ఇస్తాడు. ఊరంతా సాఫు చేయండి, అన్నాడు. మేము వీధులన్నీ ఊడ్చి సాఫు చేసినాము. ఒక గంటసేపయినాక రెండు జీపులలో కలెక్టర్, ఫారెస్ట్ కన్సర్వేటర్, డి. ఎస్. పి. వచ్చారు. వాళ్లతోబాటు గునపం పార పట్టుకున్న కూలీలు ఉన్నారు. మేము అడవి భూములు దున్నడం మానేయాలనీ మాన్పించడం కోసం మమ్మల్ని గ్రామం నుండి తరిమేస్తున్నారనీ చెప్పారు. ఇళ్ల నుండి సామాన్లు బయటపడేయమన్నారు. తటపటాయించిన వాళ్లను కొట్టి, వాళ్ల సామాన్లు కూలివాళ్లచేత బయటపడేయించారు. తరువాత గ్యాస్ నూనెపోసి ఇండ్లన్నిటికీ నిప్పుబెట్టితగలబెట్టారు. మమ్మల్నందరినీ ట్రక్కులలో ఎక్కించుకొని దూరంగా వున్న అడవులలో వదిలిపెట్టి ఎక్కడయినా కూలి చేసుకొని బ్రతకమన్నారు."

ఈ దాడులలో భాగంగానే ఇంద్రవెల్లిలో 1981లో జరిగిన పోలీసు కాల్పులలో మరణించిన గిరిజనుల స్మృతిలో నిర్మించిన స్థూపాన్ని 1986 ఏప్రిల్ నెల మొదటి వారంలో పోలీసులు డైనమైట్లు పెట్టి కూల్చారు

తూర్పుగోదావరి జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో గూడ పోలీసులు గిరిజన గ్రామాలను తగల బెట్టినట్టు వార్తలు వచ్చాయి. తాము 60 గ్రామాలను తగల బెట్టినట్లు కొందరు పోలీస్ అధికారులే గర్వంగా చెప్పుకున్నారట.

### 3. సభ పెట్టుకునే హక్కు

భారత రాజ్యాంగంలోని అధికారణం. 19 (1) ప్రకారం ప్రజలకు సమావేశాలు జరుపుకునే హక్కు ప్రాథమిక హక్కు. అయితే సాధారణ పరిస్థితులలో గూడ ఈ 'ఈ ప్రాథమిక హక్కు' కంటె సెక్షన్ 144 (నేర విచారణ స్మృతి) క్రింద నిషేధాజ్ఞలు ప్రకటించడానికి ఒక సాధారణ తాసీల్దారుకు ఉండే అధికారం మిన్న. అక్కడి దాకా పోనక్కరలేదు. పోలీసు చట్టం క్రింద మైక్ పర్మిషన్ నిరాకరించేందుకు ఒక సర్కిల్ ఇనస్పెక్టర్‌కు ఉండే అధికారం మిన్న. దీని పర్యవసానం ఏమిటంటే ప్రస్తుతం సమావేశ స్వేచ్ఛ అనేది నామ మాత్రంగా గూడ లేకుండపోయింది. కేవలం మైక్‌పర్మిషన్ నిరాకరణకే ఈ ఉల్లంఘన పరిమితం కాలేదు. సభ పెట్టుకునే హక్కు లేకుండా చేయడం అనేది ఒక దాడి రూపంలో సాగుతుంది. సభకు మైక్ పర్మిషన్ ఇచ్చేదీ లేనిదీ వెంటనే 'ఇన్‌స్పెక్టర్ సాబ్' చెప్పడు. రేపురా మాపురా అంటాడు. ఈ లోపల సభకోసం ప్రచారం చేస్తున్న కార్యకర్తల అరెస్టులు ప్రారంభం అవుతాయి. పోస్టర్లు అంటిస్తున్న వాళ్లను అరెస్టు చేసి, కొట్టి, పోస్టర్లు వాళ్ల వీపులకే అంటించిన సంఘటనలున్నాయి. వాళ్ల దగ్గర బాంబులు దొరికాయనీ తుపాకులు దొరికాయనీ కేసులు పెడతారు, చివరికి సభ పెట్టుకునేరోజు వచ్చేసరికి ఏర్పాట్ల మీద దాడి జరుగుతుంది. వేదికను కూలగొట్టడం. మైకు ఎత్తుకు పోవడం, మైకు సప్లై చేసిన దుకాణం దారును అరెస్టు చేయడం, జరుగుతుంది. సభ వుందను కొని దూరప్రాంతాల నుండి వచ్చిన వాళ్లను బస్సుల నుండి రైళ్ల నుండి దింపి చితకకొట్టడం, అరెస్టు చేయడం, జరుగుతుంది. సభా స్థలం దగ్గర లాఠీచార్జి చేసి చెదరగొడతారు.

రాజమండ్రిలో 1985 జూన్ 2-3 తేదీలలో, ఖమ్మంలో డిసెంబర్ 28-29 తేదీలలో, ఆలేరులో 1986 జనవరి 21-22 తేదీలలో, జరగాల్సి వుండిన రైతుకూలీసంఘాల సభలను ఈ విధంగా భగ్నం చేసారు. ఖమ్మం సభలకు నిర్వాహకులు హోంమంత్రిని కలిసినప్పుడు మీరు సభ జరుపుకోండని ఒక వైపు వాళ్లకు హామీ యిస్తూ ఇంకొక వైపు ఆయనగారు పోలీసులకు మీ యిష్టం వచ్చినట్లు కానీయండి అని అనుమతియిచ్చాడు. 1985 అక్టోబర్ 6 నాడు విజయవాడలో దళిత మహాసభ సమావేశాన్ని గూడ-అనుమతియిచ్చి తరువాత-లాఠీచార్జిచేసి భగ్నంచేసి కత్తి పద్మారావును అరెస్టు చేసారు. శ్రీకాకుళం జిల్లా పలాసలో జరగాల్సివుండిన విప్లవ రచయితల సంఘం సభను గూడ ఆటంక పరిచారు. ఈ మధ్యనే-1986 జూన్ 6 తేదీన-నల్గొండ జిల్లా నక్రేకల్‌లో

కరువు మీద, బహిరంగ స్థలంలో కాదు, హాలులో జరుపుకుంటున్న సమావేశం మీద దాడి చేసారు. ఇక శాంతి యుతమయిన ఊరేగింపుల మీద దాడులకు లెక్కలేదు. ఈ సంవత్సరం జూలై 20 తేదీన, చెరువులలో చేపలు పట్టుకునే హక్కును కాంట్రాక్టర్లకు వేలం పాటలో యివ్వకూడదని, మత్స్యకారులకే యివ్వాలని, కోరుతూ హైదరాబాద్‌లో ఊరేంగింపు చేస్తున్న మత్స్యకారులపైన దారుణంగా దాడిచేసి చాలా మందిని కొట్టి అరెస్టు చేసారు.

నిజానికి సమావేశ స్వేచ్ఛ ఒక్కటే కాదు, అధికరణం 19 (1) లోని అందమయిన హక్కులన్నీ యివాళ-ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాలలో—పోలీసు ఠాణాలలో బంది అయ్యాయి. ప్రింటింగ్ ప్రెస్‌లు పోలీసులు అనుమతి లేకుండ కరపత్రాలుగాని పుస్తకాలుగాని అచ్చువేయడానికి వీలులేదు, కరపత్రాలు ప్రచురించడంఅనేది అభిప్రాయ స్వేచ్ఛలోఅంతర్భాగమనిసుప్రీంకోర్టు 1962లో యిచ్చిన ఒక తీర్పులో చెప్పింది. వరంగల్. కరీంనగర్ జిల్లాలలో పోలీసుల అనుమతిలేకుండ యువకులకు ఇళ్లు అద్దెకు ఇవ్వడానికి వీలులేదు. అధికరణం 19 (1)లోని నివాస స్వేచ్ఛకూ వృత్తి స్వేచ్ఛకూ ఇది వ్యతిరేకమైనప్పటికీ పోలీస్ అధికార్లు మైకులలో ఈ నిషేధాన్ని ప్రకటిస్తూ తిరుగుతున్నారు. చివరికి పత్రికా విలేఖరులకు పోలీసు అత్యాచారాల మీద రిపోర్టులు పంపే హక్కు గూడ లేదు. పోలీసులు వాళ్ళను బహిరంగంగా బెదిరిస్తున్నారు.

స్కూళ్ళలో, కాలేజీలలో యూనివర్సిటీలలో విద్యార్థులకు ఏ భావాలుండ వచ్చునో ఏ భావాలుండకూడదో నిర్ణయించే అధికారాన్ని పోలీసులు చేజిక్కించు కోవడంగూడ అభిప్రాయ స్వేచ్ఛమీద జరుగుతున్న దాడిలో భాగమే. వరంగల్ వంటి విద్యాకేంద్రంలో 'తప్పుడు' రాజకీయ అభిప్రాయాలున్న ఏకైక 'నేరానికి' అరెస్టులకు, తీవ్రమయిన చిత్రహింసలకు గురయిచదువుమానుకున్న విద్యార్థుల సంఖ్య వందలలో ఉందేమో. ఈ సంవత్సరం నెల్లూరు జిల్లా కావలి పట్టణాన్ని ఒక చిన్న వరంగల్‌గా మార్చారు. పరీక్షల సమయంలో హాలునుండి కొందరిని, రాత్రిపూట హాస్టల్ నుండి కొందరిని, అరెస్టు చేసి తీసుకుపోయి పరీక్షలు అయి పోయేదాకా లాకప్పులో ఉంచుకున్నారు. ఆ తర్వాత కొందరి మీద 'రాజద్రోహం' తదితర సెక్షన్లు పెట్టగా కొందరిని ఏకేసూ పెట్టకుండా వదిలిపెట్టారు. నిత్యం హాస్టళ్ళ మీద దాడులు జరుగుతుంటే కొందరు విద్యార్థులు భయపడి తమంతట తామే పరీక్షలు వదులు కొని ఇళ్ళకు పోయారు.

గ్రామాల మీద దాడులు చేసేటప్పుడు, సి.పి.ఐ. (ఎం-ఎల్) గ్రూపుల కార్యకర్తలను పట్టియ్యమనేది ఒక ఒత్తిడి అయితే, రైతుకూలీ సంఘాల సభ్యత్వానికి రాజీనామా చేసి కాంగ్రెస్‌లోనూ తెలుగు దేశంలోనూ చేరమనేది ఇంకొక

ఒత్తిడి. చిత్రహింసలకు తట్టుకోలేక రాజకీయ అభిప్రాయాలు లాకప్పులో మార్చుకున్నామని ప్రకటించి ప్రాణాలు దక్కించుకున్న కూలినాలి జనం ఎందరో ఉన్నారు.

**4. 'ఎన్‌కౌంటర్లు':** 1985 జనవరి నుండి ఇప్పటిదాకా మనరాష్ట్రంలో 52 మంది రాజకీయ కార్యకర్తలను, సానుభూతిపరులను, 31 'ఎన్‌కౌంటర్ల'లో పోలీసులు చంపారు. ఈ 31 సంఘటనలతో రెండింటిలో మాత్రమే ఇరువైపుల నుండి కాల్పులు జరిగినట్టు ఖచ్చితంగా తెలుసు. ఒక సంఘటనలో ఒక కానిస్టేబుల్ చనిపోయాడు. తక్కిన 'ఎన్‌కౌంటర్లు' అన్నీ పూర్తిగా బూటకాలే. అనుబంధం—IIలో ఈ 'ఎన్‌కౌంటర్ల' గురించి మాకు తెలిసిన వివరాలు ఇచ్చాము.

మొదటి 9 ఎన్‌కౌంటర్ల తరువాత ఎ.పి.సి.ఎల్.సి సుప్రీం కోర్టులో పిటిషన్ వేసింది. 1985 సెప్టెంబర్‌లో అడ్మిట్ చేసుకున్న ఆ పిటిషన్‌ను సుప్రీంకోర్టు ఈ సంవత్సరం ఏప్రిల్‌లో కొట్టివేసింది. చనిపోయిన వాళ్ళ బంధువులు మెజిస్ట్రేటుకోర్టులో పోలీసులమీద ప్రైవేట్ కంప్లైంట్ వేసుకోవచ్చునని సలహా యిచ్చింది.

ప్రస్తుతం తెలంగాణ జిల్లాలలోను, కోస్తా జిల్లాల ఏజెన్సీ ప్రాంతాలలోను ప్రభుత్వం పోలీసులకు చాలా విచ్చలవిడి అధికారాలు యిచ్చింది. ఎటువంటి అత్యాచారాలు చేసినా-ఎవరినిబడితే వాళ్ళను కాల్చి పారేసినా—ఏ రకమయిన చర్యా తీసుకోనని హామీ యిచ్చింది. నక్సలైట్లను కాల్చిపారేస్తే వేలరూపాయల పారితోషికంగూడ యిస్తోంది. దీనికితోడు అత్యాధునికమయిన స్టెన్‌గన్‌లను గూడ సప్లై చేస్తున్నది. చాలా సున్నితమయిన ఈ ఆయుధాలతో 'పొరబాట్లు' చేయడం చాలా సులభం. అటువంటి రెండు 'పొరబాట్లు' ఈ సంవత్సరం కరీంనగర్, వరంగల్ జిల్లాలలో జరిగాయి. 'స్వేచ్ఛ' నుండి రిపోర్టులు :

జనవరి 1 (1986) నాడు రాత్రి పోలీసులకు ఎనిమిదవ ఇంక్లైన్ (గోదావరిఖని, కరీంనగర్ జిల్లా) క్వార్టర్స్‌లో నక్సలైట్లు ఉన్నారని సమాచారం అందింది. వెంటనే పోలీసులు ఆ ప్రాంతానికి చేరుకున్నారంట. అప్పటికే 'తీవ్రవాదులు' పారిపోయారట. ఆ సమయానికి చీకట్లో నడిచి వెళుతున్న జయరాజ్ అనే వ్యక్తిని నక్సలైట్ ఏమోనని అనుమానించి స్టెన్‌గన్‌తో పోలీసులు అయిదు రౌండ్లు కాల్చారంట. అందులో రెండురౌండ్లు జయరాజ్‌కు తగిలాయి. జయరాజ్ తండ్రి సింగరేణి కాలరీస్‌లో ఆఫీసరు. తాము చేసిన తప్పుకు ప్రాయశ్చిత్తంగా పోలీసులే జయరాజ్‌ను ఆస్పత్రిలో చేర్పించి చికిత్స వ్యవహారం చూసారు.

తత్ఫలితంగా జయరాజ్ ప్రాణాలతో బయటపడ్డాడు. ఏ ఆఫీసర్ కొడుకూ కాని అనంతుల నర్సయ్యకు అంతటి అదృష్టం లేకపోయింది. వరంగల్ జిల్లాలోని ఊట్లమాట్వాడ ఆర్మ్‌డ్ అవుట్ పోస్టుకు కొద్దిదూరం నుండి 1986 జనవరి 3 రాత్రి అనంతుల నర్సయ్యా, అతనిమిత్రుడు కలిసి నడిచిపోతున్నారు. అవుట్‌పోస్ట్ సెంట్రీచూసి నక్సలైట్లని అనుమానించి తోటి పోలీసులకు చెప్పాడు. పోలీసులు తుపాకులు వేసుకొని నర్సయ్యను, అతని మిత్రుడిని, పట్టుకోవడానికి వెళ్ళారు. అనుకోకుండా సాక్షాత్కరించిన పోలీసులను చూసి వాళ్ళిద్దరూ పరిగెత్తారు. వాళ్ళు పారిపోవడం చూసి పోలీసులు కాల్చారు. నర్సయ్యకు గాయాలు తగిలాయి, అతని మిత్రుడు తప్పించుకున్నాడు. పోలీసులే ఆస్పత్రిలో చేర్చగా నర్సయ్య తెల్లవారి మరణించాడు. ఎస్.పి. వ్యాఖ్య ప్రకారం నర్సయ్య నక్సలైట్ కాడు. నర్సయ్య కుటుంబానికి 2000 రూపాయలు 'నష్టపరిహారం' ఇవ్వాలని పోలీసులు నిర్ణయించారు.

రెండు సంఘటనల్లోనూ ఆయాజిల్లాల పోలీస్ సూపరింటెండెంట్లు తొందరపడి కాల్పులు జరిపిన జవాన్లను సస్పెండ్ చేసారు. 'పొరపాటు' జరిగిందని వినమ్రంగా ఒప్పుకున్నారు. అయితే గమనించాల్సిన విషయం ఏమిటంటే జవాన్ల మీద చర్యతీసుకున్నది చట్టవ్యతిరేకంగా ప్రవర్తించినందుకు కాదు, నక్సలైట్లుకాని వాళ్లను చంపినందుకు. చనిపోయిన వాళ్లు నక్సలైట్లుఅయివుంటే జవాన్లకు సస్పెన్షన్ కాదు, పారితోషికం దొరికేవి. బహుశా ప్రమోషన్ గూడ దొరికేదేమో.

అంతేగాక, ఎవరినయినా కాల్చిపారేసి 'తీవ్రవాది'ని చంపానని ప్రకటించి తప్పించుకొనే అవకాశం ఈ జిల్లాల్లో పోలీసు అధికార్లకు చిక్కింది. జనవరి నెలలోనే వరంగల్‌లో సమ్మయ్య అనే రిజర్వ్ ఎస్. ఐ. తన తోడల్లుడి నుండి తనకు ప్రాణాపాయం వుందని ఎస్.పి.తో చెప్పి, డ్యూటీలో లేనప్పుడు గూడ రివాల్వర్ ఉంచుకొనే పర్మిషన్ తీసుకున్నాడు (ఇది ఎంతవరకు చట్టబద్ధమో అనుమానమే). ఆ రివాల్వర్‌తో తోడల్లుడిని కాల్చిపారేసి, అతను తీవ్రవాది అనీ మొదట్లో ప్రకటించాడు. అయితే అతను లా అండ్ ఆర్డర్ కాక రిజర్వ్ ఎస్.ఐ. కావటంవల్ల, హతుడు బంధువు కావటంవల్ల, ఆస్తితగాదా వుండటంవల్ల ఎం.సి.పి.ఐ. నాయకుడు శ్రీ ఓంకార్ హతుడిని తమ పార్టీ కార్యకర్తగా పేర్కొని అలజడి చేయడం వల్ల, ఈ కట్టుకథ నిలవలేదు. కాని ఇంకొంచెం జాగ్రత్తగా వ్యవహరించి వుంటే నిలబెట్టుకునే వాడుకాడా?

**5. టెర్రరిస్టు చట్టం :** గతసంవత్సరం సెప్టెంబర్ నుండి మన రాష్ట్రంలో టెర్రరిస్టు మరియు విచ్ఛిన్నకర కార్యకలాపాల (నివారణ) చట్టాన్ని ప్రయోగిస్తున్నారు. మొట్టమొదటి అనకాపల్లిలో ఒక లెక్చరర్‌ను ఈ చట్టంకింద అరెస్టు చేసారు. ఆ తరువాత హైదరాబాదులో ఒక కార్మిక నాయకుడిని, ఎ.పి.సి.ఎల్.సి ప్రధాన కార్యదర్శి బాలగోపాల్‌ను అరెస్టు చేశారు. అప్పటి నుండి ఈ టెర్రరిస్టు చట్టంకింద ఎడా పెడా అరెస్టులు చేస్తున్నారు. ఇప్పటికి రాష్ట్రంలో 400 మందికి పైగా టెర్రరిస్టు చట్టం కింద అరెస్టయి వుంటారు. అత్యధిక సంఖ్య (100 పైగా) నిజామాబాద్ జిల్లాలో జరిగాయి.

ఈ 'టెర్రరిస్టు' లంతా ఎవ్వరు? నిజంగా చేతిలో ఆయుధాలతో దొరికిన సి.పి.ఐ(ఎం.ఎల్ గ్రూపుల కార్యకర్తలు కొందరున్నారు. అయితే అధికసంఖ్యాకులు మేధావులు, కార్మికులు, గిరిజనులు, రైతులు, కూలీలు, విద్యార్థులు. ఉదాహరణకు నెల్లూరు జిల్లాలో బస్సు లారీ తదితర భారీ వాహనాల డ్రైవర్లనూ క్లీనర్లనూ 'టెర్రరిస్టు చట్టం' కింద అరెస్టు చేసారు, మన రాష్ట్ర పోలీసులకు టెర్రరిస్టు చట్టం దొరకడం కోతిచేతికి కొబ్బరికాయ దొరికి నట్టయింది

టెర్రరిస్టు చట్టం వల్ల మొదటిఫలితం బెయిలు కష్టసాధ్యం కావడం. మామూలుగా వారం రోజులలోగా బెయిలు దొరికే కేసులకు ఇప్పుడు నెలరోజుల పైనే పడుతుంది. కొన్ని సందర్భాలలో అసలు బెయిలు దొరకడం లేదుకూడ. అయితే ఇప్పటిదాకా టెర్రరిస్టు చట్టం కింద పెట్టిన కేసులు విచారణకు రావడం మొదలుపెట్టలేదుగాని ఆ చట్టం ప్రయోగించడం వల్ల న్యాయవ్యవస్థ ఎంత అప్రజాస్వామికంగా తయారయిందో అర్థంకాదు. రహస్య విచారణలు, సాక్షుల పేర్లు చెప్పక పోవడం, వాళ్ళిచ్చే సాక్ష్యం వివరాలూ ముద్దాయికి చెప్పక పోవడం. సుప్రీం కోర్టుకు మాత్రమే అప్పీల్ చేసుకునేఅవకాశం, ఇవన్నీ ఆచరణలో ఎంత దుర్మార్గంగా పనిచేస్తాయో వేచి చూడవలసిందే.

**6. లంచాలు :**

నక్సలైట్ ఉద్యమాన్ని అణచివేయడం పేరిట రాష్ట్ర ప్రభుత్వం పోలీసు యంత్రాంగానికి ఇచ్చిన స్వేచ్ఛను పోలీసులు తమ స్వలాభంకోసం విరివిగా వాడుకుంటున్నారు. గ్రామాలలో జనాన్ని మూకుమ్మడిగా అరెస్టు చేయడం, 'మీకు నక్సలైట్లతో సంబంధాలు ఉన్నాయి' లేక 'నక్సలైట్లకు అన్నం పెడుతున్నారు' అని బెదిరించి, లంచం ఇవ్వకపోతే కేసులు పెడతామని బెదిరించి లంచాలు వసూలు చేసుకుంటున్నారు. ఇది అన్ని ఉత్తర తెలంగాణ జిల్లాలలోనూ తూర్పుగోదావరి విశాఖపట్నం జిల్లాలలోనూ జరుగుతుంది, కాని

అన్ని జిల్లాలకంటె ఎక్కువగా కరీంనగర్‌లో జరుగుతోంది. కరీంనగర్ జిల్లాకు చెందిన సాధారణ సబ్ఇన్స్పెక్టర్లు సహితం నక్సలైట్ ఉద్యమం పేరుచెప్పి లక్షాధికారులవుతున్నారంటే అతిశయోక్తిలేదు. ఈ మధ్యనే వెలుగులోకి వచ్చిన ఒక ఉదాహరణ ఇక్కడ ఇస్తాము.

కరీంనగర్ జిల్లా సిరిసిల్ల తాలూకాలో పదిర అనే గ్రామం ఉంది. ఈ సంవత్సరం సెప్టెంబర్ నెలలో ఆ గ్రామ ప్రజలనుండి గంభీరరావుపేట ఎస్.ఐ 40,000 రూపాయలు లంచంగా వసూలుచేసిన వైనం చూస్తే 'తీవ్రవాదుల ఏరివేత' పేరిట పోలీసులు లక్షాధికారులేకాదు, బహుశా కోటీశ్వరులవుతున్నారేమోనని అనుమానం రాక మానదు.

సెప్టెంబర్ 3వ తేదీన పదిర గ్రామంలోని ఒక టీచర్ భార్యమీద ఇద్దరు యువకులు అత్యాచారం చేయడానికి ప్రయత్నించారు. గ్రామ ప్రజలు పోలీసులకు ఫిర్యాదు ఇయ్యక, తామే పంచాయితీ జరిపి ఆయువకులకు చెరి 2000 రూపాయలు జుర్మానా విధించారు. ఈ విషయం తెలిసి గంభీరరావుపేట ఎస్ ఐ ఆగ్రహం చెంది, 7వతేదీన 9వతేదీన గ్రామం మీద దాడిచేసి 22 మందిని అరెస్టుచేసి మరొక 110 మందిని తమంతట తామే పోలీస్‌స్టేషన్‌కు రావలసిందిగా బెదిరించి పోయాడు. అందరినీ 11వ తేదీ దాక అక్రమ నిర్బంధంలో ఉంచి తీవ్రంగా హింసించాడు. బట్టలు ఊడదీసి బొర్లా పడుకోబెట్టి బూట్లతో తొక్కి లాఠీలతో చితక బాదాడు. మొత్తం అందరు గూడ తనకు తలసరి 500 రూపాయలు లంచం ఇచ్చుకోవాలని డిమాండు చేసాడు. పెద్ద మనుషులు 'మధ్యవర్తిత్వం' చేసి బేరం 40,000 రూపాయలకు కుదిర్చారు. వారివారి ఆర్థికస్తోమతను బట్టి కొందరు 500, కొందరు 300, కొందరు 100 చొప్పున చెల్లించుకున్నారు. సెప్టెంబర్ 11న 20 వేల రూపాయలు 12వతేదీన 14వేల రూపాయలు ముట్టిన తరువాత అందరినీగూడ తాసీల్దారు ఎదుట నిలబెట్టి 'నక్సలైట్లతో కలసి ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో పోస్టర్లు వేస్తున్నారు' అనే నెపంతో సెక్షన్ 107 (నేరవిచారణ స్మృతి) క్రింద బాండ్లు తీసుకొని వదిలి పెట్టాడు. జిల్లా కలెక్టర్, ఎస్.పి, పెద్దపల్లి డి ఎస్ పి లదృష్టికి ఈ సంఘటన వచ్చినప్పటికీ ఎటువంటి చర్య ఇప్పటి దాకా తీసుకోలేదు.

# ముగింపు

దేశంలో ప్రజలకు, ముఖ్యంగా పేద ప్రజానీకానికి, సమస్యలు రోజు రోజుకు పెరిగి పోతున్నాయి. వాళ్ళ ఆదాయం పెరగడం లేదుగాని వాళ్ళ నిత్య జీవిత అవసరాల ధరలు విపరీతంగా పెరిగి పోతున్నాయి. వాళ్ళ సంక్షేమాన్ని గురించి ప్రభుత్వం రూపొందించిందని చెప్పుకుంటున్న పథకాలేవీ సరిగ్గా అమలు కాలేదు. 1948 నుండి మనదేశంలో కనీస వేతనాల చట్టం ఒకటి అమలులో వుంది. దాని ప్రకారం వ్యవసాయ కూలీలకు ఏపనికయినా ఏప్రాంతంలో నయినా దినకూలి రూ॥ 8-50 కంటే తక్కువ ఇవ్వడానికి వీలులేదు. వాస్తవానికొస్తే మన రాష్ట్రంలో స్త్రీలకు దినకూలీ రూ॥ 2 నుండి 5 దాకా మాత్రమే యిస్తారు. మూడు నాలుగు జిల్లాలను మినహాయిస్తే మిగిలిన చోట్ల మగవాళ్ళకు గూడ సంవత్సరంలో రెండు నెలలకంటె ఎక్కువకాలం కనీస వేతనాలు దొరకవు. ఇదిలా వుండగా ప్రభుత్వం లెక్కల ప్రకారమే వ్యవసాయ కూలీల వాడకపు సరుకుల ధరలసూచిక (Consumer Price Index For Agricultural labourers) 1960-61 తోపోలిస్తే 1984 నాటికి 4.64 రెట్లయింది.

దీని ఫలితం దారిద్ర్యానికి సంబంధించిన గణాంకాలలో కనబడుతుంది. 1977-78లో మనరాష్ట్రంలోని వివిధ జిల్లాలలో దారిద్ర్యరేఖ (తలసరి నెల ఆదాయం రూ॥ 50)కు దిగువన వున్న గ్రామీణ జనాభా నిష్పత్తి చూడండి :

| జిల్లా | దారిద్ర్య రేఖకు దిగువన వున్న గ్రామీణ జనాభా (శాతం) |
|---|---|
| ఆదిలాబాద్ | 69.6 |
| నిజామాబాద్ | 41.9 |
| కరీంనగర్ | 80.4 |
| వరంగల్ | 70.2 |
| ఖమ్మం | 39.6 |
| మెదక్ | 68.1 |
| రంగారెడ్డి | 59.5 |
| నల్గొండ | 31.9 |
| మహబూబ్‌నగర్ | 57.2 |
| కృష్ణా | 34.5 |
| గుంటూర్ | 33.5 |

| జిల్లా | దారిద్ర్యరేఖకు దిగువనవున్న గ్రామీణ జనాభా (శాతం) |
|---|---|
| ప. గోదావరి | 41.4 |
| తూ. గోదావరి | 44.4 |
| విశాఖపట్నం | 55.4 |
| శ్రీకాకుళం | 69.7 |
| ప్రకాశం | 49.5 |
| నెల్లూరు | 43.2 |
| చిత్తూరు | 47.4 |
| కడప | 45.3 |
| కర్నూల్ | 57.4 |
| అనంతపురం | 64.6 |

ఇటువంటి పరిస్థితిలో గ్రామాలలోని పేదలు అసంతృప్తి చెందడం, ధనికవర్గం పెత్తనాన్ని దోపిడీనీ వ్యతిరేకించడం, చాలా సహజమయిన విషయాలు. ఈ వ్యతిరేకతను దేశ వ్యాపితంగా గ్రామీణ పెత్తదార్లు అణచివేతతో ఎదుర్కొంటున్నారు. కారంచేడు ఈ దౌర్జన్యాలకు ప్రముఖమయిన ఉదాహరణ అయితే, అటు తరువాత గూడ క్రమంతప్పకుండ ఈ దాడులు సాగుతూనే వున్నాయి. పత్రికలు వీటిని 'హరిజనులపై అత్యాచారాలు' అంటాయిగాని, బాధితులు హరిజనులే కానక్కరలేదు, పేదలెవ్వరయినా కావచ్చు. ఈ సంవత్సరం ఇప్పటిదాకా సాగిన సంఘటనలు కొన్ని చూడండి:

| తేదీ | గ్రామం | సంఘటన |
|---|---|---|
| 17 జనవరి | ఔదతాపూర్ నారాయణఖేడ్ తాలూకా మెదక్ జిల్లా | అగ్రవర్ణాల వాళ్ళు మాదిగ కులస్తుల ఇళ్ళ మీదికి దాడి చేసి 21 ఇళ్ళు తగలబెట్టారు. గతంలో హరిజనులను కొట్టినందుకు వాళ్లు పోలీస్ కంప్లెయింట్ యిచ్చారని ఆగ్రహించి ఈ దాడి. |

| తేదీ | గ్రామం | సంఘటన |
|---|---|---|
| 23 జనవరి | చిన్నాయిచింత నాంపల్లి తాలూకా నల్గొండ జిల్లా | 18 సంవత్సరాల క్రితం భూస్వాములు స్వాధీనం చేసుకున్న భూమిని తిరిగి అడిగి నందుకు 9 మందిని చెట్లకు కట్టేసి చిత్రహింసలకు గురి చేసారు. |
| 7 ఫిబ్రవరి | సర్ధన్న గ్రామం మెదక్ జిల్లా | మాన్‌సింగ్ అనే లంబాడా గడియారం దొంగిలించాడున్న ఆరోపణ మీద గ్రామ పెత్తందార్లు అతన్ని కొట్టి, చంపి, శవాన్ని తగల బెట్టారు. |
| 23 మార్చి | ఉరవకొండ అనంతపురం జిల్లా | గ్రామం రెండు పెత్తందారీ వర్గాల మధ్య తగాదాలో ఒక పక్షం వైపు సాక్ష్యం చెప్పమని హరిజనులను కొట్టి, కరెంట్ షాక్ యిచ్చారు. ఒక స్త్రీపైన అత్యాచారం చేసారు. |
| 14 ఏప్రిల్ | పెదనల్కాలపాడు ప్రకాశం జిల్లా | తెలుగుదేశం పార్టీ స్థానిక నాయకులు పోలీసులు కలిసి హరిజనుల యిళ్ళు 11 నేల మట్టం చేసారు. |
| 1 జూన్ | కొత్తకోట విశాఖపట్నంజిల్లా | హరిజన యువతి పట్ల అగ్ర వర్గాల యువకుల అసభ్య ప్రవర్తనతో మొదలయి, పెళ్ళి పందిరిమీద దా డి కి దా రి తీ సిం ది. |

ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే ఇటువంటి దౌర్జన్యాలు ఇంకా ఎన్ని జరిగాయో తెలీదు. గ్రామీణ పేదలు అసంఘటితంగానూ బలహీనంగానూ వున్న చోట ఇవి జరుగుతున్నాయి. వాళ్లు సంఘటితం అయితే 'తీవ్రవాదులు' అని ముద్రవేసి పోలీసు యంత్రాంగాన్ని ప్రయోగించి పైన వివరించిన పద్ధతిలో అణచివేస్తున్నారు. మధ్య తరగతి ఉద్యోగులు, మేధావులు, ఈ అక్రమాలను నిశ్శబ్దంగా ఉపేక్షించడం ద్వారా వాటికి దోహదం చేస్తున్నారు. చివరికి ఇప్పుడా భస్మాసుర హస్తం తమ మీదికి గూడ పాకుతోందని గుర్తిస్తున్నారు. ఉపాధ్యాయులు ఎన్జీవోలు, సమ్మెలు చేసినప్పుడు ప్రభుత్వం ప్రదర్శించిన అణచివేత

వైఖరి గ్రామప్రాంతాలలో సాగుతూన్న నిర్బంధ కాండకు కొనసాగింపే తప్ప వేరే కాదు. ముఖ్యంగా ఈ మధ్యకాలంలో పత్రికా విలేఖరుల మీద దాడులు చాలా అయ్యాయి. 1985 అక్టోబరు 21 న విజయవాడలో పింగళి దశరథరాంను హత్యచేసిన నాటి నుండి మొన్న ఆగస్ట్ మొదటి వారంలో విజయవాడలోనే యిద్దరు పత్రికా ఉద్యోగులను అరెస్టుచేసి కొట్టిన ఉదంతందాకా ఇటువంటివి తరచుగా జరుగుతున్నాయి. త్వరలోనే గ్రామీణ పేదలకూ పట్టణాల మధ్య తరగతికి ఎటువంటి తేడా చూడకుండ పోలీసు యంత్రాంగం అందరినీ ఒకే రకంగా సత్కరించే రోజు వస్తుందేమో.

అందుకే ప్రజలు, ప్రజాస్వామిక వాదులందరూ సమైక్యం కావలసి నవసరం ఎంతైనా ఉంది.

# అనుబంధం-1

1985 జనవరి నుండి ఇప్పటి దాకా జరిగిన కస్టడీ మరణాల పట్టిక

| నెం. | చనిపోయిన తేదీ<br>పోలీస్ స్టేషన్ | పేరు | నేరారోపణ |
| --- | --- | --- | --- |
| 1. | 21-1-86<br>మిల్స్‌కాలనీ (వరంగల్) | సారంగపాణి | నేరారోపణ లేదు. 'రాడికల్' అని కొట్టిచంపారు. |
| 2. | 7-4-85<br>కామారెడ్డి (నిజామాబాద్) | లంబాడి కిషన్ | నేరారోపణ లేదు. నక్సలైట్లకు ఆశ్రయం ఇస్తున్నాడని కొట్టి చంపారు. |
| 3. | 16-4-85<br>నక్రేకల్ (నల్గొండ) | పర్వత్ హోత్ | నేరారోపణ లేదు. పూసలుగాజులు అమ్ముకునే గుంపును ఆవారాగా తిరుగుతున్నారని కస్టడీలోకి తీసుకున్నారు. వాళ్ళలో ఇతనొకడు. |
| 4. | 16-4-86<br>ఎల్దుర్తి (మెదక్) | పాము హనుమంతు | దొమ్మికేసు |
| 5. | 27-4-85<br>చీరాల (ప్రకాశం) | అంగడి ప్రభాకరరావు | దొంగతనాల గురించి సమాచారం రాబట్టడం కోసం అరెస్టు చేసారు. |
| 6. | 30-4-85<br>సంతోష్‌నగర్ (హైదరాబాద్) | డి. నర్సింగరావు | తాగి కొట్లాట పెట్టుకున్నాడు. |
| 7. | 1-5-85<br>మొయినాబాద్ (రంగారెడ్డి) | జ్ఞానేశ్వర్ | హత్య |

| నెం | చనిపోయిన తేదీ పోలీస్ స్టేషన్ | పేరు | నేరారోపణ |
|---|---|---|---|
| 8. | 5 5-85 హార్బర్ పోలీస్‌స్టేషన్ (విశాఖపట్నం) | మహమ్మద్‌రజాక్ | దొంగతనం |
| 9. | 15-5-85 కామారెడ్డి (నిజామాబాద్) | ఇందుర్తి అమరేందర్ రెడ్డి | నేరారోపణలేదు. 'రాడికల్'అని కొట్టిచంపారు |
| 10. | 16-5-85 ఖమ్మం | — | — |
| 11. | 24-5-85 యెల్లనూర్(అనంతపురం) | కమాల్‌పీరన్ | దొమ్మీ కేసు |
| 12. | 8-6-85 విజయనగరం తాలూకా పోలీస్ స్టేషన్ | డా॥ రాంమోహన్ గుప్త | అపహరణ |
| 13. | 30-7-85 విడవలూరు(నెల్లూరు) | వడ్లమూడి వీర రాఘవయ్య | హరిజనుల బట్టలు ఉతకడానికి నిరాకరించాడు. |
| 14. | 26-9-85 యేలేశ్వరం(తూ.గో) | కడుగుల శంకరయ్య | ఒక అరటిపండ్ల గెల దొంగిలించాడని కేసు. |
| 15. | 17-8-85 కుషాయిగుడ (రంగారెడ్డి) | 10 నెలల పసిపాప | దొమ్మీ కేసు నిందితులను అరెస్టు చేయడం కోసం ఇంటిమీద దాడిచేసి ఈ పాపను బూట్ల కింద తొక్కి చంపారు. |
| 16. | 14-9-85 గుడివాడ (కృష్ణా) | పావులూరి రాజా చౌదరి | తాగి ఒకస్త్రీతో అమర్యాదగా ప్రవర్తించాడు. |
| 17. | 6-2-1986 విజయవాడ 2 టవున్ | గొడ్డళ్ల రామారావు | మానభంగం ప్రయత్నం. |

| | | | |
|---|---|---|---|
| 18. | 22-3-1986 గోపాల పట్నం(విశాఖ) | యిడితబోయిన చిన్నారావు | ఆర్. టి. సి. డిపో మేనేజర్ను కత్తితో కొట్టాడు. |
| 19. | 11-4-1986 మచిలీపట్నం (కృష్ణా) | పోసిన మల్లికార్జున రావు | ఇరుగు పొరుగుల తగాదాలో ఒక స్త్రీని కొట్టాడని ఆరోపణ. |
| 20. | 18-4-1986 రాయచోటి (కడప) | ఉప్పు వెంకటరమణ | నాటు బాంబుల తయారీ. |
| 21. | 14-4-1986 గురజాల (గుంటూరు) | ఉప్పలోళ్ళ వేంకటేశ్వర్లు | నేరారోపణలేదు. భూస్వాములకు మద్దతుగా గోలి అనే గ్రామం మీద పోలీసులు దాడిచేసి పేద వాళ్లను అరెస్టు చేసి కొట్టిన క్రమంలో ఇతను చనిపోయాడు. |
| 22. | 18-6-1986 రాజమండ్రి వన్‌టవున్ | పచ్చాకుల కృష్ణ | నేరారోపణ లేదు. 'పాతకేడీ' అని అనుమానం మీద అరెస్టు చేసారు. |
| 23. | 10-7-1986 సంజీవరెడ్డినగర్ (హైదరాబాద్) | నరసింహ | దొంగతనం |
| 24. | 20-7-1986 సూళ్లూరుపేట (నెల్లూరు) | పరిశుద్ధరాం | దొంగతనం |
| 25. | 17-8-1986 పెనగంచిప్రోలు (కృష్ణా) | దళిత అంజనేయులు | హత్య |
| 26. | 23-8-1986 బెల్లంపల్లి (ఆదిలాబాద్) | ఎం. శ్రీనివాస్ | హత్య |

| | | | |
|---|---|---|---|
| 27. | 6-9-1986<br>తుంగతుర్తి (నల్గొండ) | మాచెర్ల అంజయ్య | ఇతరులభూమిలో నిధి తవ్వుకున్నాడని అనుమానం. |
| 28. | 9-9-1986<br>బాన్సువాడ (నిజామాబాద్) | ఎర్రసాయిలు | నేరారోపణలేదు. ఇతని వదిన యొక్క అనుమానాస్పదమైన మరణాన్నిగురించి ప్రశ్నించడానికి తీసుకుపోయారు. |
| 29. | 15-9-1986<br>మాచర్ల (గుంటూరు) | దాసరి వెంకటేశ్వర్లు | దొంగతనం |
| 30. | 17-9-1986<br>విజయవాడ (౬ టవున్) | మురళీధరన్ | నేరారోపణలేదు |
| 31. | 23-9-1986<br>ఖమ్మం (1 టవున్) | డేవిడ్‌రాజు | జైలునుండి పరారీ |
| 32. | 7-10-1986<br>సనత్‌నగర్ (హైదరాబాద్) | మహమ్మద్ సలీం | దొంగతనం |

కాని వచ్చింది సారా కాంట్రాక్టర్ కాదు, పోలీసులు. భద్రాచలం సి.ఐ. వెంకటరెడ్డి నాయకత్వంలో పోలీసులు లక్ష్మయ్య ఇంటికి వచ్చారు. లక్ష్మయ్య 'ఇల్లు' అని పిలువబడేవి రెండు పాకలు. ఒకటి పెద్ద పాక, ఒకటి చిన్న పాక. పోలీసులు పెద్ద పాక వైపు వెళ్ళారు. చంద్రన్న చిన్న పాకలో. పడుకుని ఉన్నాడు. కొన్ని రోజులుగా అతనికి ఒంట్లో బాగులేదని, అనాల్జిన్ బిళ్ళలు వేసుకుంటుండగా చూసామని పరిసర గ్రామాల ప్రజలు అంటున్నారు. పోలీసులను చూసి అతను లేచి పరుగెత్తాడు. అతని దగ్గర చిన్న చేతిసంచి మాత్రం వుందని, ఆయుధాలులేవని, లక్ష్మయ్య భార్య చిన్నక్క అభిప్రాయం.

పారిపోతున్న చంద్రన్నను పోలీసులు వెనుకనుండి కాల్చారు.తగలలేదు. అయితే ముందు నుండి మరికొందరు పోలీసులు వచ్చి ఎదురుగా కాల్చారు. డాక్టర్ చెప్పిన ప్రకారం చంద్రన్నకు ఛాతీలో ఒకటి, నుదుటి మీద ఒకటి రెండు బుల్లెట్ గాయాలయ్యాయి. అక్కడికక్కడే చనిపోయాడు. పోలీసు ఆఫీసర్లకు గాయాలు తగిలినట్లు ప్రకటన సహితం చెయ్యలేదు. పోలీసులు.

3. తేది: ఏప్రిల్ 10, 1985 గ్రామం: వెంకట్రావుపేట: జిల్లా: కరీంనగర్

ఏప్రిల్ 10-11 రాత్రి కరీంనగర్ జిల్లా, వేములవాడ తాలూకా వెంకట్రావు పేట గ్రామం పొలాలలో పోలీసులకు-నక్సలైట్లకూ మధ్య "ఎదురు కాల్పులు" జరిగి అయిదుగురు నక్సలైట్లు చనిపోయారు. ఈకాల్పులు కొండాపూర్ కాల్పులుగా ప్రఖ్యాతమయ్యాయి.

వెంకట్రావుపేట, కొండాపూర్ పక్క పక్క గ్రామాలు. ఏప్రిల్ 10వ తేదీ నాడు గొట్టి రఘుపతి, పాణి సత్తయ్య, బండ సత్తయ్య అనే ముగ్గురు రైతుకూలీ సంఘ కార్యకర్తలు వెంకట్రావుపేటకు వచ్చారు.రాత్రి వాళ్ళు కొండాపూర్ శివార్లకు దగ్గరగా ఉన్న మెట్ట ప్రదేశములో పడుకొన్నారు.

వాళ్ళతో వెంట్రావుపేట గ్రామస్తులయిన ఇద్దరు రైతాంగ యువకులు కూడ పడుకున్నారు. వీళ్ళు ఉప్పల లక్ష్మిరాజం, తాడు రాజయ్య. ఇద్దరూ కూడ గత మూడు సంవత్సరాలుగా అరబ్ దేశాలకు వెళ్ళే ప్రయత్నంలోబొంబాయిలో ఉన్నారు. లక్ష్మిరాజం 12 వేల రూపాయలు, రాజయ్య 25 వేల రూపాయిలను అప్పు తీసుకొని ఈ ప్రయత్నంలో తిరుగుతున్నారు. వాళ్ళ కుటుంబాల వాళ్ళు కోతల పనికి సహాయం రమ్మని వాళ్ళకు ఉత్తరాలు రాశారు. లక్ష్మిరాజం కుటుంబం ఒకటిన్నర ఎకరం భూమి పాలికి తీసుకొని వ్యవసాయం చేశారు. రాజయ్య తండ్రి కాశయ్యకు రెండున్నర ఎకరాల భూమి వుంది. ఇంటి నుండి వచ్చిన ఉత్తరాల ఫలితంగా రాజయ్య నెలరోజుల ముందు, లక్ష్మిరాజం కేవలం 4 రోజుల ముందు బొంబాయి నుండి గ్రామానికి వచ్చారు. ఆరాత్రి పొలం

# అనుబంధం-II

## 1985 జనవరి నుండి ఇప్పటిదాకా జరిగిన 'ఎన్‌కౌంటర్ల' వివరాలు

1. తేదీ: 21-1-1985 గ్రామం: పోచంపల్లి జిల్లా: కరీంనగర్.

జనవరి 21 నాడు కరీంనగర్ జిల్లా జగిత్యాల తాలూకా పెంబట్ల గ్రామంలో పోలీసులకు ఖైరి గంగారాం అనే నక్సలైట్ కార్యకర్తకూ జరిగిన 'ఎదురు కాల్పుల'లో గంగారాం చనిపోయాడు.

పెంబట్ల జగిత్యాల నుండి 10 కి.మీ. దూరంలో వుంది. పెంబట్ల కింద పోచంపల్లి అనే హ్యామ్లెట్ వుంది. 21 జనవరి ఉదయం గంగారాం మరొక ముగ్గురితో కలిపి పోచంపల్లికి పోయి ఒక ఇంట్లో ఉన్నాడు. 11 గంటలప్పుడు ఎస్.ఐ. జగన్‌మోహనరెడ్డి నాయకత్వాన కొందరు సాయుధ పోలీసులు ఆ గ్రామానికి వచ్చారు. గంగారాంతో ఉన్న ముగ్గురు తప్పించుకున్నారు. పోలీసులు గంగారాంను ఇంటి నుండి బయటకురమ్మని, ఏటువంటి హాని జరగదని అన్నారు. గంగారాం రావడానికి నిరాకరించాడు అప్పుడు ఎస్.ఐ ఇంటి కప్పు మీదికి ఎక్కి పెంకులు తొలగించి లోపలికి గురిపెట్టి కాల్చి చంపాడు. కప్పు మీదికి ఎక్కుతున్నప్పుడు ఎస్.ఐ. కి నుదుటి పక్కన చిన్నగా గాయం అయ్యింది. అంతకు మించి ఈ "ఎదురు కాల్పుల"లో అతనికి వేరే గాయంలేదు. శవాన్ని పోలీసులే రేచపల్లి (గంగారాం స్వగ్రామం)లో దహనం చేశారు.

2. తేదీ: 28-3-1985 గ్రామం: వీరభద్రారం జిల్లా: ఖమ్మం.

మార్చి 28 నాడు ఖమ్మం జిల్లా భద్రాచలం తాలూకా వీరభద్రారం గ్రామంలో పోలీసులకూ అర్సపల్లి వెంకటేశ్వరరావు(చంద్రన్న) అనే నక్సలైట్ కార్యకర్తకూ జరిగిన ఎదురు కాల్పులలో చంద్రన్న మరణించాడు.

వీరభద్రారం భద్రాచలం పట్టణానికి 20 కి మీ. దూరంలో ఉన్న కోయ గిరిజనుల గ్రామం. గ్రామంలో చెల్లా చెదురుగా 40 గుడిసెలు ఉంటాయి.

సారాధర తగ్గింపు కోసం చేసిన పోరాటంలో భాగంగా చంద్రన్న ఆ ప్రాంతపు సారా కాంట్రాక్టర్ అయిన పాండెని కలవడానికి వీరభద్రారం వెళ్ళాడు. మార్చి 27 న వెళ్ళి తరువాతి రోజు యట్ల లక్షయ్య అనే గిరిజనుడి ఇంట్లో కలవడానికి ఏర్పాటు చేసుకొన్నాడు. 28 మధ్యాహ్నం 12 గంటలప్పుడు వీరభద్రారం వచ్చి పాండెను పిలిపించమని లక్ష్మయ్యను పంపాడు. లక్ష్మయ్య పాండె దగ్గర ఉద్యోగి. ఇంటికి వెళ్ళి వచ్చి "పాండె వస్తున్నాడు, కాచుకోవలసింది." అని కబురు తెచ్చాడు.

కాపలాకు పోయి రైతుకూలీ సంఘ కార్యకర్తలతో మాట్లాడి వాళ్ళతో పాటే పడుకొన్నారు.

ఈ అయిదుగురితో బాటు ఒక ఆరవ వ్యక్తి గూడ ఉన్నాడు. అతను కాల్పుల నుండి తప్పించుకొని గాయాలలో పత్రికా విలేఖరులకు కలిసి అసలు జరిగిన సంగతి ఈ విధంగా చెప్పాడు. రాత్రి అందరూ నిద్రపోతూండగా, వేములవాడ ఎస్.ఐ. ఫ్రాన్సిస్, కోనరావుపేట ఎస్. ఐ. వీరస్వామిల నాయకత్వంలో 15 మంది బలగం అక్కడికి వచ్చింది. పడుకున్న వాళ్ళను తుపాకులతో ఛాతీ మీద పొడిచి నిద్రలేపారు. అందరినీ వరుసగా నిలబెట్టి చేతులు వీపు వెనక తువ్వాళ్ళతో కట్టారు. తరువాత అందరినీ కొండాపూర్ వైపు ముఖం పెట్టి కూర్చోమన్నారు. ఎస్.ఐ.లు ఇద్దరూ తమలో తాము కొంతసేపు గుసగుస లాడుకొని, ఆ తర్వాత స్టెన్‌గన్‌లతో అందరినీ వరుసబెట్టి కాల్చారు. లక్ష్మీరాజం లేచి పారిపోగా అతన్ని వెంటబడి చంపారు. ఒక్క వ్యక్తి మాత్రం తొడలో, కాళ్ళలో బుల్లెట్ గాయాలతో తప్పించుకొని ఈ కథ పత్రికలకు చెప్పాడు.

ఇద్దరు పోలీసు ఆఫీసర్లకు గాయాలు తగిలాయని పోలీసులు ప్రకటించారు. కానీ వాళ్ళకు అస్పష్టమయిన చిన్న గాయాలు మాత్రమే ఉన్నాయని సిరిసిల్ల ప్రభుత్వ డాక్టర్ అన్నారు.

4. తేదీ: 1-5-1985 గ్రామం: బస్వాపూర్ జిల్లా: నిజామాబాద్.

ఈ గ్రామం నిజామాబాద్ జిల్లా దోమకొండ తాలూకాలో, కామారెడ్డి పట్టణానికి ఒక కి.మీ దూరంలో ఉన్నది. మే 1 వ తేదీ మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఇక్కడ జరిగిన 'ఎన్‌కౌంటర్' లో ఇద్దరు 'తీవ్రవాదులు' మరణించారు. సంఘటన జరిగిన రోజు నలుగురు కార్యకర్తలు రైల్వేలైన్ పక్కనున్న మామిడి చెట్టు కింద విశ్రాంతి తీసుకొంటున్నారు. మరో కార్యకర్త రెడ్డి మల్లిబాబు మంచి నీళ్ళు తేవడానికి బావి దగ్గరకు వెళ్ళాడు. రైతుల వేషంలో సాయుధంగా ఉన్న యాంటీ నక్సలైట్ దళం పోలీసులు అతన్ని అనుసరించారు. వారిని చూసిన అక్కడేవున్న గొర్రెల కాపరి గట్టిగా అరిచి హెచ్చరించడంతో చెట్టు కిందవున్న నలుగురు పరుగెత్తడం ప్రారంభించారు. పరుగెత్తబోయిన బాబుపై పోలీసులు కాల్పులు జరిపి గాయపర్చారు. అప్పుడు బాబు- మామిడిచెట్టు వరకు పరుగెత్తి పడిపోయాడు. పోలీసులు పారిపోబోతున్న కార్యకర్తలను వెంబడించారు. వెంబడిస్తూ కాల్పులు జరిపారు. రాజనర్సు అనే కార్యకర్తకు బుల్లెట్ గాయం తగిలింది. అతను పడిపోయాడు. అప్పుడు

మిగిలిన కార్యకర్తలు వెనక్కి తిరిగి తమ ప్రాణ రక్షణ కోసం పోలీసుల మీద కాల్పులు జరిపారు. సక్రుసింగ్ అనే కానిస్టేబిల్‌కు గాయం తగిలింది.

రాజనర్సు వెంటనే చనిపోయిందీ, లేనిదీ తెలియదు కానీ రెడ్డి మల్లిబాబు మాత్రం బతికే వున్నాడు. పోలీసులు అతని చేతులు వెనక్కి కట్టి; పక్కనే పొలంలో పనిచేసుకుంటూ ఇదంతా చూస్తున్న ఇద్దరు రైతులను (మద్దిసిద్ద రాములు, పుండరీకం) పిలిచి బాబుకు నీళ్ళు ఇప్పించారు. తరువాత అతన్ని "ఇంటరాగేట్" చేశారు. ఇంటరాగేషన్ అయిపోయిన తర్వాత అతన్ని కాల్చి చంపారో, లేక ముందే ఆయనగాయానికి రక్తం కోల్పోయిచనిపోయాడోతెలియదు రాజనర్సు విషయం గూడ అంతే. చనిపోయిన తర్వాత మాత్రం ఇద్దరి శవాలను అక్కడి కక్కడే పోస్టు మార్టం జరిపించి పోలీసులే దహనం చేశారు. దీనికి సాక్ష్యంగా సగం కాలిన ఎముకలు రెండు వారాలదాకా అక్కడ దర్శన మిచ్చాయి.

5. 6-5-1985. గ్రామం: బొమ్మిరెడ్డిపల్లి జిల్లా: కరీమ్‌నగర్

బొమ్మిరెడ్డి పల్లి కరీమ్‌నగర్ పట్టణానికి 36 కి.మీ. దూరంలో ఉంది. మే, 6వ తేదీ సాయంత్రం గ్రామంలోని రాజలింగు ఇంటికి సిద్ధయ్య అనే కార్యకర్త వచ్చాడు. రాజలింగుకు చెందిన మోటార్ ఇంజన్ బెల్టు పక్కనున్న పత్తిపాక నర్సింగాపురం గ్రామంలోని ఒక వ్యక్తి దొంగలిస్తే, రాజలింగు ఫిర్యాదు మేరకు దానిని సంపాదించి, అతనికి ఇవ్వడం కోసం సిద్ధయ్య వచ్చాడు. పోయిన బెల్టును వసూలు చేసినందుకు కృతజ్ఞతగా సిద్ధయ్యను ఆ రాత్రి తన ఇంటిలోనే భోజనం చేసి వెళ్ళమన్నాడు. అన్నాం తిన్న తర్వాత సిద్ధయ్య పడుకోవడానికి మరోచోటుకి వెళ్ళిపోయాడు. రాజలింగు భార్య చంద్రమ్మ కథనం ప్రకారం, ఆనాటి అర్ధరాత్రి కొందరు పోలీసులు వచ్చి, బయటపడుకున్న ఆమె భర్తను తీసుకెళ్ళారు. సిద్ధయ్య కనబడే వరకు తన భర్తను నిర్బంధిస్తారేమో అనుకున్నదామె కానీ తెల్లారి వచ్చిన పోలీసులు ఆమె భర్త మరణించాడని చెప్పారు. పోలీసులు తన భర్తను, సిద్ధయ్యను చెట్టుకి కట్టి చంపారని ఆమె చెప్పింది. ఇంటి వెనుక వున్న చింతచెట్టును చూపించి ఆచెటుకు కట్టి కాల్చారని అన్నది. రాజలింగు 50 సంవత్సరాల వయసున్న, మూడెకరాల భూమి వున్న రైతు. అతను తీవ్రవాది కాదు. వారి సానుభూతి పరుడూ కాదు. కేవలం కృతజ్ఞతతో కార్యకర్తకు భోజనం పెట్టడమే అతను చేసిన మహాప రాధం. పోలీసులు రాజలింగు శవాన్ని ఇచ్చేసి, సిద్ధయ్య శవాన్ని మాత్రం వారే దహనం చేశారు. అలా చేసే ముందు పోస్ట్ మార్టం అక్కడి కక్కడే నిర్వహించారు.

6 తేదీ: 13-5-1985 గ్రామం: లోద్వెల్లి జిల్లా: ఆదిలాబాద్.

ఆదిలాబాద్ జిల్లాలో ఉన్న లోద్వెల్లి గ్రామం కాగజ్‌నగర్‌కు 15 కి.మీ దూరంలోఉంది. మే 13వ తేదీ రాత్రి 7–30 గంటలకు 6గురు కార్యకర్తలు ఆ గ్రామ శివార్లలో ఉన్న ఒక గుడిసె దగ్గరకు వచ్చారు. రెండు గంటలయిన తరువాత మరో ముగ్గురు కార్యకర్తలు వచ్చారు. వీరిలో పులి మదునయ్య, అంకోలి రమేష్ అనే ఇద్దరు కార్యకర్తలు గుడిసె లోపలికి వెళ్ళారు. బైట నున్న మిగిలిన కార్యకర్తలు, గ్రామ ప్రజలు కొందరితో మాట్లాడుతున్నారు. గుడిసెలోని రెండవ గదిలో మరోవ్యక్తి కూర్చున్నాడు. ఈలోగా పోలీసులు అలవాటు ప్రకారం సాదా దుస్తుల్లో మారణాయుధాలు ధరించి వచ్చారు. వాళ్ళు టార్చిలైట్ వేస్తూ రావడంతో లైట్ ఆర్పమని కార్యకర్త ఒకరు అన్నారు. వెంటనే "కదిత్తే కాల్చేస్తా" మని సమాధానం వచ్చింది. కార్యకర్తలు వెంటనే పరుగెత్తడం ప్రారంభించారు. పోలీసులు మొదట గుడిసెలోకి కాల్పులు జరిపారు మదునయ్యను, రమేష్‌ను తీవ్రంగా గాయ పర్చారు. తర్వాత పారిపోతున్న వారిని వెంబడించే ప్రయత్నం చేసి విఫలం చెంది మళ్ళీ వెనక్కు వచ్చారు. వెనక్కి వచ్చి, మళ్ళీ గుడిసెలోకి కాల్పులు జరిపి మదునయ్యను, రమేష్‌ను చంపేశారు. అంతలో గుడిసెలోని రెండవ గదిలో ఉన్న వ్యక్తి, బైటకి పరుగెత్తుకు వచ్చి పోలీసుల పక్కనుండి పారిపోయాడు. పోలీసులు పారిపోతున్న అతని మీద కాల్పులు జరిపారు. అతనికి తగిలిందీ లేనిదీ వాళ్ళకు తెలియలేదు. అందుకే ముందు ఈ ఎన్‌కౌంటర్లో ముగ్గురు చనిపోయారని ప్రకటించి, తరువాత ఇద్దేరేనని సర్దుకున్నారు.

7. తేదీ: 25-5-1985. గ్రామం: చిననక్కలపేట. జిల్లా: కరీంనగర్.

ఈ గ్రామం గోదావరి నదికి సమీపంగా జగిత్యాల తాలూకా ధర్మపురి పోలీస్ స్టేషన్ పరిధిలో వుంది. మే 25వ రాత్రి డి.నారాయణ, లక్ష్మీనారాయణ అనే ఇద్దరు ఈ గ్రామంలో ఒక ఇంట్లో పడుకున్నారు. అర్థరాత్రి దాటినతర్వాత పోలీసులు ఆ ఇంటిమీద దాడిచేసి నేరుగా కాల్పులు జరపడం మొదలుపెట్టారు. నారాయణకు గాయాలు తగిలాయి. అయినా ఇద్దరూ ఇంటివెనుక భాగం వైపు పరుగెత్తారు. పోలీసులు వాళ్ళను తరిమి కాల్పులు జరిపారు. నారాయణ పడిపోయి చనిపోయాడు. లక్ష్మీనారాయణ మాత్రం తరుముతూన్న పోలీసులను వదిలించుకుని గోదావరి నది దాటి బైటపడ్డాడు. అతను కొంత కాలం తరువాత 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' విలేఖరిని కలిసి ఈ విషయాలన్నీ చెప్పినప్పుడే ఈ వాస్తవాలు బైటకొచ్చాయి.

8.తేదీ: 26-5-1985 గ్రామం: నర్సాపూర్. జిల్లా: వరంగల్

ఇది వరంగల్ జిల్లా ములుగు తాలూకాలో ఉన్న గ్రామం. వరంగల్‌కు 53కి.మీ. దూరంలో వుంది. గ్రామానికి ఒక కి.మీ. దూరంలో అర్ధవృత్తాకారంలో తుప్పలతో నిండిన గుట్టలు వున్నాయి. దానికెదురుగా ఒక వొర్రె వుంది.

మే 26వ తేదీ ఉదయం చల్వాయి గ్రామానికి చెందిన సారయ్య అనే వ్యక్తి తన న్యాయవాది ప్రభాకర్‌రెడ్డిని కలవటానికి వరంగల్ వచ్చాడు. అతనేమీ రహస్య కార్యకర్తకాడు. కేసుల్లో క్రమం తప్పకుండా హాజరవుతూ, అదే పని మీద ప్రభాకర్‌రెడ్డి గురించి వచ్చాడు. అయితే తాను హైదరాబాదు వెళ్తున్నాననీ ఇంట్లో ఉండమని రెడ్డి తాళం చెవులిచ్చి వెళ్ళిపోయారు. రాత్రి పదిగంటల వరకూ సారయ్య ఒక్కడే ఆ ఇంట్లో ఉన్నాడు. పదిగంటలకల్లా భూపతిరెడ్డి వచ్చాడు. వారిద్దరు కల్సివంట చేసుకున్నారు. తినడానికి ఉద్యుక్తులవుతుండగా పదిన్నరకల్లా తలుపుతట్టి, ఇల్లంతా సోదాచేసి పోలీసులు వారిని వ్యాన్‌లో ఎక్కించి నర్సాపూర్ తీసుకుపోయారు. ఆ గ్రామంలోని గుట్టల సమీపం లోనే వారిద్దర్నీ కాల్చి చంపారు. భూపతిరెడ్డి 26 రాత్రి వరంగల్‌కు వచ్చి, బస్ స్టాండ్‌లో తన సోదరుడు రఘుపతిరెడ్డిని కల్సి, ఎడ్వకేట్ వద్దకు వెళ్తున్నానని చెప్పినట్లు సాక్ష్యాలు ఉన్నాయి. అంతేకాక చుట్టు పక్కల వారు పోలీసులు న్యాయవాది ఇంటిని సోదా చెయ్యటం, వారిని తీసుకెళ్ళడం చూశారు. మే 28న వారిరువురి శవాలకు అక్కడే పోస్టుమార్టం జరిపి చితిమీద ఎక్కించి చివరి నిముషంలో బంధువులకు శవాల ముఖాలనుమాత్రం చూపించి పోలీసులే దహనం చేశారు. నర్సాపూర్ గ్రామంలో 'ఎదురు కాల్పులు' జరిగాయని ముగ్గురు 'తీవ్ర వాదులు' పారిపోగా ఈ ఇద్దరు చనిపోయారనీ ఒక కట్టుకథ అల్లి ప్రచారం చేశారు. నిజానికి పోలీసులకు సారయ్యను చంపవలసిన 'అవసరం' ఎంతమాత్రం లేదు. వాళ్ళకు చాలా కాలంగా భూపతిరెడ్డి మీదే కన్ను. చిట్యాల తాలూకా మోరంచపల్లికి చెందిన అతని తండ్రిని, తమ్ముళ్ళను వాళ్ళు చాలా కాలంగా భూపతిరెడ్డిని పట్టిమ్మని వేధిస్తున్నారు. కేవలం భూపతిరెడ్డి అరెస్టుకు సాక్షి అని సారయ్యను చంపారు.

9. తేదీ: 28-5-85 గ్రామం: జగిత్యాల జిల్లా: కరీంనగర్.

మే 28 నాడు జగిత్యాల పట్టణం శివార్లలో ఒక విచిత్రమైన 'ఎన్‌కౌంటర్' జరిగింది. ఊరిచివర ఒక ఇంట్లో, ఒక అజ్ఞాత తీవ్రవాది ఉన్నట్లుగా తమకు

తెలిసిందని, అతన్ని పట్టుకోవడానికి పోతే, అతను తప్పించుకొని, మోటారు సైకులుఎక్కి పారిపోయాడనీ, పోతూ పోతూ మోటారుసైకిల్ మీదినుండి వెనక్కి తిరిగి పోలీసులపైకి (అర్జునుడిలాగా) కాల్పులు జరిపాడనీ, తాము ఆత్మరక్షణార్థం కాల్పులు జరపగా, అతను చనిపోయాడని పోలీసులు పత్రికా ప్రకటన ఇచ్చారు. అతని పేరు పవన్‌కుమార్ అనికూడ ప్రకటించారు. రెండు రోజుల తరువాత అతని పేరుగురించి అనుమానం వచ్చినట్లుంది. "గుర్తుతెలియని నక్సలైట్" అన్నారు, చివరికి "గుర్తుతెలియని నక్సలైట్" గానే ఈ 'ఎన్‌కౌంటర్' మీద మెజిస్టీరియల్ విచారణ జరిగింది.

అసలు విషయం క్రమంగా బైటపడింది. హతుడిపేరు గోవిందరెడ్డి అతను కర్నాటక రాష్ట్రం చిత్రదుర్గ జిల్లా వాస్తవ్యుడు. కొంతకాలం ఎయిర్ ఫోర్సులో పనిచేసి రాజీనామా ఇచ్చేసి, ఆ తరువాత నిజామాబాద్‌లో ఒక హోటల్ మేనేజర్‌గా పనిచేసి, రాజీనామాచేసి విప్లవకారుల్లో చేరాడు. మే 28 ఉదయం అతను జగిత్యాల పట్టణం వెలుపల ఒక ఇంట్లో ఉంటూ సిగరెట్లు తెమ్మని ఒక కుర్రవాన్ని పంపాడు. ఆ కుర్రవాడు పాతబస్‌స్టాండు దగ్గర సిగరెట్లు కొంటుండగా చూసిన పోలీసులు అతన్ని బెదిరించి సిగరెట్లు ఎవరికోసమో తెల్సుకొని, ఆ ఇంటిదగ్గరకు వచ్చారు. గోవిందరెడ్డి ఎవరో, ఏమిటో తెలుసుకునే ప్రయత్నం కూడ చెయ్యకుండా, ఇంటినుండి బైటకి తీసుకుపోయి ధర్మపురి రోడ్డుమీద కాల్చి చంపారు. చంపిన తర్వాత, అతను ఎవరై ఉంటారో, ఊహించే ప్రయత్నం చేసి, బహుశా పోలికలను బట్టి కాబోలు పవన్‌కుమార్ అనుకున్నారు.

10. తేదీ: 10-6-1985 గ్రామం: ధరూర్ జిల్లా: కరీంనగర్

జగిత్యాల పట్టణాన్ని అనుకొనివున్న ఈ గ్రామం దగ్గర తెల్లవారిజామున జరిగిన 'ఎన్‌కౌంటర్'లో ఒక నక్సలైట్ కార్యకర్త మరణించినట్టు పత్రికలలో వార్త వచ్చింది. అతని పేరు రాములు అని పత్రికలలో రాసారు. అసలు ఏం జరిగిందో తెలీదు.

11. తేదీ: 2-9-1985 గ్రామం: కమ్మరిపేట జిల్లా: కరీంనగర్.

సెప్టెంబర్ 2వ తేదీన కమ్మరిపేటలో జరిగిన ఒక 'ఎన్‌కౌంటర్'లో రామస్వామి అనే రాజకీయ కార్యకర్త చనిపోయినట్టు పోలీసులు ప్రకటించారు. కమ్మరిపేట ఎక్కడో మారుమూలనున్న గ్రామం కాదు. కరీంనగర్ నుండి నిజామాబాద్ వెళ్ళే రహదారి మీదవున్న పెద్ద గ్రామం. ఎక్స్‌ప్రెస్ బస్సులు గూడ ఆగుతాయి. రాత్రింబగళ్ళూ వాహనాల సంచారం ఉంటుంది. ఈ గ్రామంలో 'ఎదురు కాల్పులు' జరిగే అవకాశం చాలా స్వల్పం. నిజానికి జరిగిం

దేమిటంటే రామస్వామి ఒక ఇంట్లో ఉండగా పోలీసులు బలవంతంగా లోపలికి ప్రవేశించి కాల్పులు జరిపి రామస్వామిని గాయపరిచారు. అతను పారిపోయే ప్రయత్నం చేసాడుగాని, తగిలిన గాయం వల్ల పరుగెత్తలేక పడిపోయి చని పోయాడు.

12. తేదీ: 4-9-1985 గ్రామం: బూరుగుపాకల జిల్లా: విశాఖపట్నం

సెప్టెంబర్ 4వ తేదీన మరో 'ఎన్‌కౌంటర్' జరిగింది. విశాఖపట్నం ఏజన్సీ ఏరియా, చింతపల్లి పోలీసు స్టేషన్ పరిధిలోని బూరుగుపాకల అనే మారుమూల గ్రామంలో జరిగిన ఈ 'ఎన్‌కౌంటర్‌లో' మొత్తం ఐదుగురు పీపుల్స్ వార్ గ్రూపుదళ సభ్యులు మరణించారు. చింతపల్లి 'ఎన్‌కౌంటర్'లో ఒక యువతిని కూడ హత్య చేయడం ద్వారా అక్కడి పోలీసులు కర్కశత్వంలో తాము ఒక మెట్టు పైనే ఉన్నామని ప్రకటించారు.

సెప్టెంబరు 3వ తేదీ రాత్రి నక్సలైట్ దళం బూరుగుపాకల సమీపంలో సంచరిస్తున్నట్లు ఒక ఇన్‌ఫార్మర్ ద్వారా పోలీసులకు తెలిసిందట. ఆ రోజు తెల్లవారుజామున గం. 3.30 లకు వారు ఏ గుడిసెలో తలదాచుకున్నదీ తెలుసుకొని పోలీసులు ఆ గుడిసెను చుట్టు ముట్టారట. "వారు అప్రమత్తంగా లేరు కాబట్టి మేము సునాయాసంగానే వారిని చుట్టు ముట్ట గలిగాం" అని చింతపల్లి ఎస్. ఐ. అప్పారావు గొప్పలు చుట్టుముట్టి పట్టుకోగలిగి కూడ పోలీసులు వారిని ఎదురు కాల్పుల పేరిట హతమార్చారు.

పోలీసుల కథనం ప్రకారమే నక్సలైట్ల వద్ద ఐదు గ్రెనేడ్లు ఉన్నాయి. కాని వారు ఎదురు కాల్పుల సమయంలో వాటిని ఉపయోగించలేదు. అవి అధు నాతన, శక్తివంతమైన గ్రెనేడ్లు అని పోలీసులు అంటున్నారు. ఈ ఆయుధాలే కాకుండా పోలీసులు చెబుతున్న వివరాల ప్రకారం నక్సలైట్ల వద్ద మరి 12 నాటు తుపాకులు, మందు గుండు సామాగ్రి ఉన్నాయి. పోలీసుల కథనం పూర్తిగా నిజం అనుకుందాం! నక్సలైట్ల వద్ద ఆయుధాలు ఉన్నాయి. కాని వారు వాటిని ఉపయోగించలేదు. కాని ఎన్‌కౌంటర్ జరిగింది. అయిదుగురు నక్స లైట్లు మరణించారు. పోలీసులు ఒక్కరు కూడ మరణించలేదు, గాయపడలేదు కూడ!

మరణించిన వారి పేర్లు: లోత్త రాజేశ్వరి (17) అలియాస్ జ్యోతి, ఒక్కొ వెంకటరావు (18), సంతోష్ (18), మిగిలిన ఇద్దరి పేర్లు ఆనంద్, కుమార్.

పోలీసుల కథనం ప్రకారమే నక్సలైట్ల వద్ద గల నాటు తుపాకులతో ఒక్కొక్క తూటా దట్టించి, దాన్ని ప్రేల్చడానికి 15-20 నిమిషాల వ్యవధి పడుతుంది. పైగా మహా అయితే 20 గజాల దూరంలో ఉన్నవారిపై మాత్రమే వీటిని ప్రయోగించవచ్చు. పోలీసుల వద్ద 0.303 రైఫిల్స్ ఉన్నాయి. వీటితో 200 గజాల దూరంలో ఉన్నవారిని కూడ కాల్చవచ్చు. నక్సలైట్లు తలదాచుకున్న గుడిసెకు 50 గజాల దూరంలోని చెట్ల వెనుక పోలీసులు నక్కారట. ఈ ఎన్‌కౌంటర్ స్వభావాన్ని చెప్పటానికి ఇంతకంటే వివరాలు అనవసరం. నక్సలైట్ల తుపాకులకు, పోలీసు తుపాకులకు కనీసపు సామ్యంలేనప్పుడు ఈ రెండు వర్గాలమధ్య ఎదురు కాల్పులు జరిగాయనడం హాస్యాస్పదం.

నిద్రిస్తున్న వారిని పట్టుకొని, వారిని దారుణంగా హింసించి పోలీసులు వారిని కాల్చి చంపారు. ఆకస్మికంగా అక్కడికక్కడే శవపరీక్ష జరిపించడానికి అధికారులు పడిన పాట్లు నియమ నిబంధనలను ఉల్లంఘించడానికి, వాస్తవాల్ని కప్పిపుచ్చుకోవడానికి జరిగిన యత్నాలను చెప్పకనే చెబుతున్నాయి.

'ఎన్‌కౌంటర్' జరిగిన రోజు రాత్రే శవ పరీక్షలు జరపాలని జిల్లా మెడికల్ హెల్త్ ఆఫీసర్ ఆదేశించారు. డిప్యూటీ సివిల్ సర్జన్ డా॥ ఎ. అయ్యప్పపంతులు అందుకు నిరాకరించారు. ఆ మర్నాడు ఆయనతోబాటు డాక్టర్ కృష్ణవేణి, డాక్టర్ ఆర్. సుశీల శవ పరీక్షలు జరిపారు. నక్సలైట్లు కేవలం తుపాకీ తూటాలకు మాత్రమే కాక, ఇతర ఆయుధాల దెబ్బలకు గూడ గురయ్యారు. తర్వాత మరణించారు.

13. తేదీ: 12-9-1985 గ్రామం: పోడలంక జిల్లా: తూ. గో. జిల్లా.

సెప్టెంబర్ 12 వ తేదీన తూర్పుగోదావరి జిల్లా ఏజెన్సీ ప్రాంతంలోని పోడలంకలో జరిగిన 'ఎదురు కాల్పుల' బండారం బైటపెడ్తూ ఆ ఎదురు కాల్పులలో తప్పించుకొని బైటపడిన ఓ గిరిజనుడు 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' (ఆంగ్ల దిన పత్రిక) కు ఓ లేఖ రాశాడు.

ఆ గిరిజనుడు రాసిన లేఖను ప్రచురిస్తున్నాము.

"నేను మిమ్ములను వ్యక్తిగతంగా కలుసుకొని జరిగిన వాస్తవ సంఘటనలను వివరించాలి అనుకుంటున్నాను. కాని పోలీసులు నన్ను క్రూర జంతువును వేటాడినట్లు, వేటాడుచున్నందువలన అలా కలువలేకపోతున్నాను. నేను ఈ విషయము మీరు బాహ్య ప్రపంచమునకు తెలియచేయమని కోరుకుంటున్నాను.

రంపచోడవరం యస్. ఐ. నాయకత్వంలో తొమ్మిది మంది పోలీసులు నా ఇంటిపై మరియు గొర్లె పుల్లయ్య, బడుగూరు బంగారయ్యల ఇళ్లపై సెప్టెం

బరు 5 వేకువజామున 5 గంటలప్పుడు దాడి చేశారు. మా అందరినీ పడకలపై నుంచి లేపారు. బట్టలు, ఒక చేతిగడియారం, పెట్టెలో ఉన్నవి తీసుకున్నారు.

"నక్సలైట్లు మీవద్దకు వస్తున్నారా"? అని అడిగారు. పోలీసులు బడుగు బంగారయ్యను గ్రామంలోనే వదిలివేసి నన్ను, గొర్లె పుల్లయ్యను వాళ్లతో బోడ లంక గ్రామానికి రమ్మన్నారు. అక్కడ యస్.పి. దినేష్‌రెడ్డి, నర్ల మాణిక్యంతో (ఇతని చేయి నక్సలైట్లు నరికి వేశారు) మాట్లాడాలని అన్నారు. మా భార్యలు మమ్ములను వదిలివేయమని ప్రాధేయ పడుతున్నా వినిపించుకోకుండా బలవం తంగా మమ్ములను వెంకనగడ్డ గ్రామానికి తీసుకెళ్ళారు.

ఇల్లువదలి వెళ్ళేటప్పుడు చేతిసంచి, దుప్పటి, షర్టు, గొడుగు తీసుకొని బయల్దేరనిచ్చారు. మమ్ములను ఒక ఒరియా అతని ఇంట్లో ఉంచి పోలీసులు కాపలా వున్నారు. సెప్టెంబరు 12వ తారీఖు ఉదయం 2 గంటలకు మమ్ములను తీసుకొని పోలీసులు బయల్దేరారు. బయల్దేరేముందు మాకు బాణము, అమ్ములను ఇచ్చారు. ఇవి అక్కడి గ్రామ గిరిజనుల నుంచి సేకరించి తెచ్చారు.

అడవిలో మమ్ములను బోడులంకకు 2 కి.మీ. ప్రాంతం వరకు తీసి కెళ్లారు. మాకు నక్సలైట్లతో సంబంధాలున్నాయాఅనిఅడిగారు. మమ్మల్ని అక్కడి కక్కడే కాల్చేస్తే ఏం చెయ్యగలరని అన్నారు, మమ్మల్ని దూషించారు.

అంతలో పేరికవాస గ్రామం నుంచి వస్తున్న ఓ రైతును ఆపి ఇక్కడ కాలిస్తే మీ గ్రామానికి శబ్దం వినిపిస్తుందా అని అడిగారు. అతను రైఫిల్ మోత వినబడుతోందన్నాడు.

కొద్ది సేపట్లో చనిపోబోతున్న పుల్లయ్య, నేను మమ్మల్ని ఎందుకు కాల్చి చంపాలని అనుకుంటున్నారని పోలీసులను అడిగాము. యస్. పి. తో మాట్లాడేం దుకై పిలుచుకుని వచ్చి, కాల్చి చంపడం సరి అయినది కాదని, మమ్ముల్ని వదిలివేయమని పోలీసులను బతిమిలాడాము. మేము పోషించవలసిన కుటుంబాలు ఉన్నాయని పోలీసులకు చెప్పాము.

మమ్ముల్ని చంపేందుకై నర్ల మాణిక్యం రూ. 10,000 ఇచ్చాడని, మమ్ముల్ని చంపితే తనకు ప్రమోషన్ కూడ వస్తుందని యస్. ఐ. అన్నాడు. ఆ తరువాత మా సంచీలను లాక్కొని అందులో ఉండే వస్తువులను దారిలో పడే శారు. మేము పారిపోతుంటే కాల్చినట్లుగా కనబడేందుకై ఇదంతా చేయడము అని, అయినా చనిపోతున్న వాళ్ళకు దుప్పటితో, గొడుగుతో ఏమి పని అని

ఎస్. ఐ. అన్నాడు. ఎస్.ఐ. కానిస్టేబుల్ పుల్లయ్యను ఓ చెట్టుకు ఆన్చి నిల బెట్టాడు. మరో కానిస్టేబుల్ తన తుపాకీని నా ఛాతీపై గురి పెట్టాడు.

ఆ పోలీసు పార్టీలోని మిగతావారు మాపై తమ తుపాకులను గురిబెట్టి సిద్ధంగా నిలబడ్డారు. ఇక కాల్చేందుకు సిద్ధమవుతూ నక్సలైట్లు ఎక్కడవున్నారో చెప్పమన్నారు. ఇక చనిపోతున్నానని అనుకొని నేను ఏడుస్తూ నా శక్తినంతటినీ కూడకట్టుకొని నాప్రక్కనున్న పోలీసుని తోసేసి పరుగెత్తాను. వెంటనే కాల్పులు మొదలెట్టారు. నేను పడిపోయాను, అప్పటికి 10 రౌండ్లు కాల్పులు చేశారు. ఓ కానిస్టేబులు నావద్దకు వచ్చి నన్ను నిలబెట్టేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో కాల్పులు ఆపమని యస్. ఐ. ఆజ్ఞాపించాడు. వెనువెంటనే నేను ప్రక్కనున్న పొదలోకి పరుగెత్తాను. యస్. ఐ. పుల్లయ్యను పట్టుకొని 4 రౌండ్లు కాల్చాడు. పుల్లయ్య అక్కడికక్కడే చనిపోయాడు. అతని దేహం ఆ ప్రక్కనే పూడ్చారు.

14. తేదీ : 5-10-1985 గ్రామం : కొండాపూర్ జిల్లా : కరీంనగర్

ఈ గ్రామంలో జరిగిన 'ఎన్‌కౌంటర్' లో మాధవరెడ్డి, లక్ష్మణ్, గంగా రాం అనే ముగ్గురు రాజకీయ కార్యకర్తలు చనిపోయారు. పోలీసు లెవ్వరికీ గాయాలు లేవు. ఇంతకంటె వివరాలు తెలియవు.

15. తేదీ : 6-10-1985 గ్రామం : దూమాల జిల్లా : కరీంనగర్

ఈ గ్రామంలో జరిగిన 'ఎన్‌కౌంటర్' లో స్వామి అనే కార్యకర్త చని పోయాడు. వివరాలు తెలీవు.

16. తేదీ : 7-12-1985 గ్రామం : మల్కాపురం జిల్లా : కరీంనగర్

మల్కాపురం దగ్గర జరిగిన 'ఎన్‌కౌంటర్'లో సాయని ప్రభాకర్, రమాకాంతరావు, నర్సయ్య అనే ముగ్గురు రాజకీయ కార్యకర్తలు చనిపోయినట్టు పోలీసులు ప్రకటించారు. ఈ 'ఎన్‌కౌంటర్' లో కొందరు కార్యకర్తలు తప్పించు కొని పారిపోయారు. వారి ద్వారా స్థానిక పత్రికా విలేకరులకు తెలిసిన కథనం ఈ విధంగా వుంది.

మల్కాపురంకు 3 కిలోమీటర్ల దూరంలో కొంత మంది కార్యకర్తలు సమావేశమయి మాట్లాడుకుంటూండగా పోలీసులు వచ్చి చుట్టుముట్టి కాల్పులు జరిపారు. నర్సయ్య చనిపోగా తక్కినవాళ్ళు పారిపోయారు. అంతలో అక్కడికి ప్రభాకర్, రమాకాంతరావులు వచ్చారు. పోలీసులను చూసి పారిపోయారు. పోలీసులు వెంటబడి తరిమి రమాకాంతరావును అక్కడే పట్టుకొని చంపేసారు. ప్రభాకర్‌ను మల్కాపురం గ్రామందాకా తరిమి అందుకొని కాల్చారు.

17. తేదీ: 16-12-1985 గ్రామం: నెల్లెల జిల్లా: వరంగల్

మోగంటి బాబూరావు అనే కార్యకర్తను మహబూబాబాద్ తాలూకా నెల్లెల గ్రామంలో జరిగిన 'ఎన్‌కౌంటర్' లో చంపినట్టు పోలీసులు ప్రకటించారు.

నిజానికి బాబూరావును డిసెంబర్ 16 కంటే చాలా రోజులు ముందే అరెస్టు చేసి సిరోల్ పోలీస్‌స్టేషన్‌లో అక్రమంగా నిర్బంధించి చిత్రహింసలకు గురిచేసి చంపినట్లు స్థానికులు చెప్పుకుంటున్నారు.

18. తేదీ : 20-12-1985 గ్రామం: రెబ్బదేవిపల్లి జిల్లా : కరీంనగర్

డిసెంబర్ 20 మధ్యాహ్నం, సుల్తానాబాద్ తాలూకా కేంద్రానికి సమీపంలోని రెబ్బదేవిపల్లిలో జరిగిన 'ఎన్‌కౌంటర్'లో తూగాని రాజయ్య, శ్రీను అనే కార్యకర్తలు చనిపోయినట్టు పోలీసులు తెలిపారు.

వాళ్ళిద్దరూ ఒక యింట్లో విశ్రాంతి తీసుకుంటుండగా పోలీసులు ఆ ఇంటికి నిప్పుపెట్టి, వాళ్ళు బయటికి రాగానే కాల్చిచంపినట్టు గ్రామస్తులు చెప్తున్నారు. అయితే వాళ్ళు బయటికివస్తూ పోలీసులమీద కాల్పులు జరపగా ఒక కానిస్టేబుల్ చనిపోయాడు. గత సంసత్సరం మొదటినుండి ఇప్పటిదాకా కరీంనగర్ జిల్లాలో జరిగిన 'ఎన్‌కౌంటర్ల'లో పోలీసులవైపు మరణం సంభవించిన సంఘటన ఇదొక్కటే.

19. తేదీ: 3-1-1986 గ్రామం: ఊట్లమట్వాడ జిల్లా: వరంగల్

ఊట్లమట్వాడ అడవి ప్రాంతంలో ఉంది. అక్కడ ఒక పోలీసు అవుట్ పోస్ట్ ఉంది. జనవరి 3 రాత్రి నర్సయ్య అనే వ్యక్తి అతని మిత్రుడు అవుట్ పోస్టు పక్కనుండి పోతుండగా సెంట్రీచూసి అనుమానించాడు అవుట్‌పోస్టులోని పోలీసులను హెచ్చరించాడు, వాళ్ళు ఈ 'నక్సలైట్ల' ను పట్టుకోవడానికి ఆయుధాలు వేసుకొని బయలుదేరారు. వాళ్ళను చూసి భయపడి ఆ యువకులిద్దరూ పరుగెత్తారు. పోలీసులు పారిపోతున్న వాళ్ళమీద కాల్పులు జరిపారు. నర్సయ్య గాయపడి కిందపడిపోయాడు. అతని మిత్రుడు పారిపోయాడు. పోలీసులే నర్సయ్యను ఆస్పత్రిలో చేర్పించగా అతను చనిపోయాడు.

పోలీసులు దీన్నిగూడ మొదట 'ఎన్‌కౌంటర్' అన్నారు గాని, తరువాత అసలు నర్సయ్య నక్సలైటే కాదని (అయితే ఏమో), 'పొరబాటయిపోయి'ందని చెప్పి అతని కుటుంబానికి 2000 రూపాయలు నష్టపరిహారం ప్రకటించారు.

20. తేదీ: 9-2-1986 గ్రామం; గౌరారం జిల్లా: నిజామాబాద్

ఫిబ్రవరి 8వ తేదీన ఆరుగురు రాడికల్స్ గౌరారంలో పోలీస్ ఇన్ఫార్మర్‌గా అనుమానిస్తున్న ఒక వ్యక్తిని కొట్టారని, ఆ రాత్రి వాళ్ళకోసం వెతుకుతూ గస్తీ తిరుగుతున్న పోలీసులకు 9వ తేదీ తెల్లవారుజామున గ్రామం వెలుపల అవుసల నర్సయ్య అనే రాడికల్‌తో 'ఎన్‌కౌంటర్' జరిగిందని, అతను చనిపోయాడని, పోలీసులు ప్రకటించారు.

అసలు జరిగిన వాస్తవం గ్రామ ప్రజలు తెలియచేసారు. ముందురోజు పోలీస్ ఇన్‌ఫార్మర్‌గా అనుమానించిన వ్యక్తిని రాడికల్స్ కొడుతూంటే కొంత మంది అడ్డుపడి వాళ్ళలో ఒకడయిన నర్సయ్యను పట్టుకున్నారు. పోలీసులు వచ్చిన తరువాత నర్సయ్యను పోలీసులకు తామే అప్పజెప్పారు. మర్నాడు పొద్దున పోలీసులు నర్సయ్య శవాన్ని గ్రామం బయట చూపించి, రాత్రి 'ఎన్‌కౌంటర్' జరిగిందని చెప్పారు. పోలీసులు తమ కస్టడీలోకి తీసుకున్నాక నర్సయ్యను చంపారన్నది స్పష్టమే.

21. తేదీ: 26-2-1986 గ్రామం: కోవెలపాలెం జిల్లా: తూర్పు గోదావరి

అడ్డతీగల ప్రాంతం అడవిలో 'తీవ్రవాదుల'తో పోలీసులకు జరిగిన 'ఎన్‌కౌంటర్'లో నలుగురు చనిపోయారని పోలీసులు ప్రకటించారు. అయితే ఈ నలుగురిని రెండు విడతలలో రెండుచోట్ల చంపారు. తిరుపతి పట్నాయక్, శివరావ్ అనే యిద్దరిని ఫిబ్రవరి 26న రాజమండ్రిలో చింతా నాగేశ్వరరావు అనే లారీడ్రైవర్ యింట్లో అరెస్టుచేసి, అడవిప్రాంతం అయిన కోవెలపాలెం తీసుకుపోయి అక్కడ కాల్చి చంపారు.

22. తేదీ: 27-2-1986 గ్రామం: అరిడాలబండ జిల్లా: తూర్పుగోదావరి.

పై సంఘటనకు కొనసాగింపుగా తరువాతిరోజు (ఫిబ్రవరి 27) ఉదయం అదే యింట్లోనుండి సత్యనారాయణ రాజు అనే ఇద్దరిని అరెస్టు చేసారు. వీళ్ళను అడవి ప్రాంతానికి తీసుకుపోక ముందు పోలీస్ గెస్ట్ హవుస్‌లో ఉంచగా, వేరే పని మీద అక్కడికి పోయిన స్థానిక పత్రికా విలేఖరులు చూసి 'ఎవరోలే' అనుకున్నారు. తరువాత వాళ్ళిద్దరినీ అడ్డతీగలకు 20 కి. మీ. దూరం వున్న అరిడాలబండకు తీసుకుపోయి కాల్చి చంపారు.

23. తేదీ: 20-5-1986 గ్రామం: వరంగల్ జిల్లా: వరంగల్

మే నెల 20-21 రాత్రి హనుమకొండలోని హంటర్ రోడ్డు మీద పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులకు నాగేశ్వరరావు, రామకృష్ణ అనే ఇద్దరు తీవ్రవాదులకు మధ్య ఎదురు కాల్పులు జరగగా వాళ్ళు మరణించారని పోలీసులు ప్రకటించారు.

స్థానిక కాలేజీలలో విద్యార్థులుగా ఉండిన ఈ యువకులిద్దరినీ , మే 20 రాత్రే అరెస్టు చేసారు. నాగేశ్వరరావును సాయంత్రం 7 గంటలప్పుడు కాజీపేటలోని ఒక యింటిలోను, రామకృష్ణను రాత్రి 11 గంటలప్పుడు వరంగల్ లోను అరెస్టు చేసారు. ఆరాత్రే చంపేసి శవాలను హంటర్ రోడ్డు మీద పడేసి వెళ్ళిపోయారు. ఒక్కొక్క శరీరంలోను గురిచూసి కాల్చినట్టు తుంటి భాగం నుండి ఎద వరకు ఎనిమిది బుల్లెట్లు ఉన్నాయని బంధువులు అంటున్నారు.

తరువాత రోజు జనం శవాలను చూసి పోలీసులకు తెలియజేయగా అప్పుడు వచ్చి చూసి రాత్రి 'ఎన్‌కౌంటర్' జరిగిందని ప్రకటించారు.

24. తేదీ: 10-6-1985 గ్రామం: కామారెడ్డి జిల్లా: నిజామాబాద్

కామారెడ్డి తాలూకా కేంద్రం. ఈ పట్టణంలోని పాఠశాల ఆవరణలో తమకు తీవ్రవాదులతో ఎదురు కాల్పులు జరగగా ఒక వ్యక్తి మరణించాడని, అతని వద్ద ఉన్న ఆయుధాన్ని బట్టి అతను రాడికల్ అని భావిస్తున్నామనీ పోలీసులు ప్రకటించారు. మృతుని పేరు రమేష్ అని తరువాత తెలిసింది.

అయితే నగరం నడి బొడ్డున ఉన్న పాఠశాల ఆవరణలో రాత్రి 9 గంటలకు జరిగిందని చెప్పబడుతున్న ఈ 'ఎదురుకాల్పుల' శబ్దం గూడ ఎవ్వరు వినలేదు. జూన్ 12న జరగవలసిన బంద్‌ను విఫలం చేయడం కోసం రమేశ్‌ను ఎక్కడో పట్టుకొని చంపి పాఠశాల ఆవరణలో పడేసి అక్కడ ఎదురు కాల్పులు జరిగాయని ప్రకటించినట్టు అనుమానించడానికి ఆస్కారం ఉంది.

1 25. తేదీ: 25-6-1986 గ్రామం: నగరం జిల్లా: నిజామాబాద్

పైన పేర్కొన్న 'ఎన్‌కౌంటర్' ఘటనకు నిరసనగా రాడికల్స్ జూన్ 25న నిజామాబాద్ జిల్లా బంద్‌కు పిలుపు యిచ్చారు. ఆ రోజుఉదయం నిజామాబాద్ పట్టణాన్ని ఆనుకొనిఉన్న నగరం గ్రామంలో మరొక'ఎన్‌కౌంటర్'జరిగి ఒక "అజ్ఞాత తీవ్రవాది" మరణించాడు.

పరిశీలనమీద తేలిన విషయం ఏమిటంటే, "ఎన్‌కౌంటర్" జరిగిందని చెపుతున్న స్థలానికి దగ్గరగాఉన్న జనం ఎవరూ ఆనాడు ఎటువంటి ఎదురు కాల్పుల ధ్వనీ వినలేదు. పైగా "ఎన్‌కౌంటర్" జరిగిందని చెపుతున్న స్థలం ఒక

వైపు చెరువుకూ ఒక వైపు కాలవకూ మధ్యనున్న ఇరుకయిన స్థలం. అక్కడ ఎదురెదురుగా కాల్పులు జరుపుకునే అవకాశం లేదు.

26. తేదీ: 27-6-1986 గ్రామం: అరేపల్లి జిల్లా: నిజామాబాద్

జూన్ 27 తెల్లవారుజామున నిజామాబాద్-మెదక్ సరిహద్దున ఉన్న ఈ గ్రామంలో జరిగిన 'ఎదురుకాల్పుల' లో మరొక 'అజ్ఞాత తీవ్రవాది' మరణించినట్టు పోలీసు కథనం. వివరాలు తెలీవు.

27. తేదీ : 26-8-86 గ్రామం : భట్టుపల్లి జిల్లా : కరీంనగర్

ఆగస్టు 26నాడు జగిత్యాల తాలూకా భట్టుపల్లి గ్రామంలో ఎన్‌కౌంటర్ జరిగి లక్ష్మీనర్సయ్య అనే కార్యకర్త చనిపోయినట్టు పోలీసులు ప్రకటించారు. పోలీసుల ప్రకటన ప్రకారం అతను గతసంవత్సరం జగిత్యాల తాలూకా ధర్మపురి గ్రామంలో జరిగిన ఒక కానిస్టేబుల్ హత్యకేసులో నిందితుడు. 'ఎన్‌కౌంటర్' జరిగినతరువాత పోలీసులు లక్ష్మీనర్సయ్య మృతదేహాన్ని ధర్మపురి తీసుకొచ్చి కానిస్టేబుల్‌ను చంపిన స్థలం (బస్‌స్టాండు) వద్ద పడుకోబెట్టి అతని మృతిని ప్రకటించారని పత్రికలలో వార్తలు. దీనిని బట్టి కానిస్టేబుల్ హత్యకు ఇది ప్రతీకారమే తప్ప ఎన్‌కౌంటర్ కాదని అర్థం అవుతుంది. ఒక చెప్పుకోదగ్గ విశేషం ఏమిటంటే 1985 మే 26న అదే తాలూకాలోని చిననక్కలపేటలో ఎన్‌కౌంటర్ పేరిట జరిగిన హత్యలో గుండ్ల నారాయణ చనిపోగా లక్ష్మీనర్సయ్య కొద్దిలో తప్పించుకున్నాడు.

కొద్దికాలంగా లక్ష్మీనర్సయ్య బొంబాయి నగరం దగ్గరున్న జవుళి మిల్లుల కేంద్రం భీవాండీలో ఉంటున్నాడనీ, కరీంనగర్ పోలీసులు అతన్ని అక్కడి నుండి అరెస్టుచేసి తీసుకొచ్చి ఇక్కడ చంపి 'ఎన్‌కౌంటర్' అని పేరు పెట్టారనీ, తెలుస్తోంది.

28 తేదీ: 6-9-86 గ్రామం: వరంగల్ జిల్లా: వరంగల్

సెప్టెంబర్ 6వ తేదీ రాత్రి వరంగల్ పట్టణంలోని హంటర్‌రోడ్డులో 'ఎన్‌కౌంటర్' జరిగి శ్యాంప్రసాద్‌బాబు, శ్రీనివాస్, అనే యిద్దరు యువకులు చనిపోయినట్టు పోలీసులు ప్రకటించారు. శ్యాంప్రసాద్ స్థానిక రీజనల్ ఇంజనీరింగ్ కాలేజీలో బి. టెక్ విద్యార్థి. శ్రీనివాస్ ఆర్ట్స్ కళాశాలలో చదువు ముగించుకొని తన స్వగ్రామం అయిన గూనిపర్తిలో ఉంటున్నాడు. అతను రహస్య కార్యకర్త కాదు కాబట్టి అతన్ని చంపవలసిన 'అవసరం' పోలీసులకు ఎంతమాత్రం లేదు. శ్యాంప్రసాద్‌తోబాటు దొరికాడు కాబట్టి సాక్ష్యాలు లేకుండ చేయడంకోసం చంపారనుకోవాలి.

29. తేదీ: 15-9-86 గ్రామం: వారణి(సమీపం) జిల్లా: నిజామాబాద్

వారణి మండల కేంద్రం సమీపంలోని అడవిలో దాగివున్న కొందరు రాడికల్స్ హస్నాజీపేట రోడ్డుమీద పోతూవున్న పోలీసుల మీద అకస్మాత్తుగా కాల్పులు జరిపారంట. పోలీసులు 'ఆత్మరక్షణార్థం' ఎదురు కాల్పులు జరిపారంట. రాడికల్స్ జరిపిన కాల్పుల వల్ల పోలీసులకు ఏమీ కాలేదుగాని, వాళ్ల జరిపిన 'ఎదురుకాల్పుల'లో ఎర్రబోయిన అచ్చన్న ఉరఫ్ భీమన్న అనే వ్యక్తి చని పోయాడంట. 'నమ్మితే నమ్మండి' అనే పద్ధతిలో పోలీసులు విడుదల చేసిన ఈ ప్రకటన వెనక వున్న వాస్తవం ఏమిటో ఇప్పటిదాకా తెలీదు.

30. తేదీ: 19-9-86 గ్రామం: శనివారంపేట జిల్లా: కరీంనగర్

కొడిమ్యాల పోలీస్‌స్టేషన్ పరిధిలో వుంది శనివారంపేట అనే గ్రామం. పోలీసుల కథనం ప్రకారం, పిక్యాల రాజలింగం అనే కార్యకర్త సెప్టెంబర్ 19 సాయంత్రం ఈ గ్రామంలోని ఒక పశువుల కొట్టంలో వున్నాడంట. ఆ సంగతి తెలిసి పోలీసులు గ్రామానికి వచ్చి పశువుల కొట్టాన్ని చుట్టుముట్టారు. వాళ్ల లోపలికి పోగా రాజలింగం వాళ్లమీద కాల్పులు జరిపి, వాళ్ల 'ఎదురు కాల్పుల' లో గాయపడి తాను పారిపోయాడు. పొద్దున్న చూద్దురు గదా, అతని శవం సమీపంలోని కందిచేలో కనపడిందట.

అబద్ధపు కథలో నిజం చూడటం చేతనయితే, పోలీసులు రాజలింగంను చంపేసి శవాన్ని ఊరి బయట కందిచేలో పడేసారని అర్థం అవుతుంది.

ఇవికాక, 1986 మార్చి నెలలో ఆదిలాబాద్ జిల్లా నిర్మల్ దగ్గర ఒక 'ఎన్‌కౌంటర్' జరిగి భాస్కర్ అనే కార్యకర్త మరణించినట్టు పత్రికలలో వార్తలు వచ్చాయి. ఈ సంఘటన గురించి ఏ వివరాలూ తెలియడం లేదు.

ప్రతులకు

ఎం. కోదండరాంరెడ్డి
2-2-1144/11/3A/A
న్యూ నల్లకుంట
హైదరాబాద్-500 044

ఎస్. సుభాస్‌చంద్రబోస్
అడ్వకేట్
డోర్నకల్ మిషన్ రోడ్
సూర్యారావుపేట
విజయవాడ-520 002

ఎస్. శేషయ్య
లా లెక్చరర్
ఎస్. కె. యూనివర్శిటీ
అనంతపురం-515 003


చదవండి ! చదివించండి !!

# స్వేచ్ఛ

ఎ.పి.సి.ఎల్.సి. మాసపత్రిక

సంపాదకుడు : ఎం. కోదండరాంరెడ్డి

విడిప్రతి 1 రూ॥ సంవత్సర చందా 10 రూ॥

1983 నవంబర్ 7 ఉదయం ఇంకా తెల్లవారలేదు. కరీంనగర్ జిల్లా అల్గునూర్ గ్రామంలోని ఎ. పి. సి. ఎల్. సి. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీ జాపా లక్ష్మారెడ్డి ఇంటిబయట ఒక తెల్లటి అంబాసిడర్ కారు ఆగింది. అందులోంచి నలుగురు వ్యక్తులు దిగి లక్ష్మారెడ్డిగారిని ఇంటినుండి బయటకు పిలిచి, తలుపు బయట గొళ్ళెం పెట్టి చేతులు వెనక్కి విరిచి కట్టి కాల్చి చంపారు.

చంపినవాళ్ళు పోలీసులేననడంలో ఎటువంటి సందేహానికీ ఆస్కారం లేదు. అంతకుముందురోజు పెద్దపల్లి డి.ఎస్.పి.ని ఎవరో చంపారని అందుకు 'ప్రతీకారం'గా ఆ హత్యతో ఏ సంబంధం లేని లక్ష్మారెడ్డి గారిని పోలీసులే హత్యచేసారు. డాక్టర్ రామనాధం గారిని వరంగల్ పోలీసులు చంపినట్లు ఈయనను కరీంనగర్ పోలీసులు చంపారు.

1940 నుండి కూడ ప్రజాస్వామిక ఉద్యమాలతో వున్న లక్ష్మారెడ్డి గారు ఎ.పి.సి.ఎల్.సి నిర్మాతలలో ఒకరు. వరంగల్, కరీంనగర్ జిల్లాలలో గత రెండేళ్ళుగా పోలీసులు ఒక్కొక్క ఎ.పి.సి.ఎల్.సి కార్యకర్తను అరెస్టుచేసి, కొట్టి, బెదిరించి, రాజీనామా చేయాలని ఒత్తిడి చేసారు. చాలా మంది అయిష్టంగానే చేసారు. ఎంత బెదిరించినా లొంగకుండా చివరిదాకా నిలబడ్డ ఒకరిద్దరు కార్యకర్తలలో శ్రీ లక్ష్మారెడ్డిగారు ఒకరు. అందుకు 'శిక్ష'గా ఆయన ప్రాణాన్ని తీసారు.

ఇటువంటి హత్యలకూ బెదిరింపులకూ పౌరహక్కుల ఉద్యమం లొంగిపోదు. ఇంకెంత దృఢదీక్షతో గోపి రాజన్న, డాక్టర్ రామనాథం, లక్ష్మారెడ్డి వంటివారు తమ జీవితాలూ, ప్రాణాలూ ఏ ఆశయాలకోసం అర్పించారో ఆ ఆశయాలను ముందుకు తీసుకుపోతుంది.